

సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం 15 నెలల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసి హామీలు నిలబెట్టింది. జగన్ వదిలిన రూ.10 లక్షల కోట్ల అప్పులను తీరుస్తూ ముందుకు సాగుతున్నా వైసీపీ నేతలు మాత్రం దుష్ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

సోమవారం 15.09.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 | సంచిక - 150 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00




రోజుకు లక్షమంది రాకపోకలు సాగించేలా బస్ స్టేషన్

కమర్షియల్ కాంప్లెక్స్, ఈవీ చార్జింగ్ స్టేషన్లతో డిజైన్లు

నమూనాలను పరిశీలించిన ముఖ్యమంత్రి

## తిరుపతిలో.. అత్యాధునిక బస్ స్టేషన్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రోజురోజుకు పెరుగుతున్న యాత్రికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని తిరుపతిలో అత్యాధునిక బస్ స్టేషన్ నిర్మించాలని, అన్ని సౌకర్యాలతో ఆకట్టుకునేలా ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్మెంట్ లిమిటెడ్, ఏపీఎస్ఆర్టీసీ అధికారులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి... నూతనంగా నిర్మించే బస్ స్టేషన్‌లో సుమారు 150 బస్సులు ఒకేసారి నిలిపి ఉంచేలా బస్ బే ఉండాలని, హెలిపాడ్ సౌకర్యంతో పాటు, రోప్ వే, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, మాల్స్, మల్టీ ప్లెక్స్‌లతో డిజైన్లు రూపొందించాలని అధికారులకు సూచించారు. రెండు బస్ ఎంట్రీలు, ఎగ్జిట్ వేలు 2 ఏర్పాటు చేయాలని, సోలార్ రూఫ్ టాప్‌తో సొంత విద్యుత్ అవసరాలు తీర్చుకునేలా చూడాలన్నారు. మొత్తం 13 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించ తలపెట్టిన ఈ బస్ స్టేషన్ కనీసం లక్ష మంది నిత్యం రాకపోకలు సాగించేందుకు వీలుగా నిర్మాణం చేయాలన్నారు. భవిష్యత్‌లో అన్నీ ఎలక్ట్రికల్ బస్సులే నడపనున్న నేపథ్యంలో ప్రతీ బస్సుకు చార్జింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. దీనికి సంబంధించి మొత్తం 5 మోడల్స్‌ను ముఖ్యమంత్రి పరిశీలించారు. వాటిని మరింత అభివృద్ధి చేయాలన్నారు. దీనికోసం స్టేక్ హోల్డర్లతో సమావేశం నిర్వహించాలన్నారు. అలాగే రాష్ట్రంలో అన్ని బస్ స్టేషన్లు ఆధునీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచనలు చేశారు.

## వికసిత్ భారత్‌కు.. మహిళల నాయకత్వం



**తిరుపతి(జర్నలిస్ట్ ఫైల్):** తిరుపతిలో తొలి జాతీయ మహిళా సాధికారత సదస్సు జరిగింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆధ్వర్యంలో 'వికసిత్ భారత్‌కు మహిళల నాయకత్వం' అనే నినాదంతో ఈ సదస్సును నిర్వహించారు. రెండు రోజుల సదస్సులో భాగంగా నేడు తిరుపతిలోని రాహుల్ కన్వెన్షన్‌లో సదస్సును ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో పాటు రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ సింగ్, ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. అలాగే ఈ సదస్సుకు శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మంత్రి పయ్యావుల కేశవ్, పార్లమెంట్ కమిటీ (మహిళా సాధికారత) ఛైర్‌పర్సన్ దగ్గుబాటి పురందేశ్వరితో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూటమి నేతలు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ, మహిళలకు గౌరవం ఇవ్వడం ఆది నుంచి వస్తున్న భారత సంప్రదాయమని అన్నారు. దేశంలో ఆధ్యాత్మిక, సామాజిక ఉద్యమాల్లో స్త్రీలు కీలక పాత్ర పోషించారని చెప్పారు. "స్వాతంత్ర్య పోరాటంలోనూ మహిళలు కీలకపాత్ర పోషించారు. వారి భాగస్వామ్యం లేకుండా ఏ దేశమూ అభివృద్ధి చెందలేదు. సామాజిక బంధనాలను ఛేదించుకుని మహిళలు అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. వారికోసం రాజ్యాంగం అనేక నిబంధనలు రూపొందించింది. మహిళా శక్తి కారణంగానే ఇవాళ ప్రపంచంలోనే భారత్ ముఖ్యదేశంగా అవతరించింది.

భరతభూమిలో మహిళా నాయకత్వం శతాబ్దాలకు ముందే ప్రారంభమైంది. ఇవాళ అనేక రంగాల్లో నాయకత్వ స్థానాల్లో రాణిస్తున్నారు. రాజకీయాలు, శాస్త్ర సాంకేతిక రంగాలు, సైన్యంలోనూ కీలకపాత్ర పోషిస్తున్నారు. ఆదివాసీ నేపథ్యం నుంచి వచ్చిన మహిళ ప్రస్తుతం రాష్ట్రపతిగా ఉన్నారు. మహిళా సాధికారత ఒక్కరోజులో సాధ్యం కాదు. అనేక కార్యక్రమాలు చేపడుతూ ఉంటే సాధ్యమవుతుంది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చట్టం చేశాం" అని ఓం బిర్లా తెలిపారు.

**ఎన్టీఆర్‌కు ప్రణామాలు :** మహిళా సాధికారత కోసం ఎన్టీఆర్ ఎంతో కృషి చేశారని ఆయనకు ప్రణామాలని రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ సింగ్ అన్నారు. అభివృద్ధి చెందిన ఎన్నో దేశాలు మహిళలకు ప్రాధాన్యత ఇచ్చాయని చెప్పారు. మహిళల సాధికారతకు ప్రధాని మోదీ అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. బిహార్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో తొలిసారిగా మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేశామని హరివంశ్ తెలిపారు. జన్‌ధన్ యోజనలో సగానికిపైగా మహిళలకు ఖాతాలు ఉన్నాయని చెప్పారు. ఉమ్మడి ఏపీని టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దడంలో సీఎం చంద్రబాబు కీలక పాత్ర పోషించారన్నారు. దేశంలోనే తొలిసారిగా నైపుణ్య గణనను ఏపీలో చేపట్టారని తెలిపారు. శ్రీసిటీలో సగానికి పైగా మహిళలు ఉద్యోగాలు చేస్తున్నారన్నారు.

**స్వాతంత్ర్య ఉద్యమంలో మహిళలు :** మహిళా సాధికారతకు అనేక పథకాలు తీసుకొచ్చామని పార్లమెంట్ కమిటీ (మహిళా సాధికారత) ఛైర్‌పర్సన్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బేటీ బచావో-బేటీ పడావో, మహిళా సమ్మాన్ నిధి సహా అనేక పథకాలు వచ్చాయని చెప్పారు. సామాజిక అడ్డంకులను అధిగమించి అనేక మంది మహిళలు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. మహిళల ఆర్థిక, విద్య, రాజకీయ సమానత్వం కోసం పోరాడుతున్నామని చెప్పారు.

**అసెంబ్లీకి రాకపోయినా జీతాలు :** కొందరు ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకపోయినా జీతం తీసుకుంటున్నారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. "ప్రజలు మనల్ని ఎన్నుకున్నది ప్రజా సమస్యలు పరిష్కరించడానికే. ఉద్యోగాలకు రాకపోతే ఉద్యోగులపై చర్యలు తీసుకుంటున్నాం. చిరుద్యోగులు సైతం 'నో వర్క్ - నో పే' విధానం అనుసరిస్తున్నారు. అసెంబ్లీకి రాకపోతే తీసుకోవాల్సిన చర్యలపై లోక్‌సభ స్పీకర్ మార్గదర్శకాలు ఇవ్వాలి. ఏడాదిలో అసెంబ్లీ సమావేశాలు జరిగేదే 45 రోజులు వాటికి కూడా రాకపోతే ఎలా?" అని అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు.

"మహిళా సాధికారత కోసం పార్టీలకతీతంగా కృషి చేయాలి. మహిళలకు ఆస్తిలో సగభాగం ఇవ్వాలని చెప్పిన ఏకైక నాయకుడు ఎన్టీఆర్. ఆడపిల్లలు చదువుకోవాలని ఇదే తిరుపతిలో పద్మావతి మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేసిన ఘనత ఆయనది. మరోవైపు స్వయం సహాయక బృందాలను చంద్రబాబు బలోపేతం చేశారు. రాజకీయాల్లో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించారు. ఏపీ మంత్రివర్గంలో ముగ్గురు మహిళలున్నారు"

మిగతా 2లో...

## మోదీ చొరవతో ఏపీ అభివృద్ధి

- ప్రధాని మోదీ చొరవతోనే దివాలా తీసిన రాష్ట్రం గాడిన పడింది



**విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్):** ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2030 నాటికి భారత్ ను ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతారని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఆదివారం విశాఖపట్నంలో నిర్వహించిన సారథ్యం బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. డబుల్ ఇంజిన్ సర్కార్ తో ఏపీని అభివృద్ధి చేస్తూ.. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. కేంద్రం, రాష్ట్రంలో సమర్థవంతమైన నాయకులు పరిపాలిస్తున్నారని, రాష్ట్రంలో బీజేపీని భౌగోళికంగా విస్తరించేలా కార్యకర్తలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. బీజేపీ అభివృద్ధిని కాంక్షించే పార్టీ అన్నారు. వెంటిలేటర్ పై ఉన్న ఆంధ్రప్రదేశ్ ను మళ్లీ అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రధాని మోదీ ఎంతో సహకారం అందించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అనేక పథకాలు అమలు చేస్తోందని, ఇప్పటి వరకూ 10 కేంద్ర సంస్థలు రాష్ట్రానికి వచ్చాయని తెలిపారు. మోదీ చొరవతోనే దివాలా తీసిన రాష్ట్రం గాడిన పడిందన్నారు. బీజేపీ జెండా, అజెండా ప్రజల్లో మమేకం కావాలని మంత్రిసత్యకుమార్ పిలుపునిచ్చారు.

కాగా.. సారథ్యం సభకు బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ముఖ్య అతిథిగా హాజరవ్వగా.. బీజేపీ నేత మాధవ్ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అరకు కాఫీ, ఏటికొప్పాక బొమ్మలు, పొందూరు ఖాదీ కళాకృతులు, ఇతర స్టాల్స్ ను నడ్డా సందర్శించారు. సారథ్యం టేబుల్ బుక్ ను జేపీ నడ్డా విడుదల చేయగా, ఆయన్ను మాధవ్ గజమాలతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

## జగన్ అక్రమాలు బయటపెడతాం :జేపీ నడ్డా



**విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్):** వైసీపీ హయాంలో అవినీతి రాజ్యమేలిందని కేంద్రమంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా విమర్శించారు. ఆదివారం విశాఖపట్నంలో బీజేపీ సారథ్యం యాత్ర ముగింపు సభకు ముఖ్య అతిథిగా జేపీ నడ్డా హాజరయ్యారు. ఈ సందర్భంగా జేపీ నడ్డా మాట్లాడారు. బీజేపీ సారథ్యం యాత్ర విజయవంతంగా సాగిందని ఉద్ఘాటించారు.

వైసీపీ అవినీతి పాలనకు కూటమి చరమగీతం పాడిందని చెప్పుకొచ్చారు. ఎన్డీయే పాలనలో ఏపీ అభివృద్ధిలో దూసుకుపోతోందని నొక్కిచెప్పారు. 2014కు ముందు దేశంలో అసమర్థ, వారసత్వ ప్రభుత్వాలు ఉండేవని విమర్శించారు. 2014 తర్వాత దేశంలో వచ్చిన మార్పులను ప్రజలు గమనించాలని జేపీ నడ్డా సూచించారు. వైఎస్ జగన్ అక్రమాలు మొత్తం బయటపెడతామని జేపీ నడ్డా హెచ్చరించారు.

**11 ఏళ్లలో ఇచ్చిన మాటను అమలు చేశాం.. :** 'విశాఖపట్నం ఈస్ట్ కోస్ట్‌కి మణిహారం లాంటిది. నరేంద్రమోదీ అధికారంలోకి రాక ముందు అవినీతి, ప్రజా వ్యతిరేక ప్రభుత్వం నడిచేది. వైసీపీ అసమర్థ, అస్తవ్యస్త ప్రభుత్వాన్ని కూలదోసి కూటమిని ఎంచుకున్నందుకు ప్రజలకు ధన్యవాదాలు. మిగిలిన రాజకీయ పార్టీలు ఏ ఎండకు ఆ గొడుగు పడితే.. బీజేపీ సిద్ధాంతం మీద, కేడర్ మీద ఆధారపడుతోంది. బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ 26 జిల్లాల్లో సారథ్యం యాత్ర చేశారు. ఈ సందర్భంగా మాధవ్, బీజేపీ నేతలు, కార్యకర్తలకు ధన్యవాదాలు. 11 ఏళ్లలో ఇచ్చిన మాటను అమలు చేశాం' అని జేపీ నడ్డా పేర్కొన్నారు.

**బీజేపీ ఐడియోలాజికల్ పార్టీ...:** 'బీజేపీ ఒక ఐడియోలాజికల్ పార్టీ. ప్రపంచంలోనే అత్యధిక మంది కార్యకర్తలు బీజేపీలోనే ఉన్నారు. ఆర్టికల్ 370, అయోధ్యలో రామమందిరం నిర్మాణం, ట్రిపుల్ తలాక్ ఇలా ఎన్నో సమస్యలను పరిష్కరించాం. 11వ లార్జెస్ట్ ఎకానమీగా భారతదేశం ఉండేది. ఇప్పుడు నాల్గోవ లార్జెస్ట్ ఎకానమీగా అవతరించింది. భవిష్యత్‌లో మూడోదిగా అవతరిస్తుంది. డిఫెన్స్, మెడికల్ అనేక రంగాల్లో మేము ముందుకు వెళ్తున్నాం. ఏపీలో చంద్రబాబు నాయకత్వం, మోదీ సహకారంతో కేంద్రం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తోంది. వైసీపీ హయాంలో అవినీతి, అక్రమాలు, అరాచక పాలన ఉంది. అంధకారంలోకి వెళ్లిన ఏపీని మోదీ, కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నాం. మోదీ మదిలో ఏపీ ఉంటుంది. ఏపీ ప్రజల మదిలో మోదీ ఉంటారు' అని జేపీ నడ్డా ఉద్ఘాటించారు.

## తాతకు తగ్గ మనవడు

ఫాస్టెస్ట్ చెక్ మేట్ సాల్వర్ గా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డ్ అందుకున్న నారా దేవాన్ష్

లండన్ లోని వెస్ట్ మినిస్టర్ హాల్ లో అవార్డ్ అందుకున్న దేవాన్ష్

అవార్డ్ ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నారా లోకేష్

చాలా గర్వంగా ఉందని, ఇదో ప్రత్యేకమైన ఘనతని వ్యాఖ్య




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తనయుడు, పదేళ్ల యువ చెస్ ప్రాడిజీ నారా దేవాన్ష్ చదరంగంలో అత్యంత క్లిష్టమైన 175 పజిల్స్ ను వేగంగా పరిష్కరించడం ద్వారా ఫాస్టెస్ట్ చెక్ మేట్ సాల్వర్ గా ప్రపంచ రికార్డ్ సాధించినందుకు గాను వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డ్స్-2025 అందుకున్నాడు. లండన్ లోని వెస్ట్ మినిస్టర్ హాల్ లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొని "ఫాస్టెస్ట్ చెక్ మేట్ సాల్వర్-175 పజిల్స్" అవార్డ్ అందుకున్నాడు. ఈ కార్యక్రమానికి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు.


ఈ ఘనతను సాధించేందుకు నారా దేవాన్ష్ గతేడాది చెక్ మేట్ మారథాన్ లో లాస్లో పోల్గార్ ప్రసిద్ధ చెస్ సంకలనం '5334 ప్రాబ్లమ్స్ అండ్ గేమ్స్' పుస్తకం నుంచి తీసుకున్న 175 సంక్లిష్టమైన చెక్ మేట్ పజిల్స్‌ను

మిగతా 2లో...

## శరవేగంగా.. పర్యాటకాభివృద్ధి

### ఆక్వాకల్చర్, అగ్రికల్చర్ హబ్ గా తూర్పుగోదావరి జిల్లా

**రాజమహేంద్రవరం (జర్నలిస్ట్ ఫైల్) : :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి శరవేగంగా జరుగుతోందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ 15 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర పర్యాటకాభివృద్ధికి తీసుకున్న చర్యలు, పనుల పురోగతిని వివరించారు. అదే విధంగా తాజా రాజకీయ పరిణామాలు, వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, మెడికల్ కాలేజీల అంశం, నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధి కోసం చేస్తున్న కృషి, జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణం తదితర అన్ని అంశాలను మీడియా ప్రతినిధులతో మంత్రి కందుల దుర్గేష్ పంచుకున్నారు. దాదాపు గంట సేపు మీడియా ప్రతినిధులతో మంత్రి దుర్గేష్ సంభాషించారు. మీడియా ప్రతినిధులు అడిగిన అన్ని ప్రశ్నలకు స్పష్టంగా సమాధానాలిచ్చారు.



**15 నెలల కాలంలో రూ.10,644 కోట్ల పర్యాటక పెట్టుబడులు సాధించాం:** కూటమి ప్రభుత్వ 15 నెలల కాలంలో రూ. 10,644 కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు కుదుర్చుకున్నామని మంత్రి దుర్గేష్ అన్నారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలలో పెట్టుబడిదారుల సదస్సులు ఏర్పాటు చేసి పర్యాటకాభివృద్ధికి ఉన్న అవకాశాలు వివరించామన్నారు. ఇప్పటికే రూ. 698 కోట్లతో 88 ప్రాజెక్టులు ప్రారంభించినట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. తద్వారా పర్యాటక, అతిథ్య రంగంలో 3554 మందికి ఉపాధి కలగనుందన్నారు. పర్యాటక రంగం ద్వారా ఆర్థిక పురోభివృద్ధి, ఉపాధి కల్పనకు, సాంస్కృతిక మార్పిడికి బాటలు వేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అదే విధంగా ఐదేళ్లలో రూ. 25,000 కోట్లు పర్యాటక పెట్టుబడులు ఆకర్షించాలని ధ్యేయంగా పెట్టుకున్నామన్నారు. రాష్ట్రంలోని హోటళ్లలో గదుల సంఖ్యను 50 వేలకు పెంచేలా నిర్ణయించామన్నారు. ఇప్పటికే ఆ దిశగా అడుగులు పడ్డాయన్నారు. 4.6 శాతం ఉన్న జీవీఏను 8 శాతానికి పెంచడం, 28 శాతానికి పైబడి జీవీఏను కంట్రిబ్యూట్ చేయడం, పర్యాటక రంగంలో 12 శాతం ఉపాధిని 15 శాతానికి పెంచాలన్న ధ్యేయంతో పర్యాటక శాఖ పనిచేస్తుందన్నారు.


మిగతా 2లో...

## నేటి నుంచి కలెక్టర్ల కాన్ఫరెన్స్

- 4వ కాన్ఫరెన్సులో అంశాల వారీగా శాఖలపై సమీక్ష
- వృద్ధిరేటు, పౌర సేవలు, ప్రభుత్వ పథకాలపై దిశానిర్దేశం చేయనున్న సీఎం చంద్రబాబు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఈ నెల 15,16 తేదీల్లో రెండు రోజుల పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 4వ కలెక్టర్ల కాన్ఫరెన్సు జరుగనుంది. సచివాలయం ఐదో బ్లాక్ లో ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సు ప్రారంభం కానుంది. పౌరసేవలు, పథకాల అమలుపై జిల్లాల

మిగతా 2లో...



## పంచాయతీల్లో మోసాలకు చెక్




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పంచాయతీల్లో మోసాలకు చరమగీతం పాడే వ్యవస్థను కూటమి ప్రభుత్వం తీసుకొచ్చింది. అవినీతి రహిత పన్ను విధానాన్ని పంచాయతీ స్థాయిలో అమలు చేసే సాంకేతికతను అమలు చేయడానికి ముందుకొచ్చింది. స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో పన్ను చెల్లింపుల విధానానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు పురపాలనకే పరిమితమైన ఈ విధానం గ్రామీణ ప్రాంతాల జనాలకు చేరువైంది. ఇప్పటికే గ్రామాల్లో ఉన్న ఇళ్ల వివరాలను కంప్యూటరీకరించారు.

పన్ను చెల్లించాలనుకునే వ్యక్తి వెబ్‌సైట్‌లో ఆధార్ సంఖ్య, ఫోన్ నంబర్, యజమాని పేరు నమోదు చేస్తే చెల్లించాల్సిన పన్ను వివరాలు కనిపిస్తాయి. యూపీఐ, క్రెడిట్, డెబిట్ కార్డుల ఆధారంగా పన్ను చెల్లించి రసీదు పొందొచ్చు. నమోదు చేసిన చరవాణికి సంక్షిప్త సందేశం వస్తుంది. ఇలా చెల్లించిన నగదు నేరుగా పంచాయతీ ఖాతాలో జమవుతుంది.

**నకిలీ ఇంటి పన్ను రసీదులు :** అనకాపల్లి జిల్లా అచ్యుతాపురానికి సమీపాన గాజువాక రోడ్డులో ఒకరు ఇంటిని కొనుగోలు చేశారు. ఇంటి పన్నును తన పేరున మార్చాలని పంచాయతీ కార్యదర్శిని సంప్రదిస్తే ఇంటి ఖరీదులో రూ.లక్షకు రూ.వెయ్యి చొప్పున ఇస్తే వీలుకాదన్నారు. చేసేది లేక కొంత మొత్తం సమర్పించుకొని పన్ను రసీదు పొందాడు. అలాగే పూడిమడక మత్స్యకారులకు నకిలీ ఇంటి పన్ను రసీదులు అందించి చేతివాటం ప్రదర్శించారు.

మిగతా 2లో...

# సంపాదకీయం

## సరిహద్దు గ్రామాల భవిష్యత్తు:
## కోనసీమలో జీవనం ఆధారంగా పరిష్కారం కావాలి

ఆంధ్రప్రదేశ్‌లో జిల్లా సరిహద్దుల పునర్వ్యవస్థీకరణ అంశం మళ్లీ చర్చనీయాంశంగా మారింది. కూటమి ప్రభుత్వం సరిహద్దు గ్రామాలు, మండలాలు, జిల్లాలను వారి భౌగోళిక, సామాజిక, ఆర్థిక అవసరాలను బట్టి సమన్వయం చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది.

కోనసీమకు అత్యంత దగ్గరగా ఉన్న పశ్చిమగోదావరి జిల్లా ఆచంట, యలమంచిలి మండలాల లంక ప్రాంతాలుఅయోధ్యలంక, మర్రిమూల, పుచ్చల్లంక, రావిలంక, కనకాయలంక, పెదలంకువారి దైనందిన జీవనం పూర్తిగా కోనసీమపై ఆధారపడి ఉంది. విద్యార్థులు పాఠశాలలకు, పెద్దవాళ్లు వైద్య సేవలకు రోజువారీగా కోనసీమ చేరతారు. రైతులు, వ్యాపారులు మార్కెట్ అవసరాల కోసం కూడా అక్కడే వెళ్తున్నారు.

కీలక సమస్య: రాజకీయ ప్రాతినిధ్యం వేరే, జీవన విధానం వేరే. ఈ గ్రామాలు నరసాపురం పార్లమెంట్, ఆచంట, పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందగా, వాస్తవ జీవన అవసరాలు కోనసీమపై ఆధారపడి ఉండటం స్థానికులకు అసౌకర్యాలను కలిగిస్తుంది. పథకాలు, అభివృద్ధి నిధుల విషయంలో తక్కువ ప్రాధాన్యత పొందుతున్నామని వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజల కోరిక** :“మమ్మల్ని కోనసీమ జిల్లాలో కలపగలరా?” అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**ఒకవేళ విలీనం జరిగితే:**విద్య, ఆరోగ్యం, వ్యవసాయ వ్యాపారం, రవాణా సౌకర్యాలు సులభతరం అవుతాయి. స్థానిక ప్రజల రాజకీయ ప్రాతినిధ్యం స్పష్టమవుతుంది. సమస్యలకు త్వరిత పరిష్కారం లభిస్తుంది.

**భవిష్యత్తుపై ఉత్కంఠ** : ప్రస్తుతం మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయాన్ని ఎదురుచూస్తున్న స్థానికులు భవిష్యత్తుపై ఉత్కంఠతో ఉన్నారు. సానుకూల నిర్ణయం వస్తే, గ్రామాల జీవనం, అభివృద్ధి, సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుంది. లేకుంటే సమస్య మళ్లీ వాయిదా పడే అవకాశం ఉంది.

సరిహద్దు గ్రామాల సమస్య కేవలం భౌగోళిక పరిమితి సమస్య కాదు. ఇది ప్రజల దైనందిన జీవన విధానం, అభివృద్ధి అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యంతో మిళితమైన సవాలుగా ఉంది. కూటమి ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఈ ప్రాంతాల భవిష్యత్తును నిర్ణయించే కీలక మలుపుగా నిలుస్తుంది.

**-అజయ్ చంద్ర, ఎడిటర్, జర్నలిస్ట్ ఫైల్**

# శరవేగంగా.. పర్యాటకాభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

ఒక రోజు విజిట్ కు వచ్చిన పర్యాటకుడు కనీసం రెండు, మూడు రోజులు ఆయా పర్యాటక ప్రాంతాల్లో ఉండేలా మౌలిక వసతులు కల్పించడంతో పాటు పర్యాటక రంగంలో ఒక పర్యాటకుడు పెట్టే ఖర్చును 1,700 నుండి 25,000 ఖర్చు చేసే విధంగా ప్రణాళికలు రచించామన్నారు. ఈ క్రమంలో టెంపుల్ టూరిజంతో పాటు ఎకో, వెల్ నెస్, అడ్వెంచర్, క్రూజ్, రివర్, హెరిటేజ్, రిలీజియస్ తదితర టూరిజం ప్రక్రియలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2047 నాటికి ప్రపంచంలో ఏపీని ప్రధాన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. భారతదేశానికి విదేశీ పర్యాటకులు అత్యధికంగా వచ్చే టాప్ 10 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌ను ఒకటిగా తయారుచేయాలన్న తమ ఆలోచన అని మంత్రి దుర్గేష్ వివరించారు.

**పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదాతో ఊతం**: సీఎం చంద్రబాబునాయుడు పర్యాటకరంగానికి పారిశ్రామిక హోదా కల్పించడంతో ఊతం లభించిందని మంత్రి దుర్గేష్ అన్నారు. తద్వారా ఏదైనా ప్రాజెక్టు పెట్టినప్పుడు భూకేటాయింపులు, ఎస్జీఎస్టీ రీయింబర్స్ మెంట్ తో పాటు కేపిటల్ సబ్సిడీ, క్వాలిటీ సర్టిఫికెట్, ఉద్యోగాల కల్పనపై రాయితీలు, తాగునీటి ఛార్జీలు, మురుగునీటి శుద్ధి, ఆస్తి పన్నుపై పరిశ్రమలకు ఇచ్చే రాయితీలన్నీ అందిస్తున్నామన్నారు. అదే విధంగా సీఎం చంద్రబాబునాయుడు చొరవతో నూతన పర్యాటక పాలసీ -2024-29 విడుదల, భూకేటాయింపుల విధానం, ఉపాధి కల్పనపై ప్రోత్సాహకాల విధానం, సాహస పర్యాటక కార్యక్రమాలు వంటి కొత్త పాలసీలు విడుదల చేశామన్నారు. తద్వారా స్థిరమైన, బాధ్యతాయుత, సమగ్ర, పర్యావరణహిత పర్యాటక విధానాలకు శ్రీకారం చుట్టామని, పర్యాటకుల భద్రతకు పెద్దపీట వేస్తున్నామని, వేలాది కోట్ల పెట్టుబడులు ఆకర్షిస్తున్నామన్నారు.



**ప్రసిద్ధ క్షేత్రాల్లో స్టార్ హోటల్లు, రిసార్ట్ ల నిర్మాణం..హోం స్టేలు, టెంట్ సిటీల ఏర్పాటు:** రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సహజత్వం కోల్పోకుండా పాత కాలం నాటి మండువా లోగిళ్లు, పురాతన కట్టడాల్లో హోమ్ స్టేలు ఏర్పాటు చేసి అత్యాధునిక సౌకర్యాలు కల్పనకు శ్రీకారం చుట్టామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. అదే విధంగా రిసార్ట్ లతో పాటు స్టార్ హోటళ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. ఇతర దేశాల నుంచి వచ్చే పర్యాటకులు ఏపీ పర్యాటక ప్రాంతాల్లో ఎక్కువ రోజులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో విదేశీయులకు భారతదేశంలోని గ్రామీణ వాతావరణం పరిచయం చేస్తున్నామన్నారు. అదే విధంగా రాష్ట్రంలోని 25 ప్రసిద్ధ ప్రాంతాల్లో టెంట్ సిటీలు ఏర్పాటు చేయనున్నామన్నారు. లంబసింగి, శ్రీశైలం, ఒంటిమిట్ట తదితర ప్రాంతాలు అద్భుత పర్యాటక ప్రదేశాలని కానీ సరైన వసతి సౌకర్యం లేకపోవడం వల్ల ఆయా ప్రాంతాల్లో ఏర్పాట్లు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. క్యారవాన్ టూరిజం అనే అంశం నూతన పాలసీలోనిదే అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఆలోచనలతో దాన్ని పాలసీలో చేర్చామన్నారు. అబ్రాడ్ లలో క్యారవాన్ టూరిజం అభివృద్ధి జరిగిందన్నారు. టూరిజం సర్క్యూట్ లలో ఈ క్యారవాన్ వెహికిల్స్ ఉపకరిస్తాయన్నారు. ఇటీవలే విశాఖలో సైట్ సీయింగ్ కోసం డబుల్ డెక్కర్ బస్సులను ప్రారంభించామన్నారు. రూ.250 టికెట్ కొంటే 24 గంటలు తిరిగేలా 11 సందర్శనీయ ప్రాంతాలను చూసేందుకు వీలు కల్పించామన్నారు.

**రాష్ట్ర పర్యాటక రంగానికి కేంద్ర సహకారం మెండుగా ఉంది:** రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధి కేంద్రం ఇతోధికంగా సాయం అందిస్తోందని మంత్రి దుర్గేష్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన శాస్కి, స్వదేశీ దర్శన్ 2.0, సీబీడీడీ, ప్రసాద్‌స్కీమ్ ల ద్వారా రాష్ట్రంలో అఖండగోదావరి, గండికోట, సూర్యలంక బీచ్ అభివృద్ధి తదితర పర్యాటక ప్రాజెక్టులతో పాటు అన్నవరం, అహోబిలం, సింహాచలం వంటి దేవాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యాయని, పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. శాస్కి ద్వారా అఖండ గోదావరికి రూ.94.44 కోట్లు, గండికోట పర్యాటక ప్రాజెక్టుకు రూ.77.91 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని దీన్ని గ్రాండ్ కేనియన్ తరహాలో అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టు శంకుస్థాపన జరిగిందన్నారు. స్వదేశీ దర్శన్ 2.0 ద్వారా సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ.97.52 కోట్లు మంజూరు అయ్యాయని, త్వరలోనే అధునాతన సౌకర్యాలతో మరింత అందంగా దర్శనమివ్వనుందన్నారు. అదే విధంగా బొర్రా గుహలు, లంబసింగికి నిధులు మంజూరు అయ్యాయని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రసాద్ స్కీమ్ ద్వారా అన్నవరం, అహోబిలం, సింహాచలం దేవాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు అయినట్లు తెలిపారు.

**రాజమండ్రి, కడియం, నిడదవోలుకు సరికొత్త పర్యాటక శోభ తెస్తాం:** శాస్కిస్కీమ్ ద్వారా అఖండ గోదావరి ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ..94.44 కోట్లు మంజూరు చేసిందని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. తద్వారా రాజమహేంద్రవరంలో 127 ఏళ్ల చరిత్ర కలిగిన హేవలాక్ వంతెన పునర్నిర్మాణం, పుష్కర ఘాట్ ను అధ్యాత్మిక గమ్యస్థానంగా అభివృద్ధి చేసి డైనమిక్ టూరిస్ట్ డెస్టినేషన్ గా తీర్చిదిద్దనున్నామన్నారు. బ్రిడ్జిలంకలో వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే శంకుస్థాపన కార్యక్రమం చేశామని, కొన్ని కాంపోనెంట్స్ కి టెండర్లు పూర్తయ్యాయని, మరి కొన్నింటికి తుది దశలో ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రాజమండ్రితో పాటు కడియం, నిడదవోలును కలుపుతూ సరికొత్త పర్యాటక శోభ తెస్తామన్నారు. అభివృద్ధితో ఆయా ప్రదేశాల్లో జరుగుతున్న అసాంఘీక కార్యకలాపాలకు చెక్ పడుతుందన్నారు.

**సర్వతోముఖంగా నిడదవోలు అభివృద్ధి:** 15 నెలల కాలంలో నిడదవోలు అభివృద్ధికి దాదాపు రూ.300 కోట్లు వెచ్చించామని మంత్రి దుర్గేష్ వివరించారు. నియోజకవర్గంలోని 30 పడకల ఆస్పత్రిని 100 పడకలుగా మార్చడం, జల్ జీవన్ మిషన్ ద్వారా గోదావరి నుండి నిడదవోలుకు త్రాగునీరు అందించడంతో పాటు ఇండోర్ స్టేడియం తీసుకొస్తామన్నారు. ఆ దిశగా పెద్ద ఎత్తున కృషి చేస్తున్నామన్నారు.

**తూర్పుగోదావరి జిల్లాను ఆక్వా కల్చర్, అగ్రి కల్చర్ హబ్ గా చేస్తాం:** ఏపీలో జిల్లాల పునర్విభజన తర్వాత తూర్పుగోదావరి జిల్లాకు రాజమండ్రి ప్రధాన కేంద్రంగా ఉందని, జిల్లా అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్రలో పరిశ్రమలు వస్తున్నాయన్నారు. తూర్పుగోదావరి వ్యవసాయాధారిత, ఆక్వా ఆధారిత జిల్లా కాబట్టి దీన్ని ఆక్వా కల్చర్, అగ్రి కల్చర్ హబ్ గా చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు ఆ దిశగా రూపకల్పన చేశారన్నారు. ధాన్యం అధికంగా పండించే ప్రాంతం తూర్పుగోదావరి అని, సివిల్ సప్లై మంత్రి నాదెండ్ల మనోహర్ తో మాట్లాడి ధాన్యసేకరణకు చర్యలు తీసుకున్నామన్నారు.

# నేటి నుంచి కలెక్టర్ల కాన్ఫరెన్స్


(మొదటి పేజీ తరువాయి)

వారీగా జవాబుదారీతనం ఉండేలా ఈ కాన్ఫరెన్సు నిర్వహించాలని సీఎం ఇప్పటికే ఆదేశించారు. ఆమేరకు అధికారులు కలెక్టర్ల కాన్ఫరెన్సులో సమీక్ష చేసేందుకు అంశాల వారీగా శాఖలను విభజించి ప్రజెంటేషన్లు రూపొందించారు. రెండు రోజుల పాటు జరిగే సదస్సులో 15 తేదీన జీఎస్డీపీపై ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఇందులో భాగంగా ప్రాథమిక రంగం నుంచి వ్యవసాయం అనుబంధ రంగాలు, పరిశ్రమలు, సేవల రంగంలో భాగంగా పర్యాటకం, హౌసింగ్ తదితర శాఖల పురోగతి ఆయా జిల్లాల్లో ఎలా ఉందన్న అంశాన్ని కలెక్టర్ల నుంచి తెలుసుకోనున్నారు. రెండో అంశంగా సంక్షేమం, సూపర్ సిక్స్ పథకాలు, అన్నా క్యాంటీన్లు, పీ4 తదితర అంశాల అమలు ఎలా ఉందన్న దానిపై సమీక్ష జరుగనుంది. మూడో అంశంగా లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో భాగంగా రహదారులు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, హైవేలు, సాగునీటి ప్రాజెక్టులు, ఇంధనం తదితర అంశాల పురోగతిపై వివరాలను తెలుసుకోనున్నారు. నాలుగో అంశంగా స్వచ్ఛాంధ్ర, సర్క్యులర్ ఎకానమీ, పంచాయితీరాజ్, మున్సిపల్ తదితర అంశాలపై ప్రజెంటేషన్ తో పాటు జిల్లాల్లో ప్రస్తుత పరిస్థితి ఏమిటన్న దానిపై



కలెక్టర్ల నుంచి సీఎం వివరాలు అడిగి తెలుసుకోనున్నారు. ఇక రెండో రోజు 16 తేదీన ఐదో అంశంగా మానవ వనరుల అభివృద్ధి, వైద్యారోగ్యం, విద్య, స్కిల్ డెవలప్మెంట్ పై ప్రజెంటేషన్ తో పాటు కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. ఆరో అంశంగా ఐటీ, క్వాంటం వ్యాలీ, ఆర్టీజిహెచ్, వాట్సప్ లో పౌరసేవలు, డేటా లేక్, ఏఐ తదితర అంశాలను చర్చించనున్నారు. ఏడో కేటగిరీలో ఆదాయార్జన శాఖలైన రెవెన్యూ, భూములు, స్టాంపులు రిజిస్ట్రేషన్, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, అటవీ, ట్రాన్స్ పోర్టు, మున్సిపల్, పంచాయితీరాజ్ శాఖలపై జిల్లాల వారీగా వివరాలు తెలుసుకోనున్నారు. ఇక 8 వ అంశంగా రాష్ట్రంలో శాంతిభద్రతలపై ఎస్పీలు, జిల్లా కలెక్టర్లతో సమీక్షించి సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. అనంతరం ప్రభుత్వ విభాగాలు అందించే పౌర సేవలపై ప్రజల్లో సంతృప్త స్థాయిపైనా చర్చించనున్నారు.

# ఫీజులను విడుదల చేయాలి..



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని ఉన్నత విద్యా సంస్థలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల రీయింబర్సుమెంట్ ట్యూషన్ ఫీజులను తక్షణమే విడుదల చేయాలని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు విజ్ఞప్తి చేశారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు బి.రామ్ గోపాల్ రెడ్డి, ఆలపాటి రాజేంద్రప్రసాద్, పి.రాజశేఖర్, ప్రభుత్వ విప్ డా.వేపాడ చిరంజీవి రావు, కంచర్ల శ్రీకాంత్‌లు సంయుక్తంగా సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు.

“రాష్ట్రంలోని కళాశాలలు గత కొన్నాళ్లుగా విద్యార్థుల రీయింబర్సుమెంట్ ఫీజుల బకాయిలపై ప్రభుత్వ దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా స్టాఫ్‌కు జీతాలు ఇవ్వడంలో కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి. దీంతో మేము వారిపైన భారీ ఒత్తిడిని ఎదుర్కొంటున్నాము” అని ఎమ్మెల్సీలు వారి లేఖలోపేర్కొన్నారు.

2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన పెండింగ్ రీయింబర్సుమెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ప్రస్తుత విద్యా సంవత్సరం 2025-26కు సంబంధించి ఫీజుల విడుదల క్యాలెండర్‌ను ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

“రాష్ట్రానికి ఇంటర్నేషనల్ కంపెనీల పెట్టుబడులు రాబడటానికి కృషిచేస్తున్న ఈ సమయంలో, విద్యార్థులను ఆ కంపెనీల అవసరాలకు తగ్గట్టు తీర్చిదిద్దే బాధ్యత ఉన్నత విద్యాసంస్థలపై ఉంది. వాటికి సరైన ఆర్థిక బలపాటు లభిస్తే మాత్రమే నాణ్యమైన విద్య అందించగలుగుతాయి” అని ఎమ్మెల్సీలు ముఖ్యమంత్రిని కోరారు.

# సిల్ట్ తీత పనుల్లో నిర్లక్ష్యంతోనే ముంపు



### మరోసారి సిల్ట్ తీయించండి

### అధికారుల సమన్వయలోపాన్ని సహించం

### భారీ వర్షాలకు ప్రజలు ధైర్యంగా ఉండాలి

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** భారీ వర్షాలకు నగరం నీట మునిగిపోవడానికి ప్రధానం సిల్ట్ తీత పనుల్లో నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపమే కారణమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం గుంటూరు నగరంలో కురిసిన భారీ వర్షానికి నీట మునిగిన పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే నసీర్ పర్యటించారు. ఈ సందర్భంగా వర్షపు నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే మునిసిపల్, ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. గతంలో సిల్ట్ తీత పనులు సక్రమంగా చేపట్టలేదని, దీంతో ముంపు సమస్య ఏర్పడుతున్నట్లు గుర్తించామని తెలిపారు. గతంలో పని చేసిన వారితో మళ్లీ సిల్ట్ తీత పనులు మరోసారి చేయించాలని ఆదేశించారు.

మునిసిపల్ అధికారులు సమన్వయంతో పని చేయాలని, వంతెనలపై ఆక్రమణలు తొలగించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగేలా అధికారులు వ్యవహరిస్తే సహించబోమని హెచ్చరించారు. మూడు వంతెనల వద్ద నీటిని వెంటనే బయటికి పంపించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షపు నీటి ప్రవాహానికి ఎక్కడ అడ్డుగా ఉంటుందో గుర్తించాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని చెప్పారు. వర్షపు నీరు బయటికి వెళ్లేందుకు శాశ్వత పరిష్కారం దిశగా పనులు చేస్తామని వెల్లడించారు. ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని, తాము 24 గంటలు అందుబాటులో ఉంటామని తెలిపారు.

# వికసిత్ భారత్‌కు.. మహిళల నాయకత్వం

(మొదటి పేజీ తరువాయి)

అని అయ్యన్నపాత్రుడు తెలిపారు.

మహిళా సాధికారత కోసం కార్యక్రమాలు : పథకాల అమలు ద్వారానే మహిళా సాధికారత సాధించలేమని మంత్రి కేశవ్ అభిప్రాయపడ్డారు. అభివృద్ధిలో సమాన భాగస్వామ్యం కల్పించాలని చట్టసభల మహిళా సాధికార కమిటీల జాతీయ సదస్సులో స్పష్టం చేశారు. దార్శనిక నాయకుడు చంద్రబాబు నేతృత్వంలో ఏపీలో మహిళా సాధికారత కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని పయ్యావుల కేశవ్ తెలిపారు.

సీఎం చంద్రబాబు తిరుపతి పర్యటన రద్దు : అయితే ఏపీ సీఎం చంద్రబాబు తిరుపతి పర్యటన రద్దయింది. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో పర్యటన రద్దయినట్లు అధికారులు తెలిపారు. తిరుపతిలో మహిళా సాధికారత సదస్సులో సీఎం పాల్గొనాల్సి ఉంది. అయితే అమరావతి-తిరుపతి మధ్య దట్టమైన మేఘాలు అలముకొని ఉండటంతో ఏవియేషన్ అధికారులు క్లియరెన్స్ ఇవ్వలేదు. దీంతో పర్యటన రద్దయింది.

# తాతకు తగ్గ మనవడు

(మొదటి పేజీ తరువాయి)

వేగవంతంగా పరిష్కరించాడు. ఈ పజిల్స్ ఒకటి తర్వాత ఒకటి కష్టంగా మారుతూ వేగం, కచ్చితత్వం, ఆలోచనా నైపుణ్యాలను పరీక్షిస్తుంది. దేవాన్ష్ వీటన్నిటినీ అత్యంత తక్కువ సమయంలో పరిష్కరించడం ద్వారా రికార్డు సృష్టించారు. ప్రపంచ చెస్ రంగంలో అత్యుత్తమ యువ ప్రతిభావంతుల్లో ఒకరుగా దేవాన్ష్ కు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం లభించింది. ఈ విజయానికి దేవాన్ష్ అకుంఠిత శ్రమతో పాటు, తల్లి నారా బ్రాహ్మణి, తండ్రి నారా లోకేష్, కోచ్ కే. రాజశేఖర్ రెడ్డి ప్రోత్సాహం అందించారు.

ఈ విజయం గురించి మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ “ఈ రోజు వెస్ట్‌మినిస్టర్ హాల్‌లో దేవాన్ష్ ఈ గౌరవాన్ని అందుకోవడం ప్రత్యేకమైంది. అతని ముందుచూపు, ఆలోచనాశక్తి, ఒత్తిడిలో ప్రదర్శించిన సమయస్ఫూర్తి, చిన్న వయస్సులోనే పూర్తిగా ఆటకు అంకితం కావడం వంటి విభిన్నశైలి వల్ల ఈ విజయం సాధ్యమైంది. తండ్రిగా దేవాన్ష్ అవిశ్రాంత శ్రమని నేను దగ్గరగా చూశాను. ఈ గుర్తింపు అతని కృషికి నిజమైన బహుమతి. మేమంతా అతను సాధించిన ఈ ఘనతకు ఎంతో గర్వపడుతున్నాం” అని అన్నారు.

దీంతోపాటు దేవాన్ష్ మరో రెండు ప్రపంచ రికార్డులను కూడా గతంలో సొంతం చేసుకున్నాడు. 7-డిస్క్ టవర్ ఆఫ్ హనోయ్‌ను కేవలం 1 నిమిషం 43 సెకన్లలో పూర్తి చేయడం, 9 చెస్ బోర్డ్స్ పై 32 పావులను సరైన పద్ధతి ద్వారా 5 నిమిషాల్లో అమర్చడంలో ప్రపంచ రికార్డులు సాధించాడు. ఈ రోజు లండన్‌లో జరిగిన అవార్డ్స్ కార్యక్రమంలో ఆయనకు లభించిన గుర్తింపు ఆయన కుటుంబానికి, అలాగే ప్రపంచ చెస్ రంగంలో భారత్ తరపున పెరుగుతున్న ఖ్యాతికి గర్వకారణంగా నిలిచింది.

# పంచాయతీల్లో మోసాలకు చెక్

(మొదటి పేజీ తరువాయి)

విశాఖపట్నం జిల్లాలో 3,82,086 ఇళ్లు ఉండగా ఇప్పటి వరకు బకాయిలు రూ. 11.28 కోట్లకు చేరాయి. ఈ ఏడాది పన్నులు కలిపితే ఇది రూ. 30.78 కోట్లు అవుతుంది.

**కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన సేవలివే** : ఆన్‌లైన్ సేవలకు అవకాశం కల్పించడంతో కొత్త ఇళ్ల నిర్మాణానికి అనుమతులు, పాత ఇంటిని తొలగించినా, ఇల్లు కొనుగోలు చేసినా పేరు మార్పునకు అవకాశం కలిగింది.

**జనన, మరణ, వివాహ ధ్రువపత్రాల జారీ** : వ్యర్థాల తొలగింపు, తాగునీటి పన్ను చెల్లింపు వంటి సేవలను పొందవచ్చు.

**పంచాయతీల్లో పారదర్శకత** : స్వర్ణని పంచాయతీ వెబ్‌సైట్ ద్వారా పంచాయతీల్లో పారదర్శకత సాధ్యమవుతుందని డీపీఓ సందీప్ తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పల్లె జనాలకు వరంలాంటిదని తెలిపారు. ఏ పంచాయతీలో ఎంత పన్ను బకాయిలు ఉన్నాయనేది తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు. నకిలీ రసీదు, మోసాలు, సిబ్బంది చేతివాటానికి కళ్లెం పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సులభంగా రికార్డులు, పన్నులు, ఫీజులు వివరాలు తెలుసుకునే అవకాశం కలుగుతుందని వివరించారు.

# ఆది ఆచార్యులు బ్రాహ్మణులు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** సమాజంలో “గురు పరంపరకు మూలం బ్రాహ్మణం” అని తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య జి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి ప్రకటించారు. అందుకే ఆది ఆచార్యుల స్థానం బ్రాహ్మణులకే సొంతమని ఆయన స్పష్టం చేశారు.

ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో బ్రాహ్మణ జాతికి చెందిన ఉత్తమ ఉపాధ్యాయులకు ఆదివారం ఘన సత్కారం జరిగింది. బ్రాడీపేటలోని బ్రాహ్మణ సేవా సమితి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన 56 మంది బ్రాహ్మణోత్తమ ఉపాధ్యాయులకు పలువురు ప్రముఖులు అవార్డులు ప్రదానం చేశారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వీసీ కృష్ణమూర్తి మాట్లాడుతూ, “బ్రాహ్మణత్వం - గురుత్వం” రెండూ ఒకటేనని వ్యాఖ్యానించారు. యావత్ లోకమంతా గురువుపైనే ఆధారపడి ఉంటుందన్నారు.

సమాజానికి అత్యంత ఆవశ్యకమైన విద్య, వైద్యం అందించే సముదాయాలను ఆలయాలతో పోల్చుతారని.. ఆలయాలను నిర్వహించే అర్చకులే తొలుత అధ్యాపనం కూడా చేశారని.. ఆయన వివరించారు. అప్పట్లో ప్రత్యేకంగా గురుకులాలను సైతం ఏర్పాటు చేసి ఉచితంగా విద్యను బోధించేవారని గుర్తు చేశారు. సమాజంలో ఓవైపు ఆధ్యాత్మిక జ్ఞాన కాంతులు ప్రసాదించే అర్చకత్వంతో పాటు మరోవైపు విజ్ఞాన జ్యోతులు వెలిగించే అధ్యాపనం కూడా సొంతం చేసుకున్న ఏకైక జాతి బ్రాహ్మణత్వమని ఆయన వెల్లడించారు.

ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ మాట్లాడుతూ, క్రమశిక్షణ లేని జీవితం క్రమంగా శిక్షణకు దూరమై శిక్షకు గురి అవుతుందని.. అలా జరగకుండా పిల్లలకు క్రమశిక్షణ నేర్పే కర్తవ్యం ఉపాధ్యాయులపైనే ఉందని గురువులను కొనియాడారు. ఈ విషయంలో బ్రాహ్మణ వర్గానికి చెందిన ఉపాధ్యాయులు తమ అపార మేధా సంపత్తితో ప్రతి ఒక్కరినీ సన్మార్గంలో నడిపిస్తూ సమాజం పట్ల తమ గురుతర బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందుకే వారిలో అత్యుత్తమంగా సేవలందిస్తున్న వారిని గుర్తించి సన్మానించాలని నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. ఇది ఆరంభం మాత్రమేనని.. బ్రాహ్మణ వర్గానికి చెందిన మిగిలిన ఉపాధ్యాయులను కూడా దశల వారీగా సత్కరిస్తామని.. శ్రీకాంత్ తెలిపారు.

ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఉపాధ్యక్షుడు, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) మాట్లాడుతూ, ఉన్నత విలువలతో భావి భారత పౌరులను ఉత్తమంగా తీర్చిదిద్దుతున్న బ్రాహ్మణ ఉపాధ్యాయులందరినీ సత్కరించుకోవడం అంటే యావత్ సమాజాన్ని సన్మానించుకోవడమేనని పేర్కొన్నారు. అందుకే వారందరినీ ఒకే వేదికపైకి చేర్చే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. శారదాంబ మాట్లాడుతూ, బ్రాహ్మణ ఉపాధ్యాయులు అనుసరించే త్రీడి ప్రోగ్రామ్ అమ్మఒడి, దేముని గుడి, చదువుల బడి గురించి విపులంగా వివరించి సభను ఆకట్టుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఉపాధ్యక్షులు మంగళంపల్లి అంజిబాబు, రామభద్రుడు, కసలపాటి లక్ష్మీనారాయణ, పేరి శ్రావణ్, కుప్పం ప్రసాద్, కౌతా ధర్మ సంస్థల అధినేత కౌతా సుబ్బారావు, నిమ్మరాజు శారద, గుంటూరు బ్రాహ్మణ సేవా సమితి ప్రధాన కార్యదర్శి రంగావఝల లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు. సభకు పోతావఝల పురుషోత్తమ శర్మ స్వాగతం పలికారు. మాగంటి శాస్త్రి వందన సమర్పణ చేసారు.

# ఆటోమిత్ర పథకం మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం - అర్హులు ఎవరంటే?



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆటోమిత్ర పథకం కింద దసరా రోజున ఆటోడ్రైవర్ల ఖాతాలో రూ. 15 వేల చొప్పున జమ చేస్తామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా మార్గదర్శకాలు విడుదల చేసింది. సొంత ఆటో రిక్షా, మోటార్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ఈ ఆర్థిక సాయం వర్తించనున్నట్లు పేర్కొంది. ఈ మేరకు పథకం అమలు, అర్హతలు, తదితర వివరాలతో ఆదేశాలు జారీ చేసింది. బీమా, ఫిట్‌నెస్, మరమ్మతులు, ఇతర అవసరాల కోసం ఈ ఆర్థిక సాయం చేస్తున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు ఆదేశాలు జారీ చేశారు.

**మార్గదర్శకాలు ఇవే :** లబ్ధిదారులు సొంత వాహనం, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలి.

లబ్ధిదారులు తమ వాహనానికి ఏపీ రిజిస్ట్రేషన్, ఫిట్ నెస్, టాక్స్ చెల్లింపు ధ్రువపత్రాలు కలిగి ఉండాలి.

మూడు, నాలుగు చక్రాల సరకు రవాణా వాహనాలకు పథకం వర్తించదు.

లబ్ధిదారుడు తప్పని సరిగా ఆధార్, రేషన్ కార్డు కలిగి ఉండాలి.

కుటుంబంలో ఒకవాహనదారుడికి మాత్రమే పథకం వర్తింపు.

లబ్ధిదారుల ఎంపిక , పథకం అమలు కోసం చర్యలు చేపట్టనున్న గ్రామ వార్డు సచివాలయాలు, రవాణాశాఖ.

ఈనెల 17 నుంచి 19 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ.

ఈ నెల 24 నాటికి దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారుల తుది జాబితా సిద్ధం చేయనున్న ప్రభుత్వం

అక్టోబర్ 1న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఆర్థిక సాయం అందజేయనున్న ప్రభుత్వం

వాహనమిత్ర పథకంతో 2.90 లక్షల మందికి లబ్ధి - రూ. 435 కోట్ల మేర ఆర్థికసాయం

ఆటో డ్రైవర్లకు అండగా నిలుస్తామని స్త్రీశక్తి పథకం కింద ప్రారంభించిన రోజున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఆ మేరకు వాహన మిత్ర పథకం ద్వారా అర్హులైన వారికి రూ. 15 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు అనంతపురంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆటోలతో పాటు ట్యాక్సీలు, మ్యాక్సీ క్యాబ్ చోదకులకూ లబ్ధి అందించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వైఎస్సార్సీపీ హయాంలో సొంత ఆటో కలిగినవారికి వైఎస్ఆర్ వాహన మిత్ర పథకం ద్వారా లబ్ధి అందించారు. ఆ సమయంలో వివిధ నిబంధనల కారణంగా అర్హతలున్నా కొందరు పథకానికి దూరమైనట్లు విమర్శలు వినిపించాయి. అలా కాకుండా పారదర్శకంగా పథకం అమలు చేసేలా కసరత్తు చేస్తున్నారు.

**ఉచిత బస్సు పథకానికి ఆటోవాలాల రైట్ రైట్ :** మరోవైపు సూపర్ సిక్స్ హామీల అమల్లో భాగంగా ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో తాము నష్టపోతున్నామంటూ ఆటోవాలాలు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో దసరాకు ఆటోడ్రైవర్లకు ఆటోమిత్ర పథకం కింద రూ. 15 వేలు వారి ఖాతాల్లో వేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్‌సిక్స్ - సూపర్‌హిట్ సభలో ప్రకటించడంతో వారంతా ఆనందంలో మునిగిపోయారు. గురువారం కాకినాడలో ఆటో యూనియన్ నాయకులే ఆటోలపై ఉచిత బస్సు ప్రయాణ పథకం స్టిక్కర్లను అంటించి ప్రచారం చేయడం విశేషం.

## ఇబ్రహీం సేవలకు గుర్తింపు : దానబోయిన



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి పాత బస్టాండ్ సెంటర్ గుడ్ విల్ ముస్లిం సంక్షేమ కార్యాలయం వద్ద ఇటీవల రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన మహమ్మద్ ఇబ్రహీం ను ఆదివారం టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్ ఆధ్వర్యంలో దేశం నాయకులు సత్కరించారు. దానబోయిన, నాయకులు ఇబ్రహీం ను శాలువాలతో సత్కరించి బొకేలు అందజేశారు. అనంతరం దానబోయిన మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీలో వివిధ పదవులు నిర్వహించి ఇబ్రహీం పార్టీ అభివృద్ధికి కృషి చేశారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ ఆయన సేవలను గుర్తించి డైరెక్టర్ పదవితో గౌరవించడం అభినందనీయమన్నారు. ఇబ్రహీం కు పదవి ఇవ్వడం పార్టీలో సీనియర్లకు ఇస్తున్న గుర్తింపుకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రుద్రు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, మురళి, తోట శ్రీను బాబు, కొల్లి వెంకట్రావు, రుద్రు నాగరాజు, కొత్త శ్రీనివాసరావు, చింకా కోటేశ్వరరావు, పేరుబోయిన వెంకటేశ్వరరావు, తోట రమేష్, శ్రీను, సురేష్, పణిదపు మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జవ్వాది కి ఘన సన్మానం




**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జవ్వాది కిరణ్‌చంద్‌ను ఆదివారం రేవేంద్రపాడు జెడ్.పి. హెచ్.ఎస్ పాఠశాల పూర్వ విద్యార్థినీ,విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్దవడ్లపూడి గ్రామంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే తన ధ్యేయమని, మంత్రి నారా లోకేష్ సహకారంతో మార్కెట్ యార్డ్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పించి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భావన శ్రీనివాసరావు, దుర్గారావు, లింగినేని శివయ్య, మనం అప్పారావు,హైమవతి, భవాని, వనకుమారి,కపరపు శ్రీను, రాజారావు, పేరయ్య శాస్త్రి, ముసునూరి సుదర్శన్, శరత్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## నిరాశ్రయులైన వారిని ప్రభుత్వం ఆదుకుంటుంది



**చాగల్లు (జర్నలిస్ట్ ఫైల్) :** విపత్తు కారణంగా ఇల్లు కోల్పోయిన వారిని కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. చాగల్లులో భారీ వర్షానికి తాటాకిల్లు నేలవాలిన కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. విపత్తు కారణంగా నిరాశ్రయులైన కుటుంబంలోని ఇద్దరు చిన్నారులను గురుకుల పాఠశాలలలో చేర్చేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు హామీ ఇచ్చారు. అదేవిధంగా %ూ%4 కార్యక్రమంలో నిరాశ్రయులైన కుటుంబాన్ని ఆదుకునేందుకు అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం నెలటూరు ఎంపీటీసీ తాళ్లూరి రమ్యశ్రీ రూ. 5 చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. దీనిలో భాగంగానే అనారోగ్యానికి గురైన టీడీపీ మహిళా కార్యకర్తలని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మెరికమ్మ, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, కరుటూరి సతీష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జొన్నకూటి సుబ్బారావు, ఊనగట్ల సొసైటీ చైర్మన్ బి.నాగేంద్ర, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## అస్సాంలో 5.8 తీవ్రతతో భూకంపం..


**డిస్పూర్:** అస్సాంలో ఆదివారం నాడు భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.8గా నమోదైంది. ఉదల్‌గిరి జిల్లాకు 16 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉందని సంబంధిత అధికారులు గుర్తించారు. భూమికి 5 కిలోమీటర్ల లోతున ఇది సంభవించినట్టు అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో పశ్చిమ బెంగాల్, భూటాన్‌లోనూ ప్రకంపనలు వచ్చాయి. అస్సాంలో భూకంపం సంభవించడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారని, పలువురు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారని తెలుస్తోంది. పరిస్థితిని డిజాస్టర్ మేనేజ్మెంట్ బృందాలు చురుకుగా సమీక్షిస్తున్నాయి. కాగా, ఈ ఘటనలో ఎవరూ గాయపడినట్టు సమాచారం లేదని, తమ టీమ్‌లు అప్రమత్తంగా ఉన్నాయని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

**పరిస్థితిని సమీక్షిస్తున్నాం: సీఎం**

ఉదల్ గిరిలో 5.6 తీవ్రతతో భూకంపం సంభవించిందని, అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని సమాచారం ఉందని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. పరిస్థితిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షిస్తోందని తెలిపారు.

అస్సాంలో భూకంపం సంభవించిందని, ప్రజల భద్రత కోసం ప్రార్థిస్తున్నానని కేంద్ర మంత్రి, మాజీ ముఖ్యమంత్రి సర్బానంద్ సోనోవాల్ సోమాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రస్తుతం అస్సాం పర్యటనలో ఉన్నారు.

## శ్రీశైలం దేవస్థానానికి భక్తుని విరాళం



**శ్రీశైలం(జర్నలిస్ట్ ఫైల్) :** అన్నప్రసాద వితరణ పథకానికి భీమవరంకు చెందిన భక్తుడు కె. రామచంద్రరావు ఆదివారం ఉదారంగా విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయన రూపాయలు ఒక లక్ష ఒక వేలు ఐదు వందలను దేవస్థానానికి సమర్పించారు. విరాళాన్ని దేవస్థానం పర్యవేక్షకులు కె. శివప్రసాద్ స్వీకరించారు. ఈ సందర్భంగా దాతకు దేవస్థానం తరఫున రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేయబడ్డాయి.

అన్నప్రసాద పథకానికి అందుతున్న ఇలాంటి దానాలు భక్తులకు ఉచిత భోజన వితరణ మరింత విస్తృతంగా నిర్వహించేందుకు ఉపయోగపడుతున్నాయని దేవస్థానం అధికారులు తెలిపారు.

# యూరియా పంపిణిపై అసత్య కథనాలు రాస్తున్న సాక్షి పేపర్

**సంతబొమ్మాళి(జర్నలిస్ట్ ఫైల్) :** యూరియా పంపిణీ పై అసత్య కథనాలు రాస్తున్న సాక్షి పత్రిక పై సంతబొమ్మాళి మండలం నౌపాడ పోలీస్ స్టేషన్ లో రైతులు ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో ఎక్కడా యూరియా కొరత లేకపోయినా పనిగట్టుకొని సాక్షి పత్రిక అసత్య కథనాలు ప్రచురించడంతో రైతుల్లో గందరగోళ పరిస్థితి నెలకొంటుంది. అయోమయానికి గురి చేస్తున్న సాక్షి పత్రిక పై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సాక్షి పత్రికను రైతులు తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. వ్యక్తిగత తగాదాలను యూరియా కొరత పై నెట్టి గ్రామాల్లో వివాదాలను సృష్టిస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో విధ్వంస పాలన చేసి ప్రజలను నట్టేట ముంచిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం రైతులకు ప్రజలకు మంచి సేవలు మంచి సుపరి పాలనందిస్తున్నప్పటికీ ఇలా దుష్ప్రచారం చేసి ప్రజల్లో గందరగోళం సృష్టించడం సరికాదని రైతులు ఆవేదన చెందారు. గత ఐదేళ్లు రైతులకు నాణ్యమైన ఎరువులు విత్తనాలు అందించలేక అసమర్థపాలన సాగించిన జగన్... సుపరిపాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వము పై ఓర్వలేక అసత్య ప్రచారాలు చేస్తున్నాడని అన్నారు. తన సొంత మీడియాలో లేనిపోని కథనాలు రాస్తూ అసత్య ప్రచారాన్ని చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి ప్రచారాన్ని ప్రజలు నమ్మరని చెప్పారు. జిల్లా, రాష్ట్రంలో తగినంత యూరియా రైతు సేవా కేంద్రాలు ప్రైవేటు దుకాణాల ద్వారా ప్రభుత్వం అందుబాటులో ఉంచిందని అయినప్పటికీ అసత్య ప్రచారంతో రైతులను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఐదేళ్ల జగన్ పాలనలో రైతులకు ఒక యంత్రం కూడా ఇచ్చిన పాపాన పోలేదని కూటమి ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభ తో పాటు యంత్రాలు నాణ్యమైన విత్తనాలు అందజేస్తూ రైతులకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని అన్నారు.

వైకాపా పార్టీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను చెప్పాలని మా ఉద్దేశం అన్నారు. ఎలాంటి దుష్ప్రచారం ఎవరు చేసినా తీవ్రంగా ఖండిస్తూ వారికి తగిన బుద్ధి చెప్తామని తెదేపా నేతలు హెచ్చరించారు.

# ఆర్యవైశ్య జర్నలిస్ట్ సంక్షేమ సేవా సంఘం ఆవిర్భావ దినోత్సవం



**బ్రహ్మంగారిమఠం (బద్వేల్ అర్బన్ ) జర్నలిస్ట్ ఫైల్ :** శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య జర్నలిస్టు సంక్షేమ సేవా సంఘం ఆవిర్భావ దినోత్సవం వేడుకలు కడప/ అన్నమయ్య ఉమ్మడి జిల్లాలో పలువురు జర్నలిస్టుతో కలిసి ఆదివారం బద్వేల్ పట్టణంలోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో రాష్ట్ర కన్వీనర్ రవికుమార్ మరియు కోకన్వీనర్ల ఆదేశాల మేరకు బద్వేల్ పట్టణంలో వైభవంగా నిర్వహించడం జరిగింది,ఈ కార్యక్రమానికి కడప అన్నమయ్య ఉమ్మడి జిల్లాలలోని పలువురు జర్నలిస్టులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు,ముందుగా ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు దేవతి లలిత, స్టేట్ ఉపాధ్యక్షురాలు కొండపల్లి దేవి, వనితా క్లబ్ అధ్యక్షురాలు చింతకుంట ధనలక్ష్మి, పత్తి హేమలత, పుష్పలత, వల్లంకొండు ధనలక్ష్మి, అక్కిసెట్టి జ్యోతిర్మయి, కొండపల్లి సుగుణ, లక్ష్మీకాంతమ్మ సముద్రాల పద్మావతి ల ఆధ్వర్యంలో పలువురు జర్నలిస్టుల తో కలిసి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని నిర్వహించి, అనంతరం అమ్మవారి ప్రార్థనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు, ఈ కార్యక్రమంలో హాజరైన పలువురు మహిళలకు శాలువాతో సత్కరించడం జరిగింది, అలాగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కొండపల్లి చిన్న సుబ్బారావు, మాజీ అధ్యక్షులు కె.వి సుబ్బారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రాచపూడి వెంకట సాయి కృష్ణ, ఏపీ ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య, సీనియర్ న్యాయవాది పి.వి.ఎన్ ప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కనుమరుల పూటీ ప్రసాద్, శ్రీ రాచపూడి నాగభూషణం కళ్యాణ మండపం అధినేత డాక్టర్ రచపూడి దిలీప్ కుమార్, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, పెసల నాగరాజ ఫౌండేషన్ నిర్వాహకులు పెసల నాగరాజు, వాసవి క్లబ్ అధ్యక్షులు అనుమల శెట్టి సిద్దయ్య, చాటుకొండు వెంకటసుబ్బయ్య తో పాటు పలువురు పాల్గొన్న వారికి సాధర్వంగా ఆహ్వానం పలికి శాలువా తో పలువురిని జర్నలిస్టులు వారిని సత్కరించారు,

# కనకదుర్గమ్మను దర్శించుకున్న స్వామీజీలు



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్)** తరతరాలుగా వారసత్వ సంపదగా వస్తున్న సనాతన ధర్మాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని పలువురు స్వామీజీలు పేర్కొన్నారు. సనాతన ధర్మం పరిరక్షణ కోసం పలు మఠాలకు చెందిన స్వామీజీలు ఆదివారం అమరావతిలో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు.

అమరావతిలో జరిగిన ఈ సమావేశంలో స్వామీజీలు, న్యాయవాదులు పాల్గొన్నారు. సనాతన ధర్మాన్ని పరిరక్షించేందుకు ఎటువంటి అన్యాయం జరిగినా న్యాయవాదులు స్వచ్ఛందంగా, తమ సొంత ఖర్చులతో పోరాటం చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

**దుర్గమ్మను దర్శించుకున్న స్వామీజీల బృందం...**

సనాతన ధర్మం పరిరక్షణ సమావేశం ముగిసిన తర్వాత విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో కొలువై ఉన్న కనకదుర్గమ్మ ఆలయాన్ని స్వామీజీల బృందం సందర్శించింది. అమరావతి సైవక్షేత్రం శివ స్వామి, తిరుపతికి చెందిన రాధా మనోహర్ దాస్ స్వామి, గుంటూరు ప్రాంతానికి చెందిన భవానీ శంకర్ ఆనంద్ స్వామి, తెలంగాణ ప్రాంతంలోని విశ్వేశ్వర క్షేత్రానికి చెందిన ఆత్మానంద భారతి స్వామి, విజయవాడకు చెందిన భజిల్ గురు స్వామి తిరుపతికి చెందిన రాజేంద్ర ప్రసాద్ గురూజీ-స్కంద స్వామి, గిద్దలూరు ప్రాంతానికి చెందిన స్వామి సిద్ధేశ్వరానంద, రాజమండ్రి కి చెందిన విశ్వ శంకరానంద స్వామి, మాతాజీ మాత శివ చైత్రా నందా మయి లు కనకదుర్గమ్మ వారి దర్శనానికి ఆదివారం ఆలయానికి రాగా స్వామీజీలు, మాతాజీకి దుర్గమ్మ ఆలయం వద్ద ఆలయ ఏఈఓ ఎన్.రమేష్ బాబు ఘన స్వాగతం పలికారు. కనకదుర్గమ్మ వారికి స్వామీజీలు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ప్రధానాలయ ఏఈఓ ఎన్ రమేష్ వారికి అమ్మవారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందజేశారు.

# ఎస్పీ నేతృత్వంలో బందోబస్తు ఏర్పాట్లు కఠినతరం



**వెలగపూడి (జర్నలిస్ట్ ఫైల్) :** రాజధాని ప్రాంతమైన గుంటూరు జిల్లాలో జరగనున్న మూడు ముఖ్యమైన కార్యక్రమాల నేపథ్యంలో గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. కలెక్టర్ల సదస్సు, అసెంబ్లీ సమావేశాలు, డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం %-% ఈ మూడు ఒకదానికొకటి దగ్గరగా జరుగుతున్న నేపథ్యంలో ఎస్పీ కఠినమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**కలెక్టర్ల సదస్సు బందోబస్తు :** నేటి నుండి రెండు రోజుల పాటు వెలగపూడి సచివాలయంలో జరగనున్న కలెక్టర్ల సదస్సు కోసం 5వ బ్లాక్ వద్ద ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు. వీవీఐపీ, వీఐపీలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా భారీ కేడింగ్‌తో పటిష్ట భద్రత ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి విభాగం అధికారులు సమన్వయం చేసుకుంటూ, ఏవైనా లోపాలు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**అసెంబ్లీ సమావేశాలకు ప్రత్యేక చర్యలు :** ఈ నెల 18న సచివాలయంలో ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల కోసం ప్రత్యేకంగా రాకపోకల మార్గాలు, పార్కింగ్ ప్రదేశాలు, మీడియా పాయింట్ తదితర ప్రాంతాలను ఎస్పీ పరిశీలించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వీవీఐపీలు రాకపోకలకు ఆటంకం లేకుండా స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని సూచించారు. ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు.

**డీఎస్సీ అభ్యర్థుల నియామక పత్రాల పంపిణీ:** ఈ నెల 19న సచివాలయం వెనుకభాగంలో జరిగే డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమ స్థలాన్ని కూడా ఎస్పీ స్వయంగా పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మంది అభ్యర్థులు పాల్గొనే అవకాశముండటంతో వాహనాల రాకపోకలు, పార్కింగ్ ప్రాంతాలు, క్యూలైన్లు తదితర విషయాలను సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భనలో తుళ్లూరు డీఎస్పీ మురళీ కృష్ణ, ఎస్బి సీఐ అలహరి శ్రీనివాసరావు, తుళ్లూరు సీఐ కొంక శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు, ఇతర సీఐలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# టీటీడీ పాలకమండలిలో టీవీఎస్ మోటార్స్ చైర్మన్..



**తిరుపతి(జర్నలిస్ట్ ఫైల్) :** టీవీఎస్ మోటార్ కంపెనీ చైర్మన్ సుదర్శన్ వేణు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి సభ్యుడిగా నియమితులయ్యారు. ఇది టీటీడీ ట్రస్ట్ బోర్డులో ఆయన రెండవ పదవీకాలాన్నిసూచిస్తుంది.

ఆయనతో పాటు ఆయన తండ్రి వేణు శ్రీనివాసన్, ఆయన భార్య తారా వేణు కూడా ఉన్నారు. ఇటీవల టీవీఎస్ మోటార్ కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా వేణు పదోన్నతి పొందిన తర్వాత ఈ నియామకం జరిగింది.

ఇది భారతీయ బహుళజాతి తయారీదారులో కుటుంబం నిరంతర నాయకత్వ వారసత్వాన్నినొక్కి చెబుతుంది. టీటీడీ బోర్డు సభ్యుడిగా సుదర్శన్ వేణు నియామకంతో పాలక మండలి పూర్తి స్థాయిలో కొలువుదీరినట్లైంది.

# సామూహిక సత్యదేవ వ్రతపూజలు



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)** దాసకుటి ఆశ్రమంలో వైభవంగా కొనసాగుతున్న మహాలక్ష్మి అమ్మవారి కుంకుమార్చనల్లో భాగంగా నిర్వహించిన, సామూహిక శ్రీసత్యదేవ వ్రతపూజలు ప్రాధాన్యతను సంతరించు కున్నాయి. మండలంలోని అంగలకు దురు గ్రామంలో వేంచేసియున్న, శతాధిక వత్సరాల ఆధ్యాత్మిక చరిత్రగల, దాసకుటి ఆశ్రమంలో, గత నెల 31నుండి నిర్వహిస్తున్న 74వ, మహాలక్ష్మీ కుకుమార్చనల్లో భాగంగా, ఆదివారం సామూహిక శ్రీరమాసహిత శ్రీసత్యన్నారాయణస్వామి వ్రత పూజలు ఘనంగా నిర్వహించారు. శ్రీవాసుదాస స్వామి పరంపర పీఠం, షష్టమ పీఠాదిపతులు శ్రీసీతారామస్వామి పర్యవేక్షణలో, యజ్ఞక్రతువు అనంతరం,కుంకుమార్చనలు, సామూహిక శ్రీసత్యదేవుని వ్రతపూజలను మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈక్రమంలో శ్రీసీతా రామస్వామి మీడియాతొ మాట్లాడుతు ఈనెల 15న,16కలశములతొ, అభిషేకము, పూర్ణాహుతి కార్యక్రమాలుంటాయన్నారు. అదేవిధంగా శ్రీరాముని వంశీయులు అయోధ్యలొ,108 అడుగుల శ్రీరాముడి విగ్రహం, ప్రతిష్ఠించ నున్న క్రమంలొ, శ్రీరాముడి చేతిలో ఉండే కోదండం, సోమవారం ఉదయం 9 గంటల నుండి, 12, గంటలవరకు, దాసకుటి ఆశ్రమంలొ, భక్తుల సందర్శనార్థం ఉంటుందని, అయోధ్య రాముడి కోదండాన్ని దర్శించుకునే భాగ్యాన్ని భక్తులు వినియోగించు కోవాలని శ్రీసీతారామ స్వామి భక్తులకు వివరించారు. గతంలొ అన్నదాన చిదంబర శాస్త్రి 6కోట్ల రామనామజపాన్ని ధారపోసిన, యంత్రానికి దాసకుటి ఆశ్రమంలొ పూజలు చేశామని, అనంతరం అయోధ్య బాలరాముని సన్నిధిలొ, పాదాల క్రింద యంత్రాన్ని ప్రతిష్ఠించారని తెలిపారు. దాసకుటి ఆశ్రమానికి యంత్రం తీసుకువచ్చిన తీరుగానే, శ్రీరాముని ధనస్సు కూడా సోమవారం భక్తులు దర్శించుకులేలా, దాసకుటి ఆశ్రమంలొ ఉంచేందుకు ఏర్పాట్లు చేస్థున్నట్లు వివరించారు. కాగా శ్రీసత్యనారాయణస్వామి వ్రతానంతరం భక్తులకు, తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ సేవచేశారు.

కార్యక్రమాలకు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు, ఆశ్రమ మేనేజర్ కనగాల వెంకట్రావు,యలవర్తి హైమవతి, కొమ్మినేని వెంకట్రావు తదితరులు సహకరించారు.

## గుంటూరులో క్లౌడ్ బరస్ట్ తరహా వర్షం..



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరులో క్లౌడ్ బరస్ట్ తరహా భారీ వర్షం కురిసింది. కేవలం 25 నిమిషాల్లోనే 5 సెం.మీ. వర్షపాతం నమోదు అయింది. మరోవైపు అమరావతి, సత్తెనపల్లి విజయవాడలో వర్షం దంచికొడుతోంది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. స్థానిక వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నాయి.

అయితే వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని తెలిపారు. కొన్ని చోట్ల పిడుగులు కూడా పడే అవకాశం ఉందని వెల్లడించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు మెరకవైపు రావాలని సూచించారు. వర్షాలు తగ్గేవరకు చెరువులు, నదులు, ప్రాజెక్టుల వద్దకు వెళ్లొద్దని హెచ్చరించారు.



## మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సం వేడుకలు

**గన్నవరం, సెప్టెంబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :**

కృష్ణా జిల్లా, గన్నవరం మండలం, గన్నవరం గ్రామం లో స్థానిక నవోదయ విశ్వభారతి స్కూల్ ప్రాంగణంలో ఘనముగా జరిగాయి. కొల్లి సత్య జగదీశ్వరరావు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రధానోపాధ్యాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గొల్లనపల్లి, దొప్పల జానేషు, కృష్ణా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత టీచర్ ఎంపీపీ స్కూల్ వెదురుపావులూరు, రేమల్లి రత్నకుమారి సెకండరీ గ్రేడ్ కృష్ణాజిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మోడల్ ఎంపీపీ ఎస్ దావాజీ గూడెం డొక్కు రాజరాజేశ్వరి ఫిజికల్ డైరెక్టర్ జడ్పీ హైస్కూల్ వేలేరు, టి శుభలక్ష్మి స్కూల్ అసిస్టెంట్ సోషల్ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల గన్నవరం, గొట్టం వెంకట రవిబాబు స్కూల్ అసిస్టెంట్ బయాలజీ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల గన్నవరం, డి రాజరత్నం సెకండ్ గ్రేడ్ టీచర్ ఎంపీపీ స్కూల్ సీతారాంపురం ఆఫ్ అంపాపురం, దొడ్డ కుమార్ స్కూల్ అసిస్టెంట్ తెలుగు జడ్పీ హైస్కూల్ దా వాజీ గూడెం, చక్రవర్తుల రాధ స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ జడ్పీ హైస్కూల్ వీరపనేనిగూడెం, కెవి పద్మావతి సెకండరీ టీచర్ ఎంపిపిఎస్ చింతలపేట గన్నవరం వారికి ఘన సన్మానము చేశారు . ఈ కార్యక్రమము లో మానవతా చైర్మెన్ మదుపల్లి బాలకృష్ణ మూర్తి కన్వీనర్ కర్రా వర ప్రసాద్ గారు అధ్యక్షులు శ్రీ వీసం ప్రసాదరావు సెక్రటరీ వి వి కృష్ణ మోహన్ కోశాధికారి పొట్లూరిరామకృష్ణ వైస్ ప్రెసిడెంట్ పువ్వుల ఆదినారాయణ సంయుక్త కార్యదర్శి వడ్లమూడి వెంకటేశ్వరరావు గౌరవ సలహాదారులు గన్నే వెంకట్రావు, ముక్కామల సుబ్బారావు మానవత విద్య ఎగ్జిక్యూటివ్ కమిటీ డైరెక్టర్ సయ్యద్ లాల్ సభ్యులు ఎన్ రఘు కుమార్ పాల్గొన్నారు.

## ఆర్ఎంపీ డాక్టర్ గిరిధర్, సతీష్ లపై దాడి చేసిన గూండాలను వెంటనే అరెస్టు చేయాలి

- గన్నవరం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి



**గన్నవరం, సెప్టెంబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :**

కృష్ణాజిల్లా తాళ్ళపాలెంలో ప్రజలకి ఇచ్చిన హామీ అమలు చేయలేదు అని ప్రశ్నించిన వైయస్సార్‌సీపీ కార్యకర్తలు ఆర్ఎంపీ డాక్టర్ గిరిధర్,సతీష్‌ను దాడి చేసిన కూటమి గుండలును వెంటనే అరెస్టుచేయాలని, గన్నవరం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి డిమాండ్ చేశారు.గిరిధర్, సతీష్ లు ఇరువురు ప్రభుత్వ పథకాలను ఏది సరిగ్గా అమలు చేయలేదని, అన్నందుకు గాను కూటమిగూండాలు అతి హీనంగా దాడి చేశారు. ఈ ఘటనపై పోలీసులకు రిపోర్ట్ చేసిన అరెస్టు చేయట్లేదని ఆమే ఆగ్రహం వ్యక్తం చేశారు. అంటే అధికారం పార్టీకి చెందిన వారు చట్టవిరుద్ధంగా ఎన్ని దాడులు చేసిన వారిని అరెస్టు చేయరా అని పోలీసులను ప్రశ్నించారు. గిరిధర్, సతీష్‌లపై ఈ తరహా దాడులు, దౌర్జనాలు పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని అధికార దుర్విని యోగానికి పాల్పడడం దారుణమన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే ఇలా కూటమి నేతలు భయోత్పాతం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఈ అనైతిక దాడులను కార్యక్రమాలన్ని ప్రజలు గమనిస్తున్నారని, వారు భవిష్యత్తులో కూటమి పార్టీలకు తగిన బుద్ధి చెబుతారన్నారు. గిరిధర్, సతీష్ కుటుంబాలకు మరల ఏ విధమైన హాని జరిగిన అది పూర్తిగా పోలీసుదే బాధ్యత అని ఆమే అన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ నాయకులు కార్యకర్తలపై ఇటువంటి దాడులు వారి ఆస్తులు ధ్వంసం చేసిన పోలీసులు పట్టించుకోవటంలేదని అన్నారు. గన్నవరం లో మాజీ శాసనసభ్యులు వల్లభనేని వంశీ మోహన్ని అలాగే గ్రామ, గ్రామనా అన్ని గ్రామాల లోని వైస్సార్సీపీ కార్యకర్తలు మహిళలపై కూడా అక్రమ కేసులు పెట్టీ జైలుకు పంపారన్నారు. అంతకన్నా వారు చేయగలిగింది ఏమి లేదన్నారు. కూటమి ప్రభుత్వం నికి ప్రజలు తొందరలోనే గుణపాఠం చెపుతారని మరల రాష్ట్రంలో జగన్, గన్నవరంలో నియోజకవర్గం లోవల్లభనేని వంశీ మోహన్ అధికారంలోకి వస్తారని ఆమే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## సంచలన ఆరోపణలు చేసిన మాజీ మంత్రి జోగి రమేష్

- విటిపిఎస్ బూడిద కాంట్రాక్టు ప్రవేటు సంస్థకు సూటికేసులు ఇవ్వడం వల్లే అనుమతులు



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :**

స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, మంత్రి లోకేష్ కు ప్రవేటు సంస్థ సూటికేసులు అందడం వల్లనే మద్రాస్ సంస్థకు కట్టబెట్టారనీ మాజీ మంత్రి జోగి రమేష్ సంచలన ఆరోపణలు చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక లారీ యజమానులు, డ్రైవర్లను రెచ్చగొట్టి చోద్యం చూస్తున్నారన్నారు. బూడిద కాంట్రాక్టు ప్రవేటు సంస్థకు ఇవ్వడం పై దశలు వారి ఉద్యమాలు చేస్తామని వివరించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీకి సోమవారం పిర్యాదు చేస్తామని వివరించారు. 17వ తేదీన అక్రమ బూడిద నిల్వల నుంచి తమ పార్టీ ఆధ్వర్యంలో ఉచితంగా సరఫరా చేస్తామని, లోకల్ లారీ యజమానులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేపీ, పీకే బూడిదను లూటి చేస్తూ ఈ ప్రాంత వనరులను దోచుకుంటున్నారనీ విమర్శిం చారు. స్థానిక డ్రైవర్లు, యజమానులు చేసే ఉద్యమానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందనీ, అవసరమైతే అఖిల పక్షం ఆధ్వర్యంలో ఉద్యమం చేయడానికి కూడా సిద్ధమని వివరించారు. స్వార్థ రాజకీయాలకు బలి కావోద్దని, ఉద్యమం కొనసాగించాలనీ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ కాంట్రాక్టు వ్యవహారం పై స్పందించకుండా కృత్రిమ ఉద్యమాలు చేపిస్తున్న విషయాన్ని ఈ ప్రాంత ప్రజలు గమనిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వమే టెండర్ ఇచ్చి ఇప్పుడు ఉద్యమాలు చేయడం వెనుక మర్మమేమి అని ప్రశ్నించారు.

# దసరా ఉత్సవాల ఏర్పాట్లు అత్యున్నత ప్రమాణాలతో ఉండాలి





- భక్తులకు ఏమాత్రం అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు పూర్తిచేయండి
- ఏర్పాట్లలో నిర్లక్ష్యం కనిపిస్తే ఇంజనీరింగ్ అధికారులదే బాధ్యత
- ఆకస్మిక తనిఖీల్లో అధికారులకు దిశానిర్దేశం చేసిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ
- నాలుగు గంటల పాటు ఇంద్రకీలాద్రిపై అణువణువూ పరిశీలించిన కలెక్టర్

**విజయవాడ, సెప్టెంబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :**

దసరా ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లు అత్యున్నత ప్రమాణాలతో ఉండాలని.. భక్తులకు ఏమాత్రం అసౌక ర్యం కలిగినా, ఏర్పాట్లలో అలసత్వం కనిపించినా ఇంజ నీరింగ్ అధికారులనే బాధ్యత అని, నిరంతర పర్యవేక్షణ తో ఏర్పాట్లను పూర్తిచేసి ఉత్సవాలకు సిద్ధంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కనకదు ర్గమ్మ దేవస్థాన అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ నెల 22వ తేదీన ప్రారంభం కానున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు చేస్తున్న ఏర్పాట్లను శనివారం ఉదయం జిల్లా కలెక్టర్.. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన తనిఖీలు దాదాపు నాలుగు గంటల పాటు కొనసా గాయి. ఇంద్రకీలాద్రి, పరిసర ప్రాంతాల్లో ఉత్సవాలకు చేస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అణువణువూ పరిశీలించి కార్యనిర్వహణ అధికారి, ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. క్యూలైన్లు, ప్రసాదాల తయారీ, తాగునీటి సరఫరా, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతాలు తదితరాలను పరిశీలించారు. తొలుత ఘాట్ రోడ్డు నుంచి ఇంద్రకీలాద్రి రాజగోపురం వరకు ఏర్పాటు చేసిన క్యూ లైన్లను పరిశీలించి సూచనలు చేశారు. క్యూలైన్లపై వేసిన షేడ్స్ పైకి ఉండేలా చూసి.. వాటిని సుందరంగా తీర్చిదిద్దా లన్నారు. మునిసిపల్ కార్పొరేషన్ సహకారంతో భక్తులకు అవసరమైన స్నాన ఘట్టాలు, మరుగుదొడ్లు ఏర్పాటుచేయడంతో పాటు ఎప్పటిక ప్పుడు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పారిశుద్ధ్యంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అవసర మైన సిబ్బందిని నియమిం చుకోవడంతో పాటు నిరంతరం పర్యవేక్షించి పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల న్నారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ, పాలు, బిస్కట్లు తదితరాల పంపిణీకి ఏర్పాట్లు చేయాల ని సూచించారు.

### ఆధ్యాత్మిక వాతావరణంలో, భక్తిభావం ఉప్పొంగేలా..

సంస్కృతీ సంప్రదాయాల ఔన్నత్యం వెల్లివిరిసేలా.. భక్తిభావం ఉప్పొంగేలా దసరా ఉత్సవాల ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. ఉత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేయడం జరుగుతుందని.. అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుం దన్నారు. భక్తుల ప్రవేశ ద్వారాలు, బయటకు వెళ్లే మార్గాలు ప్రణాళిక ప్రకారం సరైన విధంగా ఉండేలా.. ఆధ్యాత్మిక శోభతో అలంకరణ ఉండేలా కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఆలయ కార్యనిర్వహణ అధికారి శీనా నాయక్, పోలీస్ అధికారులు రామకృష్ణ, దుర్గారావు, ఆలయ ఇంజనీర్లు కేవీఎస్ఆర్ కోటేశ్వరరావు, రాంబాబు, ఇతర ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నారు.

# ఆలయాల్లో జరిగే వివాహాలపై ప్రత్యేక దృష్టిపెట్టండి

- ప్రతి వివాహం తప్పనిసరిగా రిజిస్టర్ కావాలి
- బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణానికి సమష్టి భాగస్వామ్యం అవసరం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**విజయవాడ, సెప్టెంబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఆలయాల్లో జరిగే వివాహాలపై ఆయా ఆలయాల అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని.. ప్రతి వివాహం తప్పనిసరిగా రిజిస్టర్ కావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శనివారం కలెక్టర్ లక్ష్మీశ.. కలెక్టర్ కార్యాలయ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో వాసవ్య మహిళా మండలి, జస్ట్ రైట్ ఫర్ చిల్డ్రన్ స్వచ్ఛంధ సంస్థల భాగస్వామ్యంతో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా మత పెద్దలు.. పేరిట ప్రత్యేక సమావేశం జరిగింది. విజయవాడ నగరంతో పాటు జిల్లాలోని వివిధ దేవాలయాల అధికారులు హాజరైన ఈ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ బాల్య వివాహాలు లేని సమాజ నిర్మాణానికి సమష్టి భాగస్వా మ్యం అవసరమని.. బాల్య వివాహ రహిత జిల్లాగా ఎన్‌టీఆర్ జిల్లాను తీర్చిదిద్ది, ఆదర్శంగా నిలపడంలో ప్రతిఒక్కరూ చేయిచేయి కలపాలని పేర్కొన్నారు. పిల్లలకు బంగారు భవిష్యత్తు అందించేందుకు నిబద్ధతతో కృషిచేయాల్సి ఉందన్నారు. ఈ వసుధైవ కుటుంబంలో భాగమైన మనందరం బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించి, బాల్య వివాహాలు జరక్కుండా కలిసికట్టుగా కృషిచే యాల్సి ఉందన్నారు. చట్టాలను గౌరవిస్తూ, నిబంధనలు పాటిస్తూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా గళమెత్తాల్సిన అవసరముందన్నారు. ప్రతి దేవాల యంలో వివాహానికి అర్హత వయసు, వయసు ధ్రువీకరణపత్రాలు, చట్ట నియమ నిబంధనలు తెలియ జేసేలా ప్రదర్శన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయాల్లో జరిగే వివాహాలపై ఈవోలు ప్రత్యేకంగా దృష్టిసారించి, పర్యవేక్షించాలని సూచిం చారు. బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసేందుకు సిబ్బం దికి అవగా హన కార్యక్రమాలు నిర్వహిం చాలన్నారు. బాల్య వివా హాలపై ఫిర్యాదు చేసేందుకు 112 నంబరుతో పాటు చైల్డ్ హెల్ప్ లైన్ 1098కూడా అందుబాటులో ఉన్నాయ న్నారు. కార్యక్రమంలో భాగం గా ఆలయాల్లో ప్రదర్శిం చాల్సిన వివరాలతో కూడిన నమూనా పోస్టర్ల ను కలెక్టర్ లక్ష్మీశ.. స్వచ్ఛంద సంస్థల ప్రతి నిధులు, ఆల యాల అధికారులతో కలిసి ఆవిష్కరిం చారు. సమా వేశంలో వాసవ్య మహిళా మండలి ప్రెసి డెంట్ డా. బి.కీర్తి, ఎండోమెంట్ ఏసీ షణ్ముఖ నట రాజన్, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# డయేరియాను అదుపు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలం

- తక్షణం వైద్య బృందాలను పెంచాలి
- స్థానికులకు అన్ని విధాల భరోసా కల్పించాలి
- మృతుల కుటుంబాలను ఆదుకోవాలి
- సీడబ్ల్యూసీ సభ్యులు గిడుగు రుద్రరాజు డిమాండ్



**విజయవాడ, సెప్టెంబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :**

నగరంలోని న్యూ రాజరాజేశ్వరీపేటలో గత కొద్ది రోజులగా అతిసార విజృంభిస్తున్నా ఇప్పటివరకు అధికార యంత్రాంగం కారణాలు గుర్తించకపోవడం, పరీక్షల పేరుతో కాలయాపన చేస్తుండడం కూటమి ప్రభుత్వం చేతగానితనానికి నిదర్శనమని, డయేరియా ప్రబలి ప్రజలు మృత్యువాత పడుతున్నా కూడా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదని, డయేరియాను అదుపు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీడబ్ల్యూసీ సభ్యులు, ఏపీసీసీ పూర్వ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. న్యూ రాజరాజేశ్వరి పేటలో అతిసారను తక్షణం అదుపు చేసే చర్యలను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని డమాండ్ చేశారు. కలుషిత నీరే కారణమని స్థానికుల గగ్గోలు పెడుతున్నా, ముగ్గురు మృతి చెందడంతో పాటు వందలాది మంది పైగా ఆసుపత్రి పాలు అవుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిం చడం దారుణమ న్నారు. అతిసారకు ప్రభుత్వం, నగరపాలక సంస్థ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అన్ని దుకాణాలను మూయించిన అధికారులు, బార్లా తెరిచి ఉన్న బార్లు, వైన్ షాపులను ఎందుకు మూయించలేదని ప్రశ్నించారు. రోజులు గడుస్తున్నా ఇప్పటికీ కారణాలను నిర్ధారించని పరిస్థితుల్లో అధికారులు ఉండడం చేతగానితనానికి నిదర్శనమ న్నారు. చాలీచాలని వైద్య సదుపాయాలతో బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని వెంటనే వైద్య బృందాలను పెంచాలని, మృతుల కుటుంబాలకు సహాయం, అందరికీ ఆహారం, వైద్యం, వైద్య ఖర్చులు చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రతినిధులు చుట్టపు చూపుగా కాకుండా ఇంటింటికి తిరిగి ఇళ్లలోనే చికిత్స పొందుతున్న వారిని పరామర్శిం చాలని, అవసరమైతే బాధితులను ఆసుపత్రులకు తరలించాలని, మృతుల కుటుంబాలకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. దీనిపై సమగ్ర విచా రణ జరిపించాలని, కలుషిత నీటి సరఫరాకు బాధ్యు లను గుర్తించాలన్నారు. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యాలతో చెలగాటమాడటం తగదని ప్రభుత్వానికి సూచించారు.



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న దాసోజు శ్రవణ్

# కేబుల్ వైర్లు కట్‌చేస్తే ప్రభుత్వ పవర్‌ను కట్ చేస్తాం

## ఫెడరేషన్ ఆఫ్ ఏరియల్ కేబుల్ ఆపరేటర్స్ మహాధర్నా

**హైదరాబాద్ (ధర్నాచౌక్)**, సెప్టెంబరు 14(జర్నలిస్ట్ ఫైల్): కేబుల్ ఆపరేటర్ వృత్తిని దెబ్బతీస్తూ ప్రభుత్వం రాత్రికిరాత్రే కేబుల్ వైర్లు కట్ చేయించటం దుర్మార్గమని, ఇంకోసారి కేబుల్‌వైర్లు కట్‌చేస్తే ప్రభుత్వ పవర్‌ను కట్ చేస్తామని పలువురు వక్తలు హెచ్చరించారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా కేబుల్‌వైర్లను కట్ చేయటాన్ని నిరసిస్తూ ఫెడరేషన్ ఆఫ్ ఏరియల్ కేబుల్ ఆపరేటర్స్ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో పెద్దఎత్తున మహాధర్నా చేపట్టారు.

ఈ ధర్నాకు ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, చికోటి ప్రవీణ్ పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ 32 యేళ్లుగా కేబుల్ ఆపరేటర్లుగా ఐదు లక్షల మంది ఉపాధి పొందుతూ ఉంటే ఎప్పుడూ లేని సమస్య ఇప్పుడు ఎందు కొచ్చిందని ప్రశ్నించారు. కేబుల్‌వైర్లను కట్ చేయటం వెనుక రేవంత్‌రెడ్డి కుటుంబం పెద్దకుట్ర ఉందని, కేబుల్‌వైర్లు కట్‌చేసి వారి ఉపాధిని దెబ్బతీసి, తానే కేబుల్ కంపెనీ పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి, విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుల్‌వైర్లను కట్ చేయటం మానుకోవా లని, వెంటనే చర్చలకు ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే కేబుల్ ఆపరేటర్లతో కలసి, ప్రభుత్వాన్ని స్తంభింప చేస్తామని హెచ్చరించారు.

# సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్

**హైదరాబాద్**, సెప్టెంబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలోని ఏర్పాటు చేయనున్న సూపర్ థర్మర్ కేంద్రానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లాలో ఎన్టీపీసీ నిర్మించ తలపెట్టిన తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు (టీఎస్‌టీపీపీ)కు కేంద్రం నుంచి అనుమతి లభించింది. 2,400 మెగావాట్ల సామర్థ్యం గల టీఎసటీపీపీ రెండో దశ ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ పర్యావరణ అనుమతులు (ఈసీ) ఇస్తూ సర్క్యులర్ జారీ చేసింది. ఎనిమిది నెలల తరువాత కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ ప్రస్తుతం ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్సును ఇచ్చింది.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య

# నవంబరు 2న 'మాలల రణభేరి మహాసభ'

## మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్)**, సెప్టెంబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) : దేశంలో మనువాద పార్టీలు ఓటు బ్యాంక్ రాజకీయాల్లో భాగంగా దళితులను చమార్-నాన్ చమార్‌లుగా విభజించి, ఐక్యతను చీల్చి రాజ్యాధికారానికి దూరం చేసే కుట్రనే ఈ వర్గీకరణ అంశమని మాల మహానాడు జాతీయ, రాష్ట్ర కమిటీలు ఆరోపించాయి. ఈ వర్గకరణను దేశంలో దళితులు స్థాపించిన పార్టీలు ఆర్‌పిఐ, బిఎస్పీ, లోక్‌జనశక్తి, దళిత పాంథర్స్ తదితర వ్యతిరేకిస్తున్నాయంటే మనువాద పార్టీల కుట్రలను మనం అర్థం చేసుకోవచ్చునని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య చెప్పారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలుగు రాష్ట్రాల అధ్యక్షులు బూర్గుల వెంక టేశ్వర్లు, కొమ్మతోటి పాల్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. విద్యా, ఉద్యోగ రంగాలలో వెనుకబడ్డ కులాలకు న్యాయం జరిగేలా వారిలోని వెనుకబాటు తనాన్ని గుర్తించి ప్రస్తుత జనాభాకు అనుగుణంగా వర్గీకరణ చేయాలని సుప్రీంకోర్టు సూచిస్తే, ఆ సూచనలను రాష్ట్ర ప్రభుత ్వం పట్టించుకోకుండా కేవలం ఒకే కులానికి లబ్ధి చేయాలన్న సిఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు షమీమ్ జస్టిస్ అక్తర్ కమిషన్ హాడావుడిగా 2011 జనాభా ప్రకారం అన్ని రంగాలలో అభివృద్ధి చెందినవారికే రిజర్వేషన్‌లు దోచిపెట్టిందని ఆరోపించారు. మాలలకు ఇచ్చిన 5 శాతం రిజర్వేషన్‌లు దక్కకుండా రోస్టర్ పాయింట్‌లను కేటాయించి అన్ని రంగాలలో మాలలను అణిచివేసేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆయన ఆరోపించారు. ఇందుకు నిరసనగా నవంబరు 2వ తేదీన లక్షలాది మంది మాలలతో 'చల్ హైదరాబాద్' పేరిట 'మాలల రణభేరి మహాసభ'ను నిర్వహిస్తున్నామని చెన్నయ్య చెప్పారు. ఈ మేరకు ఈ రణభేరికి సంబంధించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు.

# ఫీజులు చెల్లించక మూతపడుతున్న కాలేజీలు

## తక్షణమే బకాయిలు విడుదల చేయాలి

## ఎంపి. ఆర్.కృష్ణయ్య డిమాండ్

**హైదరాబాద్**, సెప్టెంబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) : ఫీజుల బకాయిలు చెల్లించక పోవడంతో కాలేజీలు మూత పడుతున్నాయని దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి. ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఈమేరకు శనివారం విద్యానగర్‌లోని బిసిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజుల బకాయిలు ఇవ్వకపోతే ఎమ్మెల్యేలు ఎంపీలను తిరగనివ్వమని హెచ్చరించారు. ఈ నెల 15 నుంచి రాష్ట్రంలో అన్ని ఇంజనీరింగ్, ఇతర వృత్తి విద్యా కాలేజీలు 17 నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీలు నిరవదికంగా బంద్ చేస్తామని ప్రకటించారని ఇది చాలా సీరియస్ సమస్య అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 22 నెలలు గడుస్తున్నా 20 రూపాయలు కూడా విడుదల చేయకుండా అన్యాయం చేస్తుందన్నారు. ఒకవైపు సిఎం రేవంత్ రెడ్డి బీసీల అభివృద్ధికి తెలంగాణ రోల్ మోడల్ అంటూ ప్రకటనలు చేస్తూ ..ఇక్కడ పేద కులాలు చదువుకోకుండా కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. చదువుకునేందుకు ఫీజులు కూడా ఇవ్వని ప్రభుత్వం రేపు బి.సి రిజర్వేషన్లు 42 శాతంకు పెంచుతామంటే ఎలా నమ్ముతామని ప్రశ్నించారు. ఫీజులు చెల్లించకుండా సమస్యను నీరుగారుస్తూ ఈ స్కీమును ఎత్తివేసే కుట్ర జరుగుతుందని విమర్శించారు. ఈ స్కీము పెట్టిన తర్వాత గ్రామాల్లో వ్యవసాయ కూలీల పిల్లలు, మెడిసన్, ఇంజనీరింగ్, పీజీ, డిగ్రీలు చదువుతున్నారు, సమాజంలో గుణాత్మకమైన మార్పు ప్రారంభమై చైల్డ్ లేబర్, అరికట్టబడిందన్నారు.

# ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి

## ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఈ దుస్థితి

## కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

**హైదరాబాద్**, సెప్టెంబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఆందోళన బాటపట్టిన విషయం తెలిసిందే. ఈ నెల 15 నుంచి కాలేజీల నిరవధిక బందు పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో ప్రైవేటు కాలేజీల యాజ మాన్యాలు, విద్యార్థుల సమస్యలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. రాష్ట్రంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు యువతను నిలువునా మోసం చేశాయని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించక ప్రైవేటు కళాశాలలు మూతపడే దుస్థితి వచ్చాయని బండి సంజయ్ అన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో విద్యార్థులు తమ సర్టిఫికెట్లను కళాశాలల నుంచి తీసుకోలేకపోతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక యాజమాన్యాలు, సిబ్బంది జీతాలు లేక అవస్థలు పడుతున్నారని, తాము నమ్ముకున్న సంస్థలు కళ్లెదుటే కూలిపోతున్నాయని అన్నారు. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ సర్కార్ పాలనా వైఫల్యమేనని అన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు కనీసం గ్రూప్-1 పరీక్షలను కూడా సక్రమంగా నిర్వహించలేకపోయారని మండి పడ్డారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలతో విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలను కోల్పోతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రైవేటు కళాశాలల సమస్యలు పరిష్కరించాలని, ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

# విద్యార్థులే దేశ కార్పొరేట్‌రంగ భవిష్యత్తు నేతలు

## నల్సార్‌లో జరిగిన ముగింపు సదస్సులో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



శామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీలో జరిగిన ముగింపు సదస్సులో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి)**, సెప్టెంబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :విద్యార్థులే భారతదేశ కార్పొరేట్ రంగానికి భవిషత్ నాయకులు అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పేర్కొన్నారు. శనివారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని నల్సార్ లా యూని వర్సిటీలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసిఎస్ఐ), నల్సార్ లా యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన రెండు రోజుల సదస్సు ముగిసింది.

రెండు రోజుల పాటు జరిగిన చర్చల తరువాత రెండు రోజుల వార్షిక కార్యక్రమం కార్పొరేట్ గవర్నెన్స్ కాన్ఫరెన్స్-2025 (కార్పప్ కన్ 2025) నల్సార్‌లోని సార్క్ లా హాల్‌లో ముగిసింది. ఈ సదస్సు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ దేశ కార్పొరేట్ భవిషత్‌ను రూపొందించటంలో కీలకమైన స్తంభాలుగ నీతి, బాధ్యత అని ఆ స్థిరత్వాన్ని స్పష్టం చేశారు. 2016లో ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్సీ కోడ్ వంటి మైలురాయి సంస్కరణలో ఒకటని, ఇది నిశ్చయతను తెస్తుందని, రుణదాతల విశ్వాసాన్ని పునరుద్ధ రిస్తుందన్నారు.

అదేవిధంగా జవాబుదారీ తనంను నిర్ధారిస్తుందన్నారు. ప్రతి పౌరుడిలాగ కార్పొరేట్ పౌరులు కూడ న్యాయంగా, పారదర్శకత, సుస్థిర అభివృద్ధి ప్రకృతి సమ తుల్యం పట్ల బాధ్యతను కలిగి ఉంటుందన్నారు. స్థానిక గిరిజన సమాజాల నుంచి కూడ కార్పోరేట్ నిపుణులు పాఠాలు నేర్చుకోవాలన్నారు.

స్థానిక గిరిజన సమాజాలు ప్రకృతి వనరులను వస్తువులను మాత్రమే చూడవని, అవి ప్రకృతితో సామరస్యంగా జీవిస్తాయని అన్నారు. మనం భూమి యజమానులం కాదని మనం గుర్తించాలన్నారు. దాన్ని పంచుకోవటానికి, నిలబెట్టటానికి మేము ఇక్కడ ఉన్నాం, విద్యార్థులు, పాల్గొనే వారు నైతిక విలువలు, ఉద్దేశ్యం, ప్రతిబింబాలను వారి చర్యలలో అనుసంధానించాలని అన్నారు.

ఈ సమావేశం మిమ్మల్ని ఆలోచింపచేస్తుందని, మిమ్మల్నీ అనుభూతి చెందిస్తుందని, నేర్చుకునేలా చేస్తుందన్నారు. నేర్చుకోకుండ కూడ చేస్తుందన్నారు.

కార్పొరేట్ భవిషత్‌ను రూపొందించటంలో విద్యార్థుల పాత్రను గవర్నర్ ప్రశంసించారు. స్థిరమైన అభివృద్ధి యొక్క ప్రాముఖ్యతను గవర్నర్ తెలియజేశారు. స్థిరత్వం లేకుండ అభివృద్ధి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్సార్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు, ప్రముఖులు సిఎస్ఆర్ వెంకటరమణ, సిఎస్‌బి నరసింహన్, నల్సార్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.వాసంతి, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# మాజీమంత్రి కెటిఆర్‌ను చూస్తే జాలేస్తుంది!

## పార్టీ ఫిరాయింపులపై ఏం మాట్లాడిన ప్రయోజనం లేదు

## దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

**హైదరాబాద్**, సెప్టెంబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) : మాజీ మంత్రి కెటిఆర్‌ను చూస్తే జాలేస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి అన్నారు. శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. కెటిఆర్ ఇంట్లో ఉండలేక.. ఫామ్ హౌస్‌లో కూర్చోలేక బయట గాలికి తిరగడానికి సిద్ధమయ్యాడని అన్నారు. చెల్లెలు పోరు ఒక వైపు, బావ నసుగుడు మరో వైపు, అయ్య సతాయింపు మరో వైపు కెటిఆర్ తట్టుకోలేకపోతున్నాడని అన్నారు. నాయకులు, కార్యకర్తలు ఎవరి దారి వాళ్లు చూసుకుంటుండటంతో ఏం చేయాలో తెలియక జిల్లాల దారి పడుతున్నాడని అన్నారు. బిఆర్ఎస్ సచ్చిపోయిందని, నువ్వెన్ని లేపనాలు పూసినా ఉపయోగం లేదని అన్నారు. అందులో నుంచి మీ అవినీతి కంపు వాసన తప్ప ఇకొక్కటి రాదన్నారు. నువ్వెంత తిరిగినా నీకు, మీ నాయకులకు డిజిల్ ఖర్చు తప్ప ఉపయోగం లేదన్నారు. ప్రజలు మమ్మల్ని నమ్మడం మానేశారు, మీ చెత్త కబుర్లు వినిడానికి తెలంగాణ ప్రజలు అమాయకులు కాదని అన్నారు. మీరెన్ని కబుర్లు చెప్పినా మీ పదేళ్ల పాపాలను జనాలు మరిచిపోలేదని, మీ పాపం పండే మిమ్మల్ని ఫామ్ హౌస్‌లోకి విసిరేశారని అన్నారు. సోషల్ మీడియా స్టంట్ల కోసం కెటిఆర్ సభలు పెడుతున్నాడని, పదేళ్ల అవినీతి సంపాదనతో సోషల్ మీడియా పెట్టుకుని పాడే మీద ఉన్న పార్టీకి బహుబలి రేంజ్‌లో కలరింగ్ ఇస్తున్నారని, మీ సోషల్ మీడియా బిల్డప్‌లను జనం చూసి నవ్వుకుంటున్నారని అన్నారు.

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు ఏ మోహం పెట్టుకుని వెళ్తున్నావు? జిల్లాకు ఏం చేశారు మీరు?మీ పదేళ్ల పాలన చూసి పాలమూరు జనం మోహం మీద ఊసి పంపించారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో, లోక్ సభ ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడించారు..మూడో స్థానానికి పరిమితం చేశారు..పాలమూరు రంగారెడ్డి పూర్తి చేయలేదని అన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను ఎక్కడిక్కడ వదిలేశారని, కుర్చీ వేసుకుని కూర్చోని ప్రాజెక్టులను పూర్తి చేస్తానని చెప్పి ఓట్లు వేయించుకుని అన్యాయం చేశారన్నారు. పదేళ్లలో చేనేత శాఖ మంత్రిగా ఉన్న కెటిఆర్ గద్వాలలో టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటు చేస్తామని చెప్పి చేనేత కార్మికలను మోసం చేశారన్నారు. తుమ్మిల ప్రాజెక్టును పూర్తి చేస్తానని చెప్పి నగం సగం పనులు చేసిపోయాడని, జూరాలను గాలికి వదిలేశారని అన్నారు. మా ప్రభుత్వం 120 కోట్లతో జూరాల పైన కొత్త బ్రిడ్జిని నిర్మిస్తుందన్నారు. మా పాలమూరు బిడ్డ ముఖ్యమంత్రి అయ్యాక మాకు ఏ పార్టీ అవసరం మాకు లేదు.. పార్టీ మారిన ఎమ్మెల్యేలపైన కెటిఆర్ నోటీకొచ్చినట్లు మాట్లాడుతున్నారని, అది మంచిది కాదన్నారు. పార్టీ ఫిరాయింపులపైన కేటీఆర్ ఏం మాట్లాడినా ఉపయోగం లేదు, జనం మమ్మల్ని క్షమించరని అన్నారు.

# గద్వాలలో టెక్స్టైల్ పార్కు ఏర్పాటు ఏమైంది?

## కెటిఆర్‌ను ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్

**హైదరాబాద్**, సెప్టెంబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) : మాజీ మంత్రి కెటిఆర్ గద్వాలకు ఏ ముఖం పెట్టుకుని వస్తావు అంటూ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పదేళ్ల పాటు చేనేత శాఖ మంత్రిగా ఉన్న కెటిఆర్ గద్వాలలో టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటు చేస్తామని చెప్పి చేనేత కార్మికలను మోసం చేశాడన్నారు. శంకుస్థాపన ఫలకం చుట్టు పిచ్చి మొక్కలు మొలిచాయని, కెటిఆర్ వెళ్లి చూడాలన్నారు. తుమ్మిల ప్రాజెక్టును పూర్తి చేస్తానని చెప్పి సగం సగం పనులు చేసిపోయారన్నారు. సరైన సౌకర్యాలు కల్పించకుండానే వంద పడకల ఆస్పత్రి రిబ్బన్ కట్ చేసి పోయాడన్నారు. 10 ఏళ్లలో 4 మున్సిపాలిటీలకు ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలనలో వంద పడకల ఆస్పత్రిని అన్ని సౌకర్యాలతో ప్రారంభించుకున్నామన్నారు. మా ప్రభుత్వ హయాంలో మల్లమ్మ గుంటకు సర్వే పనులు ప్రారంభమయిందన్నారు.

120 కోట్లతో జూరాల పైన కొత్త బ్రిడ్జిని నిర్మిస్తున్నామన్నారు. పదేళ్లలో నడిగడ్డ ప్రజలను మోసం చేశాడన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపైన స్త్రీ లింగం, పురుష లింగం అంటు కెటిఆర్ విమర్శలు చేస్తున్నాడని, టికెట్ ఇచ్చేటప్పుడు ఏ లింగమో నీకు తెలియదా అంటూ ప్రశ్నించారు. 10 ఏళ్లలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అడ్డగోలుగా కాలరాశారు అన్నారు. నేను కాంగ్రెస్ విప్‌గా ఉన్నప్పుడు మా పార్టీ ఎమ్మెల్యేలను ఐదుగురిని, టిడిపి ఎమ్మెల్యేలను 15 మందిని బిఆర్ఎస్‌లో చేర్చుకున్నారు. కెసిఆర్ ఫిరాయింపులపైన తానే సుప్రీంకోర్టులో పిటిషన్ వేశానని, మీరు చేస్తే సంసారం, వేరే వాళ్లు చేస్తే వ్యభిచారమా? అంటూ ప్రశ్నించారు. కెసిఆర్ రాజకీయాలను వ్యభిచారంగా మార్చారని, నడిగడ్డకు వచ్చే అర్హత కెటిఆర్‌కు లేదన్నారు. ఇక్కడి ప్రజలు తిరగబడతారన్నారు. నడిగడ్డకు వచ్చి నువ్వు ఉద్ధరించేది ఏమీ లేదని, రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, గద్వాల జిల్లాలపైన మీ చెల్లెను చూసుకోలేవు...నీ వల్లనే బిఆర్ఎస్ మునిగిపోతుందని మీ కార్యకర్తలే అంటున్నారు. నడిగడ్డ ప్రజలు బుద్ధి చెపుతారన్నారు.

# ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుంటేనే దేశం మనుగడ

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్**, సెప్టెంబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) : వికసిత భారత్, అమృత్ కాల్ అంటే కేవలం అదానీ


ఎఐబిఇఎ, ఎఐసిబిఇఎఫ్ మహాసభలో పాల్గొన్న జాతీయ ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకటాచలం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాంబాబు తదితరులు

అంబానీలకే, కార్మికలోకానికి, సామాన్య ప్రజలకు కాదని అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల అసోసియేషన్ (ఎఐబిఈఎ) జాతీయ ప్రధాన కార్య దర్శి సిహెచ్.వెంకటాచలం సిహెచ్. వెంకటాచలం అన్నారు. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐసిబిఈఎఫ్) ఉభయ రాష్ట్రాల 37వ మహాసభ, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ యూనియన్ (సిబిఐఒయు) 13వ త్రైవార్షిక సభలు సంయుక్తంగా శుక్రవారం కాచిగూడలో జరిగాయి. ఈ మహాసభలను వెంకటాచలం ప్రారంభించి మాట్లాడారు. నేడు బ్యాంకుల్లో వివిధ రూపాల్లో రూ.250 లక్షల కోట్లకు పైగా ప్రజాధనం ఉందని, ఇది ప్రభుత్వ బడ్జెట్ కంటే ఎక్కువ అని, ఈ ధనం అంతా సామాన్య ప్రజలదే తప్ప ప్రభుత్వానిది కాదని, ఈ డబ్బును కాపాడవలసిన బాధ్యత ఉద్యోగులపై ఉందని అన్నారు. ప్రైవేట్ బ్యాంకులన్నీ ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నాయని, అయినప్పటికీ పాలకులు ప్రైవేట్ బ్యాంకులను ప్రోత్సహిస్తూ దశాబ్దాల తరబడిగా ప్రజలకు అండగా ఉంటూ వారి ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచడానికి కృషి చేస్తున్న ప్రభుత్వరంగ బ్యాంకులను నిర్వీర్యం చేయడానికి పాలక వర్గాలు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. వ్యవసాయం, ఉత్పత్తి రంగాలు, చిన్నతరహా పారిశ్రామిక రంగం కూడా అతలాకుతలం అవుతుందని, అయినప్పటికీ ప్రభుత్వం మోసపూరిత ప్రకటనలు చేస్తూ సామాన్య ప్రజలను మభ్య పెడుతుందని విమర్శించారు. ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుంటేనే ఈ దేశం మనుగడ సాధ్యమౌతుందని ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు అన్నారు. బ్యాంకుల ఉద్యోగుల హక్కులు కాపాడటంలో ఎర్రజెండా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. భారత బ్యాంకింగ్ సెక్టార్ ప్రధాన యూనియన్ నేతృత్వం వహిస్తున్న వెంకటాచలం బ్యాంకింగ్ సంఘాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చారని అభినందించారు. ఎపిటిబిఎఫ్ ప్రధాన కార్యదర్శి బి.ఎస్.రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంకులను పరిరక్షంచు కోవాలని, పాలకుల కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. సెంట్రల్ బ్యాంక్ ఉద్యోగులు ప్రభుత్వ రంగ బ్యాంక్ నిలబెట్టుకోవాలని, ఇందు కోసం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎఐబిఈఎ సభ్యులు మరింత సంఘటితంగా పోరాడాలన్నారు.

# బతుకమ్మ సంబురాలను విజయవంతం చేయాలి

## ఎంపి డికె అరుణ

**హైదరాబాద్**, సెప్టెంబరు 14 (జర్నలిస్ట్ ఫైల్): సెప్టెంబర్ 21వ తేదీ నుంచి 30 తేదీ వరకు తెలంగాణలో జరిగే బతుకమ్మ పండుగ సంబరాలను విజయవంతం చేయాలని ఎంపి డికె అరుణ పిలుపునిచ్చారు. శనివారం ఉదయం హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని నివాసంలో సంస్కార భారతి తెలంగాణ మాతృ శక్తి విభాగం వారితో కలిసి బతుకమ్మ సంబరాలకు సంబంధించిన పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డికె అరుణ మాట్లాడుతూ ఈ సంవత్సరం సంస్కార భారతి తెలంగాణ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగే బతుకమ్మ ఉత్సవాల్లో మహిళలంతా కలిసి మెలసి బతుకమ్మను ఆడుతూ మన సంస్కృతిని చాటుదాం అని పిలుపునిచ్చారు. ఈ ఉత్సవాలను ప్రజలు విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంస్కార భారతి మాతృ శక్తి రాష్ట్ర కన్వీనర్ నెల్లుట్ల సుష్మా, సంస్కార భారతి రాష్ట్ర కార్యదర్శి భవాని, రంగోలి విభాగం కన్వీనర్ జయశ్రీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయలక్ష్మీ ్మ, యాక్టింగ్ విభాగం రాష్ట్ర కో కన్వీనర్ స్వాతి, లావణ్య, సంతోషి, పారిజాత, శ్రీవిద్య, లావణ్య, నర్మద తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్-1, 2 పరీక్షలు పూర్తి పారదర్శకంగా నిర్వహించాలి

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**హైదరాబాద్**, సెప్టెంబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలు పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వేలాది మంది నిరుద్యోగులు హైదరాబాద్ అశోక్ నగర్ లైబ్రరీ, వివిధ ఇన్స్టిట్యూట్స్ దగ్గర రాత్రిపగలు చదువుతూ, ఉద్యోగ అవకాశాల కోసం వేచి ఉన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇవ్వక, ఏ విధమైన స్పష్టత లేకుండా వ్యవహరిస్తుందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు అన్యాయం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే వైఖరిని అవలంబిస్తుందన్నారు. నిరుద్యోగులను రోడ్డుపైకి తీసుకువచ్చి, కఠినంగా, నిరక్ష ్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. 35,000, 1,00,000 ఉద్యోగాలు ఇచ్చాం అని చెప్పడం మాత్రమే, నిజమైన లెక్కలు చూపడం లేదు. జాబ్ క్యాలెండర్ ప్రకారం, యుపిఎస్ తరహా తెలంగాణ పబ్లిక్ కమిషన్ సైతంపరీక్షలు సమయానికి నిర్వహించాలన్నారు. నిరుద్యోగులు ఆమరణ నిరాహార దీక్షకు దిగకముందే, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# ఓటు బ్యాంకు కోసం ఒకేలా కాంగ్రెస్, బిఆర్ఎస్ శైలి

## నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్

**హైదరాబాద్**, సెప్టెంబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) : ఓటు బ్యాంకు కోసం బిఆర్ఎస్ ఇప్పుడు కాంగ్రెస్ ఒకే రకంగా ప్రవర్తిస్తున్నాయని నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. హిందువులన్నా, హిందూ పండగలన్నా చులకన భావంతో చూస్తున్నారని మండిపడ్డారు. శనివారం నిజామాబాద్ కమిషనరేట్‌లో సిపిని కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఇటీవల నవీపేటలో ఒక యువకుడు గణపతిపై కాషాయ జెండా ఎగురవేస్తే ఫోటోలో అది మసీదుపై పెట్టినట్లు వచ్చిందని దాంతో ఆ యువకుడిని ఆగమేఘాల మీద అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారన్నారు. ఈ ఘటన తర్వాత అక్కడ ముస్లింలు బైక్ ర్యాలీ నిర్వహించి రబసా చేసినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. మేము డిమాండ్ చేశాక చర్యలు తీసుకున్నారని చెప్పారు. జెండా ఎగురవేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న యువకుడు రాజస్థాన్‌కు చెందిన వాడని అతడిని రాజస్థాన్ పంపాలని అంటున్నారు. మరి దేశంలోకి వచ్చిన బంగ్లాదేశ్, మయన్మార్ నుంచి ఎందరో అక్రమంగా ప్రవేశించారు. టర్కీ నుంచి వచ్చి తరతరాలుగా ఇక్కడే ఉంటున్న కూడా వెనక్కి పంపిద్దామా కాంగ్రెస్ చెప్పాలన్నారు. తప్పు చేసిన వారిని అరెస్టు చేయాలి తప్ప మతం ఆధారంగా చర్యలు తీసుకుంటే సమాజంలో విభజన వస్తుందని హెచ్చరించారు. జిల్లాల్లో టెర్రరిస్ట్ యాక్టివిటీస్ పెరిగాయని, బోధన్ పిఎఫ్, సిమిక్ అడ్డగా మారాయని వీటి వల్ల ప్రజలు భయాందోళనలో ఉన్నారని చెప్పారు. లా అండ్ ఆర్డర్ సరిగా లేదని ఆరోపించారు. ఎన్‌జిఒల పేరుతో హిందూ అమ్మాయిలను ముస్లిం యువకులు పెళ్లి చేసుకుంటే ఆర్థికంగా సహాయం చేస్తామని అంటున్నారని ఇది లవ్ జిహాద్ అంటారన్నారు. ఈ పరిస్థితికి వస్తే ఇక్కడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏంచేస్తుందని ప్రశ్నించారు.

# రాష్ట్రంలో యూరియా కృత్రిమ కొరత


## బిజెపి అధికార ప్రతినిధి ఎన్‌వి సుభాష్

**హైదరాబాద్**, సెప్టెంబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సమయానికి యూరియాను అందించడంలో విఫలమయ్యారని బిజెపి అధికార ప్రతినిధి ఎన్‌వి సుభాష్ అన్నారు. రాష్ట్రంలో ఎరువుల కృత్రిమ కొరతను సృష్టించడం విషయంలో భారతీయ జనతా పార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తుందన్నారు. రైతులు రోజూ యూరియా కోసం కేంద్రాల వద్ద క్యూలైన్లలో నిలబడి వేచిచూసినా, ఆఖరుకు కొంతమంది ఖాళీ చేతులతోనే వెళ్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి, కాంగ్రెస్ కేబినెట్ మంత్రులు ఎప్పటికీ రైతులకు హామీలు ఇస్తూనే ఉంటారు. కానీ సూర్యాపేట్ వంటి జిల్లాల్లో రైతులు సరిపడా యూరియా పొందక ఇబ్బంది పడుతున్నారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని చెబుతున్నా, మరోవైపు రైతులకు ఎందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయంటూ ప్రశ్నించారు.తెలంగాణలో 2024-25 రబి సీజన్ కోసం 9.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, కేంద్ర ప్రభుత్వం 12.02 లక్షల మెట్రిక్ టన్నులను పంపించిందని, ఇది అవసరానికి మించి 3 లక్షల టన్నులు ఎక్కువ అన్నారు. అయితే ఆ యూరియా ఎక్కడికి పోయిందో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని, అది మాయమైందా, లేక బ్లాక్ మార్కెట్‌కి వెళ్ళిందా? అని ఎన్.వి.సుభాష్ మండిపడ్డారు. ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పాలనలో రైతులు రాజులాగా జీవిస్తున్నారని చెబుతున్నారు.

## వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని

# కన్నకూతురినే కడతేర్చిన తల్లి

**శివ్వంపేట**, సెప్టెంబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని కన్నకూతురినే ఓ కసాయితల్లి హత్య చేసిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శభాష్‌పల్లి గ్రామానికి చెందిన బొట్టు మమతకు ఐదేళ్ల క్రితం రాయపోల్ మండల్ వడ్డేపల్లికి చెందిన భాస్కర్‌తో వివాహం జరిగింది. వీరికి కుమారుడు చరణ్, కూతురు తనుశ్రీ ఉన్నారు. భార్యాభర్తల మధ్య గొడవ కావడంతో మమత తన పిల్లలతో తల్లిగారి ఇంటివద్దనే ఉండేది. శభాష్‌పల్లికి చెందిన ఫయాజ్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉండడంతో జూన్ 7న ఫయాజ్‌తో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయారు.


తనుశ్రీ (ఫైల్)

కొడుకు చరణ్‌ను పుట్టింట్లో వదిలేసి కూతురు తనుశ్రీని వెంట తీసుకొని వెళ్లింది. మమత తల్లి.. కూతురు కనిపించడంలేదని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేపట్టారు. మమత, ఫయాజ్‌లను గుంటూరులో అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా మమత వద్ద కూతురు లేకపోవడంతో పోలీసులు ఏం చేశా రంటూ విచారించగా తమ వివాహేతర సంబంధానికి అడ్డుగాఉందని శభాష్‌పల్లి గ్రామశివారులో చంపి పాతిపెట్టామని ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో తూప్రాన్ సిఐ రంగకృష్ణ, స్థానిక ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌పై సుంకాలకు జీ7 దేశాలు సిద్ధం

## భారత్, చైనా సహా రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై భారీగా ఆంక్షలు

### అమెరికా ప్రతిపాదనకు ఆ దేశాలు అంగీకారం




**వాషింగ్టన్**, సెప్టెంబరు 14 : రష్యన్ చమురును కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై ఐరోపా సమాఖ్యతో పాటు, జీ7 దేశాలు టారిఫ్‌లు విధించాలని అమెరికా ప్రతిపాదించింది. దీనికి జీ7 దేశాలు అంగీకరించినట్లు తెలుస్తోంది. భారత్‌పై భారీగా టారిఫ్‌లు విధించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డిమాండ్లను జీ7 దేశాలు అంగీకరించినట్లు తెలిసింది. ఉక్రెయిన్‌లో శాంతి పునరుద్ధరణకు రష్యాపై ఒత్తిడి తేవడమే సరైన మార్గమని అమెరికా భావిస్తోంది. అందులో భాగంగా రష్యన్ చమురును కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై ఐరోపా సమాఖ్యతో పాటు, జీ7 దేశాలు టారిఫ్‌లు విధించాలని అమెరికా ప్రతిపాదించింది. ఈ టారిఫ్‌ల విధింపునకు తాజాగా జీ7 దేశాలు కూడా అంగీకరించినట్లు సమాచారం. జీ7 దేశాల ఆర్థిక మంత్రులు ఈ సుంకాల విధింపుపై చర్చించారు. ఈ విషయాలను అమెరికా వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్ వెల్లడించారు. ఇప్పటికే భారత దిగుమతులపై అమెరికా భారీ సుంకాలు విధించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ క్లిష్ట సమయంలో నిర్ణయాత్మక చర్య తీసుకోవడానికి వారంతా ముందుకురావాలని కోరారు. ఉక్రెయిన్ యుద్ధం ముగించడానికి నిజంగా కట్టుబడి ఉంటే రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకు ముందుకురావాలని యూఎస్ వాణిజ్య మంత్రి స్కాట్ బెసెంట్ పిలుపునిచ్చారని తెలిపారు. ఇందుకోసం మాస్కో నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై సుంకాలు విధించాలంటూ అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రతిపాదనలను ఉద్ఘాటించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా యుద్ధం ముగింపునకు కట్టుబడి ఉన్నామని జీ7దేశాలు ప్రకటించాయని తెలిపారు. ఉక్రెయిన్ రక్షణకు నిధులు సమకూర్చేందుకు స్తంభించిన రష్యా ఆస్తులను ఉపయోగించే విషయంపైనా సమావేశంలో చర్చించినట్లు పేర్కొన్నారు. క్లిష్ట సమయంలో అమెరికాతో కలిసి ఈ దేశాలు కూడా నిర్ణయా త్మక చర్యలు చేపడుతాయని ఆశిస్తున్నామని వెల్లడించారు.

దీంతో భారత్, చైనాలపై సుంకాల విధింపునకు ఆయా దేశాలు కూడా సిద్ధమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాగా, రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకు ఇంతకుముందు ఐరోపా సమాఖ్య(ఈయూ) దేశాల ముందు కూడా ట్రంప్ ఇలాంటి ప్రతిపాదనలే చేశారు. అయితే, ఈవిషయంలో ఈయూ దేశాల్లో భిన్నాభిప్రాయలు వ్యక్తమయ్యాయి. దీంతో అది సాధ్యపడలేదు. ఇవే ప్రతిపాదనలను ఆయన మళ్లీ జీ7 దేశాల ముందుపెట్టడం గమనార్హం. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై 50 శాతం సుంకం విధించడం అంత తేలికైన విషయం కాదని డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. రష్యాపై చర్య తీసుకునేందుకు భారత్‌తో విభేదానికి తాము సిద్ధమయ్యామని అన్నారు. భారత్ రష్యాకు అతిపెద్ద చమురు వినియోగదారని తెలిపారు. ఆ దేశం నుంచి చమురు కొంటున్నారన్న కారణంతోనే నేను భారత్‌పై 50 శాతం సుంకం విధించానని, అది చాలా పెద్ద చర్య అని చెప్పారు. దీంతో భారత్‌తో విభేదాలు వచ్చాయని, అయినా తాను చర్య తీసుకున్నానని చెప్పారు. ఇలాంటి ఎన్నో పనులు చేశానని ఓ ఇంటర్వ్యూలో ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత్‌పాక్ ఘర్షణ సహా ప్రపంచంలోని వివిధ దేశాల మధ్య ఏడు యుద్ధాలను తాను నివారించినట్లు ట్రంప్ మళ్లీ పాత పాట పాడారు.



## జపాన్‌లో లక్షదాటిన శతాధిక వృద్ధుల జనాభా

### ప్రపంచ వ్యాప్తంగా 55వసారి జపాన్ రికార్డు

**టోక్యో**, సెప్టెంబరు 14 : జపాన్ కొత్త రికార్డు క్రియేట్ చేసింది. ఆ దేశంలో వంద ఏళ్ల దాటిన వృద్ధుల సంఖ్య లక్ష దాటినట్లు ప్రభుత్వం వెల్లడించింది. వరుసగా 55వ సంవత్సరం ఆ దేశం కొత్త రికార్డును నమోదు చేసింది. సెప్టెంబర్‌లో శతాధిక వృద్ధుల సంఖ్య 99,763 మందికి చేరుకున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి వెల్లడించారు. అయితే దీంట్లో 88 శాతం మంది మహిళలే ఉండడం గమనార్హం. అత్యధిక కాలం జీవిస్తున్న వారి సంఖ్య జపాన్‌లో అధికం. ఆ లిస్టులో జపాన్ టాప్‌లో ఉంటుంది. ప్రపంచంలోని అత్యంత వృద్ధ వ్యక్తి ఆ దేశంలో జీవిస్తున్నట్లు రికార్డులు ఉన్నాయి. చాలా ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వల్ల జపాన్ ప్రజలు ఎక్కువ కాలం జీవిస్తున్నారు. కానీ అక్కడ జనన రేటు తక్కువగా ఉన్నది. జపాన్ నివేదికల ప్రకారం ఆదేశంలో జీవిస్తున్న అత్యంత వృద్ధ వ్యక్తి వయసు 114 ఏళ్లు. యమటో కరియామాకు చెందిన ఆ మహిళను షిగికో కగ్వాగా గుర్తించారు. నారా సిటీకి శివారులో ఈ ప్రాంతం ఉంది. జపాన్ లెక్కల ప్రకారం అత్యంత వృద్ధ మగ వ్యక్తిని కియోటకా మిజునోగా గుర్తించారు. ఆయన వయసు 111 ఏళ్లు. ఇవాటా అతని స్వస్థలం. ఆరోగ్యశాఖ మంత్రి తకమారో పుఖోకా ఈ నేపథ్యంలో వృద్ధులకు కంగ్రాట్స్ చెప్పారు. 87,784 మంది మహిళలు, 11,979 మంది వృద్ధ పురుష జనాభా ఉన్నట్లు మంత్రి తెలిపారు. జపాన్‌లో సెప్టెంబర్ 15వ తేదీన వృద్ధ దినోత్సవం జరుపుతున్నారు. ఈ సందర్భంగా ప్రధాని నుంచి ఆ వృద్ధులకు ఓ లేఖ, సిల్వర్ కప్ అందిస్తారు. ఈ ఏడాది 52,310 మంది పురస్కారానికి ఎంపికయ్యారు. 1963లో శతాధిక వృద్ధులను లెక్కింపు చేయడం మొదలుపెట్టారు. ఆ సమయంలో 153 మందివందేళ్లు దాటిన వాళ్లు ఉన్నారు. 1981లో ఆ సంఖ్య వెయ్యి దాటింది. 1998 నాటికి ఆ సంఖ్య పది వేలకు చేరుకున్నది. జపాన్‌లో ఓబెసిటీ కేసులు తక్కువ. రెడ్ మీట్ తక్కువగా తింటారు. ఎక్కువగా చేపలు, కూరగాయలు తింటారు. జపాన్ మహిళల్లో ఓబెసిటీ కేసులు మరీ మరీ తక్కువ. దాని వల్లే అక్కడ మహిళల్లో జీవిత కాలం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. మిగితా ప్రపంచ దేశాలన్నీ తమ డైయిట్‌లో షుగర్, ఉప్పుకు అధిక ప్రాధాన్యత ఇవ్వగా జపాన్ మాత్రం భిన్నంగా ముం దుకె ళ్లింది. ఉప్పును తగ్గించి తీసుకోవాలని జపాన్‌లో ప్రచారం చేశారు.

కేవలం ఆహారం మాత్రమే కాదు జీవితంలో యాక్టివ్‌గా ఉండేందుకు ఎక్కు వగా వాకింగ్ చేస్తారు. ప్రజా రవాణా వ్యవస్థ మీద ఎక్కువగా ఆధారపడుతారు. జపాన్ వృద్ధ జనాభా లెక్కల్లో కొంత అవకతవకలు ఉన్నట్లు కొందరు ఆరోపిస్తున్నారు. ఫ్యామిలీ రిజిస్ట్రీల ప్రకారం జపాన్‌లో 2010 నాటికే సుమారు రెం డున్నర లక్షల మంది శతాధిక వృద్ధులు ఉం టారని అంచనా వేస్తున్నారు. కానీ వాళ్లు పెన్షన్ కోసం తప్పుడు లెక్కలు చూపి ఉంటారని కొం దరు భావిస్తున్నారు.



## గాజాపై ఇజ్రాయెల్ ఉధృత దాడులు 65 మందికిపైగా మృతి

**గాజా సిటీ**, సెప్టెంబరు 14 : హమాస్ అంతమే లక్ష్యంగా గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులకు పాల్పడుతోంది. డ్రోన్లు, వైమానిక దాడులతో విరుచుకుపడుతోంది. తాజాగా శుక్రవారం కూడా గాజాలోని పలు ప్రాంతాలపై ఐడీఎఫ్ దళాలు విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో 60 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. గాజా నగరంలోని ఉత్తర ప్రాంతంపై ఐడీఎఫ్ కాల్పులు జరిపింది. ఈ దాడిలో 65 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఒకే కుటుంబానికి చెందిన 14 మంది ఉన్నట్లు వైద్య వర్గాలు తెలిపాయి. గాజా నగరంలో అట్ ట్వామ్ ప్రాంతంలోని ఇంటిపై జరిపిన దాడిలో వారంతా మరణించినట్లు పేర్కొన్నాయి. అయితే, ఈ దాడులను పాలస్తీనా గ్రూప్ హమాస్ ఖండించింది. పౌరులను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా ఇజ్రాయెల్ యుద్ధ నేరాలకు పాల్పడుతోందని ఆరోపించింది. ఇలాంటి చర్యలు అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొంది.



## రాయ్‌బరేలి అభివృద్ధి సమీక్షలో రాహుల్, యుపి మంత్రుల వాగ్వాదం

**లక్నో**, సెప్టెంబరు 14 : కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, యూపీ మంత్రి దినేశ్ ప్రతాప్ సింగ్ మధ్య వాగ్వాదం జరిగింది. రాయ్‌బరేలీ నియోజకవర్గం జిల్లా అభివృద్ధిపై జరిగిన దిశా మీటింగ్‌లో ఆ ఇద్దరి నేతల మధ్య మాటల యుద్ధం సాగింది. సెప్టెంబర్ 11వ తేదీన ఈ ఘటన జరిగింది. దానికి సంబంధించిన వీడియో ఒకటి ప్రస్తుతం వైరల్ అవుతోంది. నియోజకవర్గా అభివృద్ధి పనులపై చర్చ జరుగుతున్న సయమంలో ఇద్దరి మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. దీంతో ఆ ఇద్దరూ గట్టిగా అరిచారు. తమ వాదనలను వినిపించే ప్రయత్నం చేశారు.ఒకవేళ రాయ్‌బరేలీ నియోజకవర్గం ప్రజల తరపున రాహుల్ గాంధీ పోరాడితే అప్పుడు ఆయనకు మద్దతు ఇవ్వనున్నట్లు మంత్రి చెప్పారు. కానీ దిశా మీటింగ్ వేదికగా పార్టీ రాజకీయాలు ప్రచారం చేసినా, ప్రభుత్వాన్ని విమర్శించినా ఊరుకునేది లేదన్నారు.

## కేరళ వృద్ధునికి రూ.3.72కోట్ల 'సైబర్'టోపీ

**న్యూఢిల్లీ**, సెప్టెంబరు 14 : డిజిటల్ అరెస్ట్ ఈ మధ్య సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న కొత్త పంథా. తాజాగా కేరళలోని కొల్లాంలో 79 ఏళ్ల వృద్ధుడిని సైబర్ నేరగాళ్లు మోసగించారు. కొల్లం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దక్షిణ కేరళ జిల్లాలోని ఓ వృద్ధుడికి జులై 7న వాట్సప్‌లో వీడియో కాల్ వచ్చింది. కాల్ చేసిన వ్యక్తి తనను తాను బీఎస్ఎన్ఎల్ అధికారిగా పరిచయం చేసుకున్నాడు. అక్రమ కార్యకలాపాలకు మొబైల్ నంబరు వినియోగించినందుకు ముంబయి సైబర్ పోలీసులు ఈ నంబర్‌ను ట్రాక్ చేస్తున్నట్లు తెలిపారు.కొద్దిసేపటికీ దుండగులు పోలీసు దుస్తుల్లో వాట్సాప్ వీడియో కాల్ చేసి తాము ముంబయి సైబర్ పోలీసులమని పేర్కొంటూ నకిలీఅరెస్టువారెంట్ జారీ చేశారు. దీంతో ఆందోళన చెందిన వృద్ధుడు వారు చెప్పినట్లుగా వివిధఖాతాలకు జులై23 నుంచి ఆగస్టు 29మధ్య 17లావాదేవీలలో రూ. 3.72 కోట్లను బదలీ చేశాడు. వారు డబ్బు తిరిగి పంపకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు.

## లాడెన్ మీ దేశంలోనే హాతమయ్యాడని మర్చిపోయారా?

### పాకిస్థాన్‌కు ఇజ్రాయెల్ కౌంటర్

**టెల్అవీవ్**, సెప్టెంబరు 14 : ఐరాసలోని భద్రతా మండలి వేదికగా పాకిస్థాన్ ఇజ్రాయెల్ కౌంటర్ ఇచ్చింది. కరుడుగట్టిన ఉగ్రవాది బిన్‌లాడెన్‌కు పాక్ ఆశ్రయం కల్పించిందని, అక్కడే అతడు హాతమయ్యాడని వ్యాఖ్యానించింది. ద్వంద్వ ప్రమాణాలతో వాస్తవాలను మార్చలేరంటూ విమర్శలు చేసింది. గత రెండేళ్లుగా ఇజ్రాయెల్-హమాస్ మధ్య పోరు జరుగుతోంది. కాల్పుల విరమణకు సంబంధించి అమెరికా ప్రతిపాదన మేరకు దోహాలో ఖతార్ అధికారులు, హమాస్ నేతలు భేటీ అయ్యారు. వీరి మధ్య చర్చలు జరుగుతుండగానే ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడింది. దీనిని పలు దేశాలు ఖండించాయి. అయితే, ఈ దాడులను ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సమర్థించుకున్నారు. అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడులను అమెరికాలో జరిగిన 9/11 దాడులతో పోల్చారు.ఆ తర్వాత పాకిస్థాన్ గడ్డపై




ఆశ్రయం పొందిన బిన్‌లాడెన్‌ను అమెరికా మట్టుపెట్టిన విషయాన్ని ప్రస్తావించారు. ఖతార్‌పై దాడుల గురించి ఐరాస భద్రతామండలిలో చర్చ సందర్భంగా తమ దేశం పేరు ప్రస్తావించడంపై పాకిస్థాన్ అభ్యంతరం చెప్పింది. అలాగే ఇజ్రాయెల్ దాడిని ఖండించింది. ప్రాంతీయ సుస్థిరతను దెబ్బతీసే దురాక్రమణ అని వ్యాఖ్యలు చేసింది. దాంతో ఐరాసలో పాక్ రాయబారి అసీమ్ ఇఫ్తికార్ అహ్మద్‌ను ఉద్దేశించి ఇజ్రాయెల్ శాశ్వత ప్రతినిధి డానీ డానన్ గట్టి కౌంటర్ ఇచ్చారు.

'విదేశీ గడ్డపైనున్న ఉగ్రవాదిని ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారనే ప్రశ్న అడగకూడదు. అడగాల్సిన ప్రశ్న ఏంటంటే.. అసలు ఉగ్రవాదికి ఆశ్రయం ఎందుకు ఇస్తున్నారు అని. బిన్‌లాడెన్‌ను మట్టుపెట్టేందుకు చేసిన ఆపరేషన్ సరైందే అయినప్పుడు హమాస్ విషయంలో మేం చేసింది కూడా సరైందే' అని సమర్థించుకున్నారు. 9/11 తర్వాత భద్రతామండలి ఒక తీర్మానాన్ని ఆమోదించిందని ఏ దేశమూ ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడం, నిధులు సమకూర్చడం వంటివి చేయకూడదని పేర్కొందన్నారు. అలా కాదని ఆశ్రయం కల్పిస్తే, మండలి నియమావళిని ఉల్లంఘించినట్లే అవుతుందన్నారు. కాగా అమెరికాలో 2001, సెప్టెంబరు 11న వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై ఉగ్రదాడి జరిగిన 24 యేళ్లు అయిన నేపథ్యంలో భద్రతా మండలి సమావేశమైంది. ఆ చర్చలో భాగంగానే పాకిస్థాన్ ఉగ్రవాదులకు స్వర్గధామమని మరోసారి తేటతెల్లమైంది.

## ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాక్‌తో మ్యాచ్‌లేంటి?

### శివసేన చీఫ్ ఉద్ధవ్ థాకరే ఆగ్రహం

**ముంబయి**, సెప్టెంబరు 14 : ఆసియా కప్‌లో భాగంగా ఆదివారం భారత్‌పాకిస్థాన్ మధ్య జరగనున్న క్రికెట్ మ్యాచ్‌పై శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే మండిపడ్డారు. ఉగ్రవాదాన్ని ఎగదోసే పాకిస్థాన్‌తో క్రికెట్ ఆడడం అంటే, అది భారతీయుల భావోద్వేగాలను అవమానించడమే అని వ్యాఖ్యానించారు. సరిహద్దుల్లో మన సైనికులు ప్రాణాలు త్యాగం చేస్తుంటే, పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడడం ఏంటని ప్రశ్నించారు. ఈ మ్యాచ్‌కు వ్యతిరేకంగా మహారాష్ట్ర అంతటా సిందూర్ నిరసనలు చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. ముంబయిలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఉద్ధవ్ ఠాక్రే, ఆదివారం జరగనున్న భారత్‌పాక్ మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేయాలని, ఉగ్రవాదంపై భారత్ వైఖరిని ప్రపం



చానికి తెలియజేయడానికి ఇది ఒక మంచి అవకాశమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా బీజేపీపై ఉద్ధవ్ ఠాక్రే తీవ్ర విమర్శలు చేశారు. భారత్‌పాక్ క్రికెట్ మ్యాచ్‌ను అనుమతించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేసినట్లు ప్రకటించబోతోందా అని ఆయన ప్రశ్నించారు. మన సైనికులు సరిహద్దుల్లో ప్రాణాలు త్యాగం చేస్తుంటే, మనం పాకిస్థాన్‌తో క్రికెట్ ఆడాల్సిన అవసరం ఉందా అని ప్రశ్నించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర సర్కార్‌పై మండిపడిన ఉద్ధవ్ ఠాక్రే, దాయాదుల మధ్య జరగనున్న క్రికెట్ మ్యాచ్ దేశభక్తిపై వేసిన ఒక పెద్ద జోక్ అని అభివర్ణించారు. దీనిని బాయ్‌కాట్ చేస్తే, ఉగ్రవాదంపై భారత వైఖరి ఏమిటో ప్రపంచానికి బలమైన సంకేతాన్ని పంపినట్లు అవుతుంది అని ఆయన అన్నారు. బీజేపీ దేశభక్తి పేరుతో వ్యాపారం చేస్తోందని ఆయన విమర్శించారు.

ఒకానొక సమయంలో బాల్ ఠాక్రే దగ్గరకు పాకిస్థాన్ క్రికెటర్ జావేద్ మియాందాద్ వచ్చారు. అప్పుడు కూడా క్రికెట్ మ్యాచ్ గురించే చర్చ జరిగింది. ఆ సందర్భంలో బాల్ ఠాక్రే, పాకిస్థాన్ నేల మీద నుంచి భారత్‌పై ఉగ్రవాద చర్యలు కొనసాగినంత కాలం క్రికెట్ ఆడడం జరగదు అని మియాందాద్ మొహం మీదే చెప్పారని ఈ సందర్భంగా ఉద్ధవ్ తెలిపారు. ప్రస్తుతం భారత విదేశాంగ విధానం చాలా బలహీనంగా ఉందని ఈ క్రికెట్ మ్యాచ్ ద్వారా నిరూపితం అయ్యిందని వ్యాఖ్యానిం చారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను కేంద్రం తిరిగి తీసుకోలేకపోయిందని అన్నారు.

## 3 నిమిషాల్లో విరిగిన ఎముకలు అతికేందుకు 'బోన్‌గ్లూ'!

### చైనా శాస్త్రవేత్తల అద్భుత పరిశోధనలు

**బీజింగ్**, సెప్టెంబరు 14 : వైద్య రంగంలో మరో అద్భుతం వెలుగులోకి వచ్చింది. విరిగిన ఎముకలను అతికించాలంటే గంటల తరబడి సాగే శస్త్రచికిత్సలు, స్టీల్ ప్లేట్లు, స్క్రూలు అవసరం లేకుండా కేవలం మూడు నిమిషాల్లోనే సరిచేసే ఒక ప్రత్యేకమైన 'బోన్ గ్లూ' ను చైనా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఆర్థోపెడిక్స్ విభాగంలో ఇదొక విప్లవాత్మక మార్పుగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. తూర్పు చైనాలోని షెజాంగ్ ప్రావిన్స్‌కు చెందిన పరిశోధకులు 'బోన్ 02' పేరుతో ఈ సరికొత్త జిగురును తయారు చేశారు. సముద్రంలోని ఆల్చిప్పలు నీటి అడుగున దేనికైనా బలంగా అతుక్కుపోయే గుణం నుంచి ప్రేరణ పొంది దీన్ని రూపొందించడం విశేషం. ఈ పరిశోధన బృందానికి నాయకత్వం



వహించిన సర్ రన్ రన్ షా ఆసుపత్రి అసోసియేట్ చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్ లిన్ షాన్‌ఫింగ్ ఈ ఆవిష్కరణ వివరాలను పంచుకున్నారు. మేము కొత్తగా అభివృద్ధి చేసిన ఈ గ్లూ, కేవలం రెండు లేదా మూడు నిమిషాల్లోనే విరిగిన ఎముకలను అతికిస్తుంది. తీవ్రమైన రక్తస్రావం జరుగుతున్న ప్రదేశంలో కూడా ఇది ఎంతో సమర్థవంతంగా పనిచేస్తుందని ఆయన వివరించారు. సాంప్రదాయ పద్ధతుల్లో ఎముకల ఆపరేషన్ చేయాలంటే రోగి శరీరానికి పెద్ద కోత పెట్టి, లోపల స్టీల్ ప్లేట్లు లేదా రాడ్లు అమర్చాల్సి ఉంటుంది. ఇది రోగికి తీవ్ర నొప్పితో పాటు, కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుంది. కానీ, ఈ కొత్త బోన్ గ్లూను ఒక సూది ద్వారా సులభంగా విరిగిన ప్రదేశంలోకి ఇంజెక్ట్ చేయవచ్చు. దీనివల్ల పెద్ద కోతల అవసరం ఉండదు, ఆపరేషన్ సమయం గణనీయంగా తగ్గుతుంది. నీరు, రక్తం ఉన్న చోట కూడా ఇది తన పటుత్వాన్ని కోల్పోకుండా ఎముకల మధ్య బలమైన బంధాన్ని ఏర్పరుస్తుంది. ఈ ఆవిష్కరణ భవిష్యత్తులో ఆర్థోపెడిక్ చికిత్సల స్వరూపాన్నే మార్చేస్తుందని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రోగులకు నొప్పిలేని, సులభమైన చికిత్స అందించి, వారు త్వరగా కోలుకునేందుకు ఇది దోహదపడుతుంది. ప్రస్తుతం మరిన్ని క్లినికల్ ట్రయల్స్ నిర్వహించి, దీని భద్రతను, ప్రభావాన్ని పూర్తిగా నిర్ధారించే పనిలో శాస్త్రవేత్తలు నిమగ్నమై ఉన్నారు.

## మధ్యప్రదేశ్ సిఎంకు తృటిలో తప్పిన ప్రమాదం

**భోపాల్**, సెప్టెంబరు 14 : మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్‌కు శనివారం నాడు తృటిలో ప్రమాదం తప్పింది. ఆయన ఎక్కేందుకు సిద్ధమవుతున్న హాట్ ఎయిర్ బెలూన్ కు మంటలు అంటుకున్నాయి. దీంతో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది మంటలను అదుపు చేయడంతో సీఎంకు ప్రమాదం తప్పింది. మంద్‌సార్‌లోని గాంధీ నగర్ ఫారెస్ట్ రిట్రీట్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి ఎయిర్ బెలూన్ ఎక్కడానికి సిద్ధమవుతుండగా బెలూన్ దిగువ భాగంలో మంటలు అంటుకున్నట్టు వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. భద్రతా సిబ్బంది మంటలను అదుపు చేసి, ముఖ్యమంత్రి ట్రాలీని పట్టుకో వడంతో ఆయన ప్రమాదం నుంచి బయటపడ్డారు. దీంతో వెంటనే ఆయణ్ని అక్కడి నుంచి భద్రతా సిబ్బంది తరలించారు. ప్రమాదం కాదన్న అధికారులు కాగా, ఈ ఘటనపై మంద్‌సౌర్ జిల్లా కలెక్టర్ అదితి గార్గ్ వివరణ ఇచ్చారు. మంటలు వచ్చినట్టు వచ్చిన కథనాలు పూర్తిగా తప్పని అన్నారు. బెలూన్‌ను పరిశీలించేందుకే సీఎం వచ్చారని, సీఎం బెలూన్ ఎక్కలేదని చెప్పారు. మంటలు రావడంపై మాట్లాడుతూ, బెలూన్‌ను లిఫ్ట్ చేసేందుకు అందులోని గాలిని హీట్ చేయడం అనేది స్టాండర్డ్ ప్రాసెస్ అని చెప్పారు. ఏడేళ్ల అనుభవం ఉన్న బెలూన్ పైలెట్ మహమ్మద్ ఇర్ఫాన్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బెలూన్ కోసం ఎల్పీజీ, ఫైర్‌ప్రూఫ్ కెవ్లార్ మెటీరియల్ వాడతామని, పూర్తి భద్రతా ప్రమాణాలకు లోబడి ఈ ప్రక్రియ ఉంటుందని చెప్పారు.

## రష్యాలో తీవ్రస్థాయి భూకంపం రిక్టర్‌స్కేలుపై 7.7గా నమోదు

**మాస్కో**, సెప్టెంబరు 14 : రష్యాలోని కామ్‌చట్కా ద్వీపకల్పంలో ఇవాళ శక్తివంతమైన భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై ఆ భూకం త్రీవత 7.7గా నమోదు అయ్యింది. దీంతో అధికారులు సునామీ వార్నింగ్ జారీ చేశారు. అన్ని ఎమర్జెన్సీ సర్వీసులను హై అలర్ట్‌లో ఉంచారు. కామ్‌చట్కా ప్రాంతీయ రాజధాని పెట్రోపవలోస్కీలో భూకంప తీవ్రత 6.3గా ఉన్నట్లు గవర్నర్ వ్లాదిమిర్ సోలోడోవ్ తెలిపారు. బలమైన భూకంపం రావడంతో స్థానిక అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నారు. కీలక ప్రదేశాలను, రెసిడెన్షియల్ బిల్డింగ్‌లను తనిఖీ చేస్తున్నారు. ఇప్పటి వరకు ఎటువంటి డ్యామేజ్ అయినట్లు రిపోర్టు కాలేదు. నివాసితులు జాగ్రత్తగా ఉండాలని ఆదేశాలు ఇచ్చారు.

## బ్రిటన్‌లో సిక్కు మహిళపై లైంగిక దాడి

**లండన్**, సెప్టెంబరు 14 : బ్రిటన్‌లో దారుణం చోటు చేసుకుంది. ఓల్డ్‌బరీ పట్టణంలో సిక్కు మహిళపై ఇద్దరు వ్యక్తులు లైంగిక దాడికి పాల్పడ్డారు. అనంతరం మీ దేశానికి వెళ్లిపో అంటూ బాధితురాలిని బెదిరించారు. ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. దీంతో బాధితురాలి కుటుంబం పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా ఈ ఘటన జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరా ఫుటేజ్‌లను పోలీసులు జల్లెడ పట్టారు. ఆక్రమంలో నిందితులను పోలీసులు గుర్తించారు. వారు శ్వేత జాతీయులని స్పష్టం చేశారు. వారి కోసంగాలింపు చర్యలను ముమ్మరం చేసినట్లు వివరించారు. గతవారంలో చోటు చేసుకున్న ఈఘటనపై బ్రిటన్‌లోని ప్రవాస భారతీయులంతా మండిపడుతున్నారు.

## సంక్షిప్తంగా..

### కాంగోలో రెండు పడవ ప్రమాదాలు: 193 మంది జలసమాధి



**కిన్షాస**, సెప్టెంబరు 14 : డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో జరిగిన రెండు వేర్వేరు పడవ ప్రమాదాలు 193 మందిని బలి తీసుకున్నాయి. మరికొం దరు గల్లంతయ్యారని ఆ దేశ మీడియాసహా అధికారులు పేర్కొన్నారు. ఈక్వెటార్ ప్రావిన్స్‌కు 150 కిమీ దూరంలో బుధ, గురువారాల్లో ఈ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం సాయంత్రం లుకోలెలా భూభాగం నుంచి దాదాపు 500 మందితో ఓ పడవ బయలుదేరింది. ఈ దుర్ఘటనలో 107 మంది చనిపోయినట్లు కాంగో ప్రభుత్వం ప్రకటించింది. 209 మందిని రక్షించినట్లు అధికారులు తెలిపారు. మలాంగే గ్రామానికి చెందిన పడవ సాయంతో ప్రయాణికులను ఒడ్డుకు చేర్చినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ నివేదిక ప్రకారం 146 మంది గల్లంతయ్యారని ఓ అంతర్జాతీయ మీడియా సంస్థ పేర్కొంది. అంతకు ముందు రోజు బసాన్‌కుసు ప్రాంతంలో ఓ పడవ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 86 మంది మృతి చెందారు. అందులో ఎక్కువ మంది విద్యార్థులేనని తెలిసింది.

## కెనడా కార్మిక విధానంలో మార్పులు

**ఒట్టావా**, సెప్టెంబరు 14 : తాత్కాలిక విదేశీ కార్మికుల విధానంలో మార్పులపై కెనడా సంకేతాలిచ్చింది. నిర్దిష్ట రంగాలు, ప్రాంతాల్లో ఎవరు పని చేయాలనే నిబంధనల్లో సంస్కరణలు తీసుకురానుంది. ప్రధాని మార్క్ కార్నీ ప్రకటనతో సాఫ్ట్‌వేర్, వైద్యరంగానికి చెందిన విదేశీ నిపుణులు ఆందోళన చెందుతున్నారు. శ్రమతో కూడిన పనులు చేసే వారికి మాత్రమే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తే తమ భవితవ్యం ప్రమాదంలో పడుతుందని భయపడుతున్నారు. తాత్కాలిక విదేశీ వర్కర్ల కార్యక్రమం ఒక 'కేంద్రీకృత విధానం'గా ఉండాలని పార్టీ కాకస్‌లో కార్నీ వ్యాఖ్యానించారు. అది కార్మిక అవసరాలను లక్ష్యంగా చేసుకొనేలా ఉండాలన్నారు. గృహనిర్మాణం, మౌలిక సదుపాయాలు, సామా



జిక సేవారంగాలపై ఒత్తిడిని తగ్గించేలా మార్పులు అవసరమని పేర్కొన్నారు. శాశ్వత నివాసులు కాని వారి వాటాను తగ్గించాలని కార్నీ భావిస్తున్నారు. 2027 చివరికి జనాభాలో వారి వాటాను 7 నుంచి 5 శాతానికి తీసుకురావాలని ప్రణాళిక రచిస్తున్నారు. ఇది కార్యరూపం దాలిస్తే తాత్కాలిక కార్మికుల సంఖ్య భారీగా తగ్గనుంది.

## 13వ అంతస్తుపైనుంచి పడి తల్లీకొడుకు మృతి



**లక్నో** సెప్టెంబరు 14 : తల్లీకొడుకు ఇద్దరూ ప్రమాదవశాత్తు భవనం 13వ అంతస్తు నుంచి కిందపడి దుర్మరణం పాలయ్యారు. ఉత్తరప్రదేశ్‌లోని గౌతమ్‌బుద్ధ నగర్ లో శనివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే గౌతమ్‌బుద్ధనగర్‌లోని బిసక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోగల ఓ బహుళ అంతస్తుల భవనం 13వ అంతస్తులో దర్పన్ చావ్లా అనే వ్యక్తి తన భార్య, కుమారుడితో కలిసి నివాసం ఉంటున్నాడు. దర్పన్ చావ్లా కుమారుడైన 12 ఏళ్ల దక్ష్‌కు మతిస్థిమితం లేదు. దాంతో తల్లి అతడిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తోంది. ఈ క్రమంలో శనివారం ఉదయం దక్ష్ బిల్డింగ్ పైనుంచి దూకేస్తానని తల్లికి చెప్పి వేగంగా పరుగుతీశాడు. ఆ హాతాత్పరిణామాన్ని ఊహించని తల్లి కొడుకును కాపాడుకునేందుకు అంతే వేగంగా వెంటపడింది. దక్ష్‌ను అందుకునే ప్రయత్నంలో అతడితోపాటు కిందపడింది. ఈ ఘటనలో తల్లీకొడుకు ఇద్దరూ దుర్మరణం పాలయ్యారు.

## ఇది ప్రధానుల సంప్రదాయం కానేకాదు: ప్రియాంకగాంధీ

**న్యూఢిల్లీ**, సెప్టెంబరు 14 : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. 2023లో ఈశాన్య రాష్ట్రంలో హింసాత్మక ఘర్షణల తర్వాత మోదీ ఇక్కడ పర్యటించడం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో మోదీ పర్యటనపై విప క్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మణిపూర్ పర్యటనపై కాంగ్రెస్ అగ్రనాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా



తీవ్ర విమర్శలు చేశారు. ఘర్షణలు చోటు చేసు కున్న రెండేండ్ల తర్వాత రాష్ట్రంలో మోదీ పర్యటించడం దురదృష్టకరమన్నారు. వయనాడ్ పర్యటనలో ఉన్న ప్రియాంక గాంధీ అక్కడ విలేకరులతో మాట్లాడారు. ఆయన ఇప్పటికే అక్కడ పర్యటించి ఉండాల్సింది. భారత్ లోని ప్రధానమంత్రుల సంప్రదాయం ఇది కాదు.

## కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక భరోసా.. ప్రమాదభీమా : మంత్రి మనోహర్



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** జనసేన పార్టీ క్రియాశీలక సభ్యులకు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రమాద బీమా సౌలభ్యాన్ని కల్పించడం ద్వారా,అనుకోని ప్రమాదాలు చోటు చేసుకుంటే ఆ కుటుంబాలకు ఆర్థిక భరోసాగా ప్రమాద బీమా తోడ్పాటు నిస్తుందని జనసేన పి ఎ సి చైర్మన్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

జనసేన పార్టీ క్రియాశీలక సభ్యురాలు కన్నెగంటి ఝాన్సీ రాణి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నేపథ్యంలో, ఆ కుటుంబానికి వర్తించే ప్రమాద బీమా, ఐదు లక్షల రూపాయల చెక్కును మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం ఝాన్సీ రాణి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా తొలుత ఝాన్సీ రాణి చిత్రపటం చెంత పువ్వులనుంచి ఘనంగా నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పిస్తూ, ప్రమాద బీమా చెక్కును అందజేశారు.

అదేవిధంగా మండలంలోని ఖాజీపేట గ్రామంలోని జనసేన క్రియాశీలక కార్యకర్త పోతాబత్తుని పవన్ నాగ్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి మనోహర్, పవన్ నాగ్ చిత్ర పటం చెంత పువ్వులుంచి నివాళి అర్పించారు. అనంతరం ఆకుటుంబానికి, 5లక్షల ప్రమాదభీమ చెక్కును అందజేసి, ఆకుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని బరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అద్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, అడపాల నాగేశ్వరరావు, కౌన్సిలర్ మానస రెడ్డి, మైనార్టీ నాయకులు జాకీర్ హుస్సేన్, సాయి,తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా వెలినేని విలువైన సేవలు అందించాలి




**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** న్యాయవాద వృత్తిలో నిబద్ధతతొ న్యాయ సేవలు అందిస్తున్న వెలినేని రాఘవయ్య పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమితులైన సందర్భంగా,ఏర్పాటుచేసినఅభినందన సభలొ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కాకతీయ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ దావులూరి చక్రధర్ పేర్కొన్నారు. స్థానిక కొత్తపేటలోని కాకతీయ కో–ఆపరేటివ్ బ్యాంక్ ప్రాంగణంలో ఆదివారం, పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నియమితులైన, వెలినేని రాఘవయ్య అభినందన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కాకతీయబ్యాంక్ చైర్మన్ దావూలూరి చక్రధర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ సమావేశానికి, బ్యాంకు డైరెక్టర్ పిఎస్ఆర్ బ్రహ్మాచార్యులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వక్తలు తమ ప్రసంగాల్లో వెలి నేని రాఘవయ్య న్యాయవాద వృత్తిలో నైపుణ్యాన్ని పెంచుకొని, విలువైన న్యాయవాద సేవలను అందిస్తున్నారని, వారు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం రాఘవయ్య దంపతులను కాకతీయ కోపరేటివ్ బ్యాంకు కార్యవర్గం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో కాకతీయ కో–ఆపరేటివ్ బ్యాంకు గౌరవ అధ్యక్షులు దావులూరి లక్ష్మీ కాంతారావు, మారోజు సీతారామయ్య, షేక్ ఖలీల్, కటారి వాసుదేవ నాయుడు, సుబ్రహ్మణ్య శాస్త్రి, కడియాల నంద కిషోర్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

## 'థాంక్యూ లోకేష్ సార్' పోస్టర్ ఆవిష్కరణ



**పెదకూరపాడు(జర్నలిస్ట్ ఫైల్)** :తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో "థాంక్యూ లోకేష్ సార్" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చేతుల మీదుగా జరిగింది. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం మెగా డీఎస్సీ ద్వారా 19వ తేదీన నియామక పత్రాలు అందజేయనున్న సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు.

ఈ కార్యక్రమంలో టీఎన్యూఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎన్వీ జగదీష్ కుమార్, జిల్లా అధ్యక్షులు పసల బాలస్వామి, ప్రధాన కార్యదర్శి పాలేటి జగదీష్ బాబు, ఖజాంచి శ్రీనివాసరెడ్డి, సహాధ్యక్షులు జివి శ్రీధర్, గౌరవ సలహాదారులు ఫణిదత్తు, డీఈఓ పూల్ లాంగ్వేజ్ పండిట్స్ జిఎన్ జయలక్ష్మి, ఆర్.శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ షాపుల వ్యాపారులు టెక్నీషియన్స్ ఐఖ్యతారాగం




**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** అరచేతిలొ అద్భుత ప్రపంచ మైన మొబైల్ ఫోన్, విక్రయదారులు,సెల్ ఫోన్ మొరాయిస్తే సరిచేసే, టెక్నీషిన్స్ ఏర్పాటు చేసుకున్న అసోసియేషన్ బలోపేతం దిశగా సమిష్టిగా పనిచేయాలని అసోసియేషన్ అద్యక్షులు షేక్ హిదయతుల్లా పేర్కొన్నారు.

స్థానిక నూకల రామకోటేశ్వరావు కళ్యాణమండపంలో శనివారం తెనాలి మొబైల్ సెల్లర్స్, టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు షేక్ హిదయతుల్లా సభ్యులకు నూతన ఐడి కార్డులు పంపిణీ చేశారు. సంస్థ బలోపేతానికి అనుసరించాల్సిన విధానాలను సభ్యులకు వివరించారు. స్థానిక వ్యాపారులకు సహకారంగా, మన ఊరు మన దుకాణం అనే నినాదాన్ని, విధానంగా చేసుకుని అసోసియేషన్ అభివృద్ధికి ప్రతి సభ్యుడు తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు చెర్రీ, కార్యదర్శి డి సంపత్ కుమార్, జాయింట్ సెక్రెటరీ కిషోర్, కోశాధికారి రాజు, కమిటీ సభ్యులు ఓం సాయి మణి , మణిద్వీప్, ఆలీ, కోటేశ్వరరావు, కిషోర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పీ4 అంటే సామాజిక బాధ్యత

- పీ-4పై అవగాహన సదస్సులో హాజరైన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలు నసీర్,రామాంజనేయులు స్వర్ణాంధ్ర సాధన కమిటీ చైర్మన్ కుటుంబరావు



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్)** : సీఎం చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమం కేవలం డబ్బులు ఇవ్వడం కాదని, అదొక సామాజిక బాధ్యత అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. పీ-4 అమలులో సవాళ్లు-పరిష్కారాలు అనే అంశంపై స్థానిక గుంటూరు క్లబ్ లో ఆదివారం చేపట్టిన అవగాహన సదస్సుకు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే డా.బూర్ల రామాంజనేయులు, స్వర్ణాంధ్ర సాధన కమిటీ చైర్మన్ కుటుంబరావుతో కలిసి ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ పీ-4 కార్యక్రమం ఒక దార్శనికుని ఆలోచనలకు ప్రతిరూపమని తెలిపారు. సమాజంలోని ఆర్థిక అంతరాలను దూరం చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారని వివరించారు. పీ-4పై కొంత అపోహలు ఉన్నాయని, ఇది పూర్తిగా తొలగిపోయేలా అవగాహన కల్పించాలని చెప్పారు. అన్ని రంగాల్లోని ప్రజలకు తమకు చేతనైనంతలో ఏదొక రూపంలో సాయమందించాలని పిలుపునిచ్చారు. న్యాయవాదులు న్యాయపరంగా, వైద్యులు వైద్యపరంగా, టీచర్లు విద్యాపరంగా పేదలకు తోడుగా నిలవడమే పీ-4 ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. పీ-4 కుటుంబాల్లో ఎవరికి ఎలాంటి అవసరమొచ్చినా మార్గదర్శకులు తామున్నామనే భరోసా కల్పిస్తే సమాజంలో ఆర్థిక, సామాజిక అంతరాలు తొలగిపోతాయని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు విజనరీతో చేపట్టిన కార్యక్రమాలు భావితరాలకు అద్భుతమైన అవకాశాలను అందించాయని చెప్పారు. 1995లోనే 2020 విజన్‌కు శ్రీకారం చుట్టారని, హైటెక్ సిటీ ఏర్పాటుకు ముందుకొచ్చారని, దీంతో యువతకు లక్షల్లో ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. ఇప్పుడు స్వర్ణాంధ్రప్రదేశ్-2047కు నాంది పలికారని, ఇది దేశంలోనే రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలిపేందుకు దోహదం చేస్తుందని అన్నారు. ఈ మహత్తర కార్యక్రమంలో అందరూ భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు.

# శాంతి భద్రతల పరిరక్షణే ప్రథమ కర్తవ్యం : జిల్లా ఎస్పీ



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్)** : జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం నూతన జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించిన వకుల్ జిందాల్ పలు సూచనలు చేశారు.

ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో అప్రమత్తతతో ఉండి ఎటువంటి సంఘటన జరిగినా వెంటనే స్పందించి చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సంఘటన చోటుచేసుకున్న సమయం, పోలీస్ అధికారులు ఘటన ప్రదేశానికి చేరిన సమయం, సమస్య పరిష్కారానికి అనుసరించిన విధానం అన్నీ అత్యంత కీలకమని స్పష్టం చేశారు. అప్రమత్తంగా, చురుకుగా వ్యవహరిస్తే పెద్ద సమస్యలను సైతం సమర్థంగా ఎదుర్కోవచ్చని అభిప్రాయపడ్డారు.

శాంతి భద్రతల పరిరక్షణలో సున్నిత ప్రాంతాలపై నిఘా పెట్టి అసాంఘిక కార్యకలాపాలపై జీరో టాలరెన్స్ విధానాన్ని పాటించాలని ఆయన ఆదేశించారు. రౌడీ షీటర్లు, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై తరచూ ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. పేకాట, కోడిపందాలు, మట్కా వంటి కార్యకలాపాలను అరికట్టాలని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ఫిర్యాదు దారుల పట్ల మర్యాదపూర్వకంగా, మానవతా దృక్పథంతో వ్యవహరించాలని ఎస్పీ ఆదేశించారు. ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించి ప్రజలకు భరోసా కల్పించాలని, డయల్ 112, శక్తి కాల్ సెంటర్ ద్వారా వచ్చే ఫోన్ కాల్స్ పట్ల తక్షణమే స్పందించాలని సూచించారు.

పోలీస్ స్టేషన్ల పరిశుభ్రత, రికార్డుల సక్రమ నిర్వహణ, కేసుల ఆధారాల భద్రతపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్, హెల్మెట్ డ్రైవ్, కార్డన్ అండ్ సెర్చ్ వంటి కార్యక్రమాల ద్వారా సిబ్బందిలో బాధ్యత పెంపొందించాలన్నారు. రాత్రి గస్తీ సమయంలో సిబ్బంది తప్పనిసరిగా లాఠీ, విజిల్, సైరన్ వాహనాలను ఉపయోగించాలని సూచించారు.

దీపావళి సందర్భంలో అనుమతి లేకుండా ఉన్న బాణాసంచా దుకాణాలపై చర్యలు తీసుకోవాలని, సీసీటీవీ కెమెరాల పనితీరును పర్యవేక్షించాలని ఆయన సూచించారు. విధి నిర్వహణలో ఇబ్బందులు తలెత్తిన వెంటనే తెలియజేయాలని తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు బివి రమణమూర్తి, ఎటివి రవికుమార్, ఏ.హనుమంతు, ఎస్బి సీఐ అలహరి శ్రీనివాస్, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి




**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)** : విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంటూ లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకై నిరంతరం కృషి చేయాలని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి హితవు పలికారు.

ఈనెల 14వ తేదీ ఆదివారం గుంటూరులోని ఏసీ కళాశాల అసెంబ్లీ హాలులో జరిగిన ఎన్ఎమ్ఎమ్ ఎస్ శిక్షణా తరగతులకు 30 కు పైగా ప్రభుత్వ పాఠశాలల నుండి 600 మంది విద్యార్థులు హాజరైనారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ చిన్న వయసులో మద్యానికి అలవాటు పడితే భవిష్యత్తులో వ్యసన పరులుగా మారి అనారోగ్య పాలవుతారని తెలిపారు. మత్తు పానీయాలతో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని, కుటుంబాలు విచ్ఛిన్నమౌతున్నాయని, శరీర అవయవాలు దెబ్బతింటు పోతూ రోగనిరోధక శక్తి తగ్గుతుందని వివరించారు. ఆంధ్రప్రదేశ్ లో 15 సంవత్సరాలు దాటిన వారిలో 15 శాతం మంది మత్తు పానీయాలకు అలవాటు పడినారని పేర్కొన్నారు. పొగ త్రాగడంతో క్యాన్సర్, ఊపిరితిత్తుల సమస్యలు ఉత్పన్నమౌతున్నాయని వివరించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ఎం రమణ యశస్వి ప్రసంగిస్తూ విద్యార్థులు ఇష్టపడి చదవాలని, లక్ష్య సాధనకు కృషి చేయాలని, చిన్న వయసు నుండే ఆరోగ్య నియమాలను పాటిస్తూ జీవన ప్రమాణాలను పెంపొందించుకోవాలని కోరారు. ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. మోజెస్ ప్రసంగిస్తూ గుంటూరు నగరంలో ఎంపిక చేసిన 600 మంది విద్యార్థులకు ఏసీ కళాశాల ప్రాంగణం వేదికగా మారడం ఆనందంగా ఉందన్నారు. 1842 లో స్కూల్ గా ప్రారంభమై, 1885 లో ఏసీ కళాశాలగా రూపొంది, లక్షలాది మంది విద్యార్థులలో జ్ఞాన జ్యోతిని వెలిగించడం నేడు అదే బాటలో పయనిస్తూ ఎన్ ఎమ్ ఎమ్ ఎస్ పోటీ పరీక్షలకు శిక్షణ కార్యక్రమాన్ని రాబోవు 15 ఆదివారాలు నిర్వహించే అవకాశం కల్పించిన మానవత సంస్థకు అభినందనలు తెలిపారు. మానవత కార్యదర్శి కె. సతీష్ ప్రసంగిస్తూ తాము నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో 30 మంది శిక్షకులు సేవలందిస్తున్నారని, ప్రతి ఆదివారం ప్రారంభంలో నిష్ణాతులతో సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాల పట్ల ఉత్తేజ భరితమైన ప్రసంగాలు ఇప్పిస్తామని పేర్కొన్నారు. గత సంవత్సరం నిర్వహించిన ఎన్ ఎమ్ ఎమ్ ఎస్ శిక్షణలో 300 మంది పాల్గొనగా, అందులో 80 మంది ఎంపికైనరని కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి 12 వేలు చొప్పున నాలుగేళ్ల పాటు అందించే ఉపకార వేతనా న్నీ పొందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శిక్షకులు ప్రకాష్, మానవత స్వచ్ఛంద సేవ సంస్థ నేతలు టి. ధనుంజయ రెడ్డి, ఉప్పల సాంబశివరావు, చావ లక్ష్మి సామ్రాజ్యం, ఉమామహేశ్వరరావు, చంద్ర మౌళి రెడ్డి ప్రసంగించారు.

# వృద్ధులకు దుప్పట్లు పంపిణి



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్)**: మంగళగిరి మున్సిపల్ వాటర్ ఫిల్టర్ బెడ్ వెనక ఉన్న ముక్తినాథ్ వృద్ధుల ఆశ్రమంలో టీడీపీ నాయకులు స్వర్గీయ ఆరుద్ర బోయరాజు వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక తులసీ వనం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మున్నంగి శివ శేషగిరిరావు, శివాలయం ట్రస్ట్ బోర్డు సభ్యులు సుఖమంచి గిరిబాబు, చీకుల వెంకటేశ్వరరావు, పిల్లెళ్ళ నాగరాజు, తాడిబోయిన శ్రీకాంత్, గోపాల్, అందే శ్రీకాంత్, కురాకుల గోపి, పీడీ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఔట్సోర్సింగ్ ఉద్యోగుల న్యాయ హక్కుల కోసం ఏకమవుదాం

- కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)** : ప్రభుత్వ శాఖల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్నా ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఇంకా భద్రత లేకుండా, కనీస సౌకర్యాలు లేకుండా జీవిస్తున్నారని కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరులో జరిగిన జిల్లా సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కె. సుమన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదులమూడి మధుబాబు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం ఇకపై నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు. ఆప్కాస్ ఏర్పాటుతో కొంతవరకు ఈఎస్ఐ, ఈపీఎఫ్ లాంటి ప్రయోజనాలు కలిగినా, సిఎఫ్ఎంఎస్ విధానం కారణంగా కుటుంబాలకు అందాల్సిన సంక్షేమ పథకాలన్నీ రద్దయి ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. 11వ పిఆర్సీ, సిఎస్ కమిటీలు సిఫారసు చేసినట్లుగా 30 శాతం వేతనాలు పెంచాల్సింది పోయి, గత ప్రభుత్వం 23 శాతం మాత్రమే పెంచి అన్యాయం చేసిందని విమర్శించారు. ఉద్యోగ భద్రత కోసం హెచ్ఆర్ పాలసీని అన్ని శాఖల్లో తప్పనిసరిగా అమలు చేయాలని, పూర్తి కాలం పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సర్వీస్ రూల్స్ రూపొందించాలని అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. "20 ఏళ్లుగా సేవలందిస్తున్నా సీనియారిటీకి తగిన ప్రాధాన్యం లేకుండా అందరికీ ఒకే జీతం ఇస్తున్నారు. కనీసం సంవత్సరానికి ఒకసారి ఇంక్రిమెంట్ ఇవ్వాలి" అని వారు పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో వాగ్దానం చేసినట్లుగా ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, లేకుంటే జేఏసీ అమరావతి ఇచ్చిన అల్టిమేటం ప్రకారం ప్రభుత్వ ఉద్యోగ సంఘాలతో పాటు పెద్ద ఎత్తున ఉద్యమంలో పాల్గొనేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ సంగీతరావు ఉద్యోగులకు అండగా ఉంటామని హామీ ఇస్తూ, "ఐక్యతే మన బలం%ూ% అందరూ ఒక్కటిగా నిలబడితే సమస్యల పరిష్కారం తప్పదు" అని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ కూడా ఉద్యోగులు ఐక్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ పి. శివ సైదా రావు, వైస్ ప్రెసిడెంట్ గంట సంపత్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాంభద్ర, జిల్లా నాయకులు నీరజ, చారి, కోటేశ్వరరావు, నాగరాజు, అమిదాబి, సంధ్య, సరస్వతి, సోమన్న, సరోజ, సావిత్రి, యశోద, దమ్ము అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## తొలి జాతీయ మహిళా సాధికారత సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి



- ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న ఏకైక మహిళా ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్)** : తిరుపతిలో రెండు రోజులపాటు జరగనున్న తొలి జాతీయ మహిళా సాధికారత సదస్సులో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పాల్గొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న ఏకైక మహిళా ఎమ్మెల్యే గళ్ళా మాధవి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ఈ సదస్సుకి దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి మహిళా ప్రజాప్రతినిధులు, పార్లమెంటరీ కమిటీ సభ్యులు పాల్గొన్నారని, మహిళా హక్కులు, చట్టసభలలో వారి ప్రాతినిధ్యం, గ్రామీణ స్థాయిలో మహిళా సాధికారతను ప్రోత్సహించడం వంటి అనేక అంశాల పై చర్చలు జరిగాయి. ఈ సమావేశం ద్వారా మహిళా ప్రజాప్రతినిధులు తమ అనుభవాలను, ఆలోచనలను పంచుకోవడానికి ఒక వేదిక లభించిందని, ఇది భవిష్యత్తులో మహిళా సాధికారతకు బలమైన పునాది వేస్తుందని గళ్ళా మాధవి అభిప్రాయపడ్డారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న ఏకైక మహిళా ఎమ్మెల్యే గా ఈ సదస్సులో పాల్గొనటం గర్వంగా ఉందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మహిళా సాధికారత, శాసన వ్యవస్థలో మహిళల పాత్ర వంటి కీలక అంశాలపై చర్చించేందుకు ఈ సమావేశం దోహదం చేస్తుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

## జీజీహెచ్‌లో వరికోస్ వెయిన్స్‌పై లేజర్ వర్క్‌షాప్



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్)** : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆదివారం వరికోస్ వెయిన్స్‌పై ప్రత్యక్ష లేజర్ వర్క్‌షాప్ విజయవంతంగా నిర్వహించారు. జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ వై. కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో, రేడియాలజీ, అనస్తీషియా విభాగాల సహకారంతో ఈ వర్క్‌షాప్ జరిగింది.

ఈ సందర్భంగా వాస్కులర్ సర్జన్ డాక్టర్ సి. రిషి కృష్ణ ఇద్దరు రోగులపై ట్యూమిసెంట్ అనస్తీషియా క్రింద లేజర్ శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. ఆధునిక శస్త్రచికిత్సా పద్ధతులపై అధ్యయనం చేయడానికి, అనుభవం పొందడానికి పీజీ విద్యార్థులకు ఈ కార్యక్రమం విలువైన అవకాశమని వైద్యులు అభిప్రాయపడ్డారు.

కార్యక్రమానికి జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి. రమణ, గుంటూరు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి ముఖ్య అతిథులుగా హాజరై వర్క్‌షాప్ విజయవంతం కావడానికి సహకరించారు.

## అసైన్‌మెంట్ పరీక్షల పుస్తకాలపై పునఃసమీక్ష అవసరం

**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్)** : ఈ విద్యాసంవత్సరంలో పరీక్షల కోసం విద్యాశాఖ ప్రవేశపెట్టిన అసైన్‌మెంట్ పరీక్షల పుస్తకాలపై ప్రభుత్వం పునఃసమీక్ష చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు విజ్ఞప్తి చేశారు.

గుంటూరు నగర శాఖ కార్యవర్గ సమావేశం లక్ష్మీపురంలోని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పి.సాయి విశ్వనాథ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన బొనిగల హైమారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో అన్ని కేడర్లలో 4,400 పోస్టులు మంజూరు చేయడం అభినందనీయమని తెలిపారు. గుంటూరు నగర పాలక సంస్థ ప్రాథమిక పాఠశాలల్లో తొలిసారిగా 42 ప్రాథమిక ప్రధానోపాధ్యాయుల పోస్టులు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. డీఎస్సీ-2025ను కేవలం నాలుగు నెలల్లో భర్తీ ప్రక్రియ పూర్తి చేయడం గొప్ప విషయం అని హైలైట్ చేశారు. ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, త్వరలో దసరా కానుకగా డీఏను ప్రకటిస్తే ఉపాధ్యాయులకు సంతోషకరంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా గుంటూరు నగర శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కె.వేణుగోపాల్, అధ్యక్షుడిగా కె.వీరరాఘవులు, ప్రధాన కార్యదర్శిగా టీ.శ్రీనివాసరావు, ఆర్థిక కార్యదర్శిగా షేక్ రషీద్ బాధ్యతలు స్వీకరించారు. అసోసియేట్ అధ్యక్షులుగా ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్.నాగరాజు, జి.ఎస్.ఎస్.ప్రసాద్, అదనపు ప్రధాన కార్యదర్శులుగా కె.పూర్ణచంద్రరావు, ఏ.వి.కృష్ణారావు, టీ.పూర్ణకుమార్, ఉపాధ్యక్షులుగా ఎం.రాములు నాయక్, ఎన్.క్రీస్తు రాజు, ఎ.వెంకటేశ్వరరావు, కార్యదర్శులుగా టీ.రవి, ఎస్‌కె.సుభాని, జి.టి.సుధీర్ కుమార్ ఎన్నుకోబడ్డారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్ ఖలీల్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.భాస్కరరావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పి.లలితబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ కనుమ పోలేరమ్మ అమ్మవారి రథోత్సవం

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్)** ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారికి నిప్పు తెచ్చిన శ్రీ కనుమ పోలేరమ్మ ఆలయం వద్ద ప్రతి ఆదివారం, శుక్రవారం, మంగ్లవారం రోజున శ్రీ అమ్మవారి గుడి చుట్టూ శ్రీ కనుమ పోలేరమ్మ అమ్మవారిని ఊరేగింపుగా రథోత్సవంను దేవాదాయ శాఖ కమిషనర్ రామ చంద్రమోహన్ ఆదేశాల మేరకు రథోత్సవాన్ని నిర్వహిస్తున్నామని మేనేజర్ ఈశ్వరయ్య చారి అన్నారు. శుక్రవారం ఉభయ దాతలైనా తోట్లపల్లి వాస్తవ్యులు రాజగోపాల్ రెడ్డి వారి ధర్మపత్ని హైమావతి మరియు వారి బంధువులు,భక్తుల మధ్య,రథోత్సవంను నిర్వహించాము ఈ కార్యక్రమం లో ప్రసాద్ పూజారి నాగలింగచారి సిబ్బంది చిన్న సుబ్బారాయుడు భక్తులు తది తరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## సభకు హాజరుకాకుండా ప్రభుత్వం గురించి మాట్లాడటం సరికాదు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చురకలు అంటించారు. ప్రజాప్రతి నిధుల ప్రవర్తన సమాజానికి ఆదర్శప్రాయంగా ఉండాలని సూచించారు. అసెంబ్లీకి కనీసం 50 రోజులైనా హాజరు కావాలనే నిబంధన తప్పనిసరి చేయాలని చెప్పుకొచ్చారు. సభకు హాజరుకాకుండా ప్రభుత్వం గురించి జగన్ మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు అయ్యన్నపాత్రుడు.
ఇవాళ(ఆదివారం) తిరుపతిలో రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల శాసనసభల మహిళా సాధికారత కమిటీ జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సులో అయ్యన్నపాత్రుడు పాల్గొని మాట్లాడారు. తిరుపతి లాంటి మహా పుణ్యక్షేత్రంలో మహిళా సాధికారిక సదస్సు జరగడం మంచి పరిణామమని ఉద్ఘాటించారు. మహిళలకు తండ్రి ఆస్తిలో సగం వాటా ఇచ్చినటువంటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌నేనని నొక్కిచెప్పారు. గతంలో ముఖ్యమంత్రిగా నందమూరి తారక రామారావు ఉన్నప్పుడు మహిళల ఆస్తి హక్కు గురించి చట్టం చేశారని గుర్తుచేశారు అయ్యన్నపాత్రుడు.
ఉద్యోగాల్లో మహిళలకు ఎన్టీఆర్ రిజర్వేషన్ తీసుకువచ్చారని ఉద్ఘాటించారు. స్వయం సహాయక బృందాల ద్వారా మహిళలను బలోపేతం చేసిన వ్యక్తి చంద్రబాబు నాయుడు అని నొక్కిచెప్పారు. ఒక మహిళను అసెంబ్లీకి స్పీకర్ చేసినటువంటి ఆంధ్రప్రదేశ్.. మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శప్రాయమని తెలిపారు. తిరుపతిలో మహిళా యూనివర్సిటీని పెట్టింది కూడా ఎన్టీఆరేనని గుర్తుచేశారు. ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ హోం మినిస్టర్‌గా వంగలపూడి అనితను పరిచయం చేశారు. ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గంలో ముగ్గురు మహిళలకు సీఎం చంద్రబాబు స్థానం కల్పించారని ఉద్ఘాటించారు. మిగిలిన రాష్ట్రాలు కూడా ఈ విషయాన్ని ఆదర్శంగా తీసుకోవాలని అయ్యన్నపాత్రుడు సూచించారు.

## లోక్‌సభ ర్యాంకిగ్స్‌లో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి 11వ ర్యాక్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** లోక్ సభలో పార్లమెంట్ సభ్యుల పర్ఫామెన్స్ రిపోర్ట్‌ను పార్లమెంట్ ఆదివారం ఢిల్లీలో విడుదల చేసింది. 2024 జూన్ 24 నుంచి 2025 ఏప్రిల్ 4వ తేదీ వరకు పార్లమెంట్ సభ్యులు పాల్గొన్న డిబెట్లు, అడిగిన క్వశ్చన్స్, అ-టెండెన్స్ ఆధారంగా ఈ ర్యాంకులను పార్లమెంట్ ఇచ్చింది. ఈ నివేదికలో నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి 11వ స్థానంలో నిలిచారు. ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి లోక్ సభలో మొత్తం 78 ప్రశ్నలు అడగగా, 09 చర్చల్లో పాల్గొన్నారు. అదేవిధంగా లోక్ సభలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి హాజరు శాతం 82.35గా ఉందని పార్లమెంట్ నివేదిక విడుదల చేసింది.
నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి లోక్ సభలో 11వ ర్యాంక్ రావడం పట్ల నంద్యాల పార్లమెంట్ పరిధిలోని టీడీపీ నాయకులు, బైరెడ్డి అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

## 4 కళేబరాలు కలకలం



- ఒకే కుటుంబమని అనుమానం
- తిరుపతి జిల్లాలో కలకలం

**పాకాల(జర్నలిస్ట్ ఫైల్) :** తిరుపతి జిల్లాలో భయానక ఘటన వెలుగులోకి వచ్చింది. పాకాల మండలం పాకాలవారిపల్లిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురి మృతదేహాలు లభ్యమవడంతో కలకలం రేగింది. తల్లిదండ్రులు, ఇద్దరు చిన్నారులు మృతదేహాలు గుర్తించడం తీవ్ర కలకలం రేపుతోంది. శనివారం ఉదయం గ్రామానికి సమీపంలోని అటవీప్రాంతంలో పశువులను మేపుతున్న కాపరులు ఈ నాలుగు మృతదేహాలను చూసి భయాందోళనకు గురయ్యారు. వెంటనే గ్రామ పెద్దలకు, ఆ తర్వాత పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పరిశీలించారు. శరీరాలు చెదిరిపోయిన స్థితిలో ఉండటంతో నాలుగు రోజుల కిందట మృతి చెందినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. మృతదేహాల పక్కన మద్యం బాటిళ్లు, మాత్రల కవర్లు, దుస్తులు, చెప్పులు కనిపించాయి. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**కుటుంబ ఆత్మహత్యేనా?**

బాధితులు ఒకే కుటుంబానికి చెందినవారని పోలీసులు అనుమానిస్తున్నారు. మద్యం బాటిళ్లు, మాత్రలు, వస్తువులు అక్కడే లభించడంతో ఆత్మహత్య కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హత్య అవకాశాన్ని కూడా విస్మరించకూడదని అధికారులు పేర్కొన్నారు. మృతదేహాలను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల బృందం పోస్టుమార్టం నిర్వహించి మరణానికి గల ఖచ్చితమైన కారణాలను వెల్లడించనుంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. గ్రామస్థుల నుంచి సమాచారం సేకరిస్తున్నారు. బాధితుల వివరాలు పూర్తిగా తెలిసే ప్రయత్నం చేస్తున్నారు. ఒకేసారి నాలుగు మృతదేహాలు బయటపడటంతో పాకాల మండలం, పరిసర గ్రామాల్లో భయాందోళన వాతావరణం నెలకొంది. ఇలాంటి ఘటన ఇంతవరకు తమ గ్రామాల్లో జరగలేదరంటూ భయాందోళన వ్యక్తం చేశారు.

## ఏపీలో డయేరియా కలకలం

### న్యూ రాజరాజేశ్వరిపేటలో 300 దాటిన కేసులు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీలో డయేరియా కలకలం రేపుతోంది. విజయవాడ న్యూ రాజరాజేశ్వరి పేటలో డయేరియా కేసులు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. ఇప్పటికే బాధితుల సంఖ్య 300 దాటినట్లు సమాచారం అందుతోంది. కాగా నిన్నరాత్రి మరో 20 మంది ఆస్పత్రిలో చేరినట్టు సమాచారం. బాధితుల్లో విషమంగా ఉన్నవారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం మొత్తం 145 మంది బాధితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కోలుకున్నవారిని ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ చేస్తున్నారు. ఇక ఇప్పటికే బాధితులను మంత్రి నారాయణ పరామర్శించి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. మరోవైపు అధికారులు కులాయిల నీటి సరఫరా నిలిపివేసి 15 ట్యాంకర్లతో నీటిని సప్లై చేస్తున్నారు. డయేరియా కేసులు పెరగటంపై జిల్లా కలెక్టర్ లక్ష్మీశ స్పందించారు. డయేరియాపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ప్రతి ఇంటికీ హైజీన్ కిట్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సహాయం కోసం కంట్రోల్ రూమ్ నంబర్ 91549 70454కు కాల్ చేయాలన్నారు.

## పేర్ని నాని అసత్య ప్రచారాలు చేస్తున్నారు : మంత్రి కొల్లు రవీంద్ర ఫైర్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మాజీ మంత్రి పేర్ని నానిపై మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మచిలీపట్నం గొడుగుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానం భూములపై అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దేవస్థానం భూములపై ఇటీవల దుష్ప్రచారానికి దిగింది వైసీపీ. దేవుడి భూములను అన్యాక్రాంతం చేస్తున్నారని పేర్ని నాని సంచలన ఆరోపణలు చేశారు. పేర్ని నాని ఆరోపణలను తిప్పికొట్టారు మంత్రి కొల్లు రవీంద్ర. ఆదివారం) మచిలీపట్నం గొడుగుపేట వేంకటేశ్వరస్వామిని మంత్రి కొల్లు రవీంద్ర, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం. భక్తుల సమక్షంలో రూ.45లక్షల లీజు చెక్కు అందజేశారు. చెక్కు అందజేయడంపై భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడారు. గొల్లపూడిలో నేషనల్ హైవే పక్కన 40 ఎకరాల దేవస్థానం భూమిని.. రూ.5కోట్లతో విజయవాడ ఉత్సవ కమిటీ అభివృద్ధి చేస్తోందని పేర్కొన్నారు మంత్రి కొల్లు రవీంద్ర.
మచిలీపట్నం గొడుగుపేట వేంకటేశ్వరస్వామి



దేవస్థానం చరిత్రలోనే రికార్డు స్థాయిలో ఆదాయాన్ని సమకూర్చిందని ఉద్ఘాటించారు. దేవస్థానం భూములు ఎవ్వరికీ బదలాయింపు జరగడం లేదని స్పష్టం చేశారు. కేవలం విజయవాడ ఉత్సవ్ నిర్వహించడానికే 56 రోజుల పాటు లీజుకు ఇచ్చారని క్లారిటీ ఇచ్చారు. దీని ద్వారా దేవస్థానానికి రికార్డు స్థాయిలో రూ.45 లక్షల ఆదాయం సమకూరిందని నొక్కిచెప్పారు. కొంతమంది చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని భక్తులను కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దేవస్థానం భూములు అన్యాక్రాంతం కావని స్పష్టం చేశారు. భవిష్యత్తులోనూ దేవస్థానానికి ఈ భూముల ద్వారా మరింత ఆదాయం వచ్చేలా కృషి చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

**దేవస్థానం భూములను లీజుకు తీసుకున్నాం: ఎంపీ కేశినేని శివనాథ్**

విజయవాడ ఉత్సవ్ నిర్వహణ కోసమే దేవస్థానం భూములను లీజుకు తీసుకున్నామని ఎంపీ కేశినేని శివనాథ్ వెల్లడించారు. అది కూడా దేవస్థానానికి భారీ ఆదాయం వచ్చేలా విజయవాడ ఉత్సవ కమిటీ నిర్ణయం తీసుకుందని వివరించారు. 56 రోజులకు రూ.45లక్షల లీజు మొత్తం స్వామివారి సన్నిధిలో ఇచ్చామని తెలిపారు. తాము వేంకటేశ్వరస్వామి భక్తులమ ఎలాంటి తప్పు చేయమని ఉద్ఘాటించారు ఎంపీ కేశినేని శివనాథ్. పార్లమెంట్ సమావేశాలు, ఉప రాష్ట్రపతి ఎన్నిక ఉండటంతో కొంత మిస్ కమ్యూనికేషన్ అయిందని చెప్పుకొచ్చారు. మసులా బీచ్ ఫెస్టివల్ స్ఫూర్తితో విజయవాడ ఉత్సవ్‌ను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రజలంతా ఈ ఉత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రతి సంవత్సరం వేసవిలో మసులా బీచ్ ఫెస్టివల్ దసరాకి విజయవాడ ఉత్సవ్ నిర్వహించి తీరుతామని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.

## ఎస్పీ బాలసుబ్రమణ్యం విగ్రహాన్ని సందర్శించిన మంత్రి దుర్గేష్

**రాజమహేంద్రవరం రూరల్ (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కందుల దుర్గేష్ ఆదివారం సాయంత్రం రాకా కల్చరల్ అసోసియేషన్, గోదావరి కల్చరల్ అసోసియేషన్ సభ్యుల ఆహ్వానం మేరకు ధవళేశ్వరం జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ కార్యాలయం సమీపంలో ఇటీవల ఆవిష్కరించిన పద్మవిభూషణ్ శ్రీపతి పండితారాధ్యుల బాల సుబ్రహ్మణ్యం విగ్రహం వద్దకు విచ్చేసి నివాళులు అర్పించారు. బాలు విగ్రహానికి పూలమాల వేసి తెలుగు పాటకు ప్రపంచ ఖ్యాతి తీసుకువచ్చిన మహనీయుడన్నారు. గాయకునిగా, నటునిగా, సంగీత దర్శకునిగా, నిర్మాతగా, డబ్బింగ్ కళాకారునిగా ఏ రంగం లోనైనా అత్యున్నత స్థాయిలో పరిపూర్ణత సాధించిన



గొప్ప కళాకారుడని కొనియాడారు. భారత ప్రభుత్వం భారతరత్న తో సత్కరించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇంకా ఎంతో భవిష్యత్తు ఉన్నా కరోనా మహమ్మారి తూటాకు బలై పోవడం మన దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో గాలి సుబ్బరాజు, రాకా ప్రధాన కార్యదర్శి జి.వి.రమణ, గోదావరి కల్చరల్ అసోసియేషన్ కార్యదక్షులు యర్రమోతు ధర్మరాజు, ముత్తాబత్తుల. ఏడుకొండలు, పుసులూరి. శేషుకుమార్, పి.వి.ఎస్.క్రిష్ణారావు, బర్రే.సుబ్రహ్మణ్యం, బబ్బిలి. శ్రీనివాసరావు, ముదెడ్ల.రమేష్, గాదిరాజు. రామరాజు, అప్పన. నాగభూషణం, రాకా ఉపాధ్యక్షులు తిరుమల క్రిష్ణమోహన్, ఎన్.వి.రావు, జనసేన నాయకులు ఎడ్ల మహేష్, బీర జయప్రకాష్, ఏఈ రాధాక్రిష్ణ, సత్తిరాజు, జలవనరులశాఖ సిబ్బంది పాల్గన్నారు. దుర్గేష్ గారిని దుశ్శాలువా, మెమెంటో, సావనీర్ లతో రాకా కల్చరల్ అసోషియేషన్, గోదావరి కల్చరల్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి అక్టోబర్ 7న ఫ్యాప్టో ధర్నా

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్)** ఉపాధ్యాయ, విద్యారంగ ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో ఆధ్వర్యంలో అక్టోబర్ 7వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ వద్ద రాష్ట్రస్థాయి ధర్నా నిర్వహించనున్నారు. పెండింగ్ బకాయిలు విడుదల చేయడంతో పాటు ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని ఫ్యాప్టో డిమాండ్ చేస్తోంది.
ఫ్యాప్టో ఉంచిన ప్రధాన డిమాండ్లలో ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యలను పరిష్కరించి విద్యాశాఖలోని అసంబద్ధతను తొలగించడం, 72, 73, 74 జీవోలను అమలు చేయడం ఉన్నాయి. పంచాయతీ రాజ్ యాజమాన్యంలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని, కలెక్టర్ పూల్ ద్వారా పోస్టింగులు ఇవ్వాలని కోరుతున్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, 2004 సెప్టెంబరు 1కి ముందు విడుదలైన నోటిఫికేషన్ ఆధారంగా నియామకమైన వారందరికీ కేంద్ర ప్రభుత్వ మెమో 57 వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.
ఉపాధ్యాయులకు బోధన తప్ప ఇతర బోధనేతర కార్యక్రమాలు లేకుండా చేయాలని, అసెస్మెంట్ పుస్తకాలను పునః సమీక్షించాలని ఫ్యాప్టో పేర్కొంది. హైస్కూల్ ప్లస్‌లలో వెంటనే ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాలని, 12వ పిఆర్సీని వెంటనే ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని కోరుతోంది. రిటైర్డ్ అయిన వారికి గ్రాట్యుటీ, కమ్యూటేషన్, లీవ్ ఎన్ క్యాష్మెంట్ వంటి బకాయిలను వెంటనే చెల్లించాలని, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను, 11వ పిఆర్సీ బకాయిలను, సరెండర్ లీవ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అసంబద్ధంగా వ్యవహరిస్తున్న చిత్తూరు జిల్లా డీఈఓను తక్షణమే తొలగించాలని, తెలుగు మాధ్యమాన్ని ఆంగ్ల మాధ్యమంతో పాటు కొనసాగించాలని, పరీక్షలను తెలుగులో రాసే అవకాశం కల్పించాలని ఫ్యాప్టో స్పష్టం చేసింది. గ్రేడ్-2 పండిట్లు, పీఈటీలకు పదోన్నతులు కల్పించడానికి సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల జిపిఎఫ్ సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఇకపుడు, ఈహెచ్ఎస్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల సమస్యలు తొలగించాలని, ఎంఈఓల బదిలీలను చేపట్టాలని, వేలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటంతో 1998 డీఎస్సీలో మిగిలిపోయిన అభ్యర్థులను నియమించాలని డిమాండ్ చేశారు. గురుకులాలు, రెసిడెన్షియల్ స్కూల్స్, సొసైటీల్లో ఉద్యోగ విరమణ వయసును 62 సంవత్సరాలకు పెంచాలని, బదిలీ అయి సబ్‌స్టిట్యూట్ లేని కారణంగా రిలీవ్ కాని ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని ఫ్యాప్టో స్పష్టం చేసింది.

## ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ఐక్యతే సమస్యల పరిష్కారం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో 10 లక్షలకు పైగా ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలు సంవత్సరాలుగా పరిష్కారం కానటానికి ప్రధాన కారణం సంఘాల విభజన, సమష్టి చర్య లోపమేనని హైదరాబాదులో స్థిరపడ్డ ఆంధ్రప్రదేశ్ పెన్షన్దారుల సంఘం ప్రధాన కార్యదర్శి టీ.ఎం.బి. బుచ్చిరాజు అభిప్రాయపడ్డారు.
2009కి ముందు సంఘాల నాయకత్వం దృఢంగా, నిబద్ధతతో, ముఖ్యంగా సమష్టి చర్యతో ఉండేదని గుర్తుచేశారు. ఒక్కో శాఖలో ఉన్న సంఘాలు పరస్పరం సహకరించి ఒకే వేదికపై నిర్ణయాలు తీసుకొని, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేవని వివరించారు. ఫలితంగా సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావడమే కాకుండా ప్రభుత్వంలో ఉద్యోగ సంఘాలకు గౌరవం ఉండేదని వ్యాఖ్యానించారు. అయితే 2009 తరువాత సంఘాల సంఖ్య పెరిగి, విభజన ఎక్కువ కావడంతో ఒకే సమస్యపై వేర్వేరు ఆందోళనలు జరిగి, ఉద్యోగుల గొంతు బలహీనమైందని చెప్పారు. కొంతమంది నాయకులు రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వడం వలన ఉద్యోగుల సమస్యలు పక్కనబడ్డాయని విమర్శించారు.

**భవిష్యత్తు కోసం ప్రతిపాదనలు :** ఉద్యోగి-ఉపాధ్యాయ-పెన్షనర్ల సమస్యలు సమర్థవంతంగా పరిష్కారం కావాలంటే సంఘాల ఐక్యత తప్పనిసరి అని వర్గాలు సూచించాయి. ప్రతి శాఖలో ఒకే జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఉండాలని, అన్ని శాఖల జేఏసీల చైర్మన్లు, ప్రధాన కార్యదర్శులు రాష్ట్ర స్థాయి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు చేసి ప్రభుత్వానికి సమష్టి ప్రతినిధులుగా వ్యవహరించాలని ప్రతిపాదించారు.

**ప్రధాన సమస్యలు :** ప్రస్తుతం ఉద్యోగులు-ఉపాధ్యాయులు-పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల్లో పెండింగులో ఉన్న పీఆర్సీ బకాయిలు, డీఏ/డిఆర్ చెల్లింపులు, కొత్త పీఆర్సీ ప్రకటించేవం-కు ఇంటరిమ్ రిలీఫ్, వైద్య బిల్లుల క్లియరెన్స్ వేగవంతం, హెల్త్ కార్డ్ లోపాల సవరణ, పెన్షన్ వర్గీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీయడం, ఉపాధ్యాయుల బదిలీలు-ప్రమోషన్లలో పారదర్శకత, సిబ్బంది లోటు భర్తీ, వేతన అసమానతల నివారణ, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, పాత పెన్షన్ పద్ధతి కొనసాగింపు, నూతన పెన్షన్ స్కీం రద్దు ప్రధానంగా ఉన్నాయి.
2009కి ముందు ఉన్నట్లే ఐక్యత, క్రమశిక్షణ, నిజాయితీతో కూడిన నాయకత్వం తిరిగి నెలకొంటేనే ఉద్యోగులు-ఉపాధ్యాయులు-పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలకు సమగ్ర పరిష్కారం లభిస్తుందని బుచ్చిరాజు స్పష్టం చేశారు.

## జగన్ కుహనా రాజకీయాలను కూటమి శ్రేణులు తిప్పికొట్టాలి

- మంత్రి నాదెండ్లమనోహర్

**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** డాక్టర్ బిఆర్. అంబేద్కర్ స్ఫూర్తితో రాష్ట్రంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ విలువలతో కూడిన రాజకీయాలతో కూటమి ప్రభుత్వం ద్వారా ప్రజాస్వామ్య విలువలు కాపాడుతుంటే, వైసిపి నాయకత్వం కుహనా, ఓటు బ్యాంక్ రాజకీయాలు చేస్తున్నారని జనసేన పిఏసి చైర్మన్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ వైసిపి నాయకుల తీరుపై తమదైన శైలిలో స్పందించారు. స్థానిక బోస్ రోడ్ లోని కూటమి పార్టీల కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, కుహనా రాజకీయాలతో, కోనసీమ జిల్లాలో, జనసేన పార్టీపై బురదజల్లే విధానాలను ఖండిస్తున్నామని అన్నారు. కైకలూరు, మచిలీపట్నం, అంబేద్కర్ జిల్లాలో అలజడి సృష్టించే విధానంలో, సహేతుకత లేదన్నారు. ప్రతిపక్షంలో ప్రజలపై, ప్రేమ కురిపిస్తారా, అధికారంలో ఉండగా, జగన్ ఫోన్ పరామర్శలు చేశారా అని ప్రశ్నించారు. కూటమి అధికారంలోకి రాగానే, ఫోన్ కాల్ ఓదార్పులు గుర్తుకొచ్చాయ, సుబ్రహ్మణ్యం



డోర్ డెలివరి, డాక్టర్ సుధాకర్ ని పిచ్చివాడిగా సృష్టించినప్పుడు పరామర్శలు ఏమైనాయన్నారు. కుళ్ళు రాజకీయాలు, కుహనా విధానాలలను జనసేన, కూటమి శ్రేణులు తిప్పికొట్టాలన్నారు. ప్రజలు కోరుకునే ప్రశాంతత, అభివృద్ధి,రాష్ట్రానికి, పెట్టుబడులు, యువతకు ఉద్యోగాలు దిశగా, కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుంటే, రాష్ట్రాభివృద్ధి నచ్చని జగన్, ప్రెస్ మీట్ లు, పెట్టి తమ నీచవైఖరిని బయటపెట్టుకుంటున్నారని, రైతుకు మేలు జరిగినా, జగన్ ఓర్వలేక పోతున్నారని మంత్రి మనోహర్ తమదైన పంథాలో విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చాక, గతపాలకులు పెంచి పోషించిన, గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపడాన్ని జగన్ భరించలేక పోతున్నారని, కూటమి నాయకులు, పార్టీ శ్రేణులు, కూటమి ప్రభుత్వ ప్రయోజనాలు పొందుతున్నవారు, జగన్ కుట్రలను, దష్ప ప్రచారాన్ని ప్రశ్నించాలన్నారు. తమ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పై ఉద్దేశ్య పూర్వకంగా చేస్తున్న, ఆరోపణలు చూస్తుంటే, మనసు కలిచివేస్తుందన్నారు. జగన్ వైఖరి మార్చుకోవా లన్నారు. క్షేత్రస్థాయిలో ఎవరికి అన్యాయం జరిగినా, పవన్ కల్యాణ్ అదేశాలమేరకు తగు విధంగా ముందుకు వెళుతున్నామని, వైసిపి బూటకపు విధానాలను ప్రజలు గమనించాలన్నారు. మీడియా సమావేశంలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

## 'థాంక్యూ లోకేష్ సార్'అవిష్కరించిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని నెరవేర్చుతూ డీఎస్సీ నిర్వహించింది. ఈనెల 19న ముఖ్యమంత్రి చంద్రబాబు డీఎస్సీ లో అర్హత సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలపడం కోసం తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం 'థాంక్యూ లోకేష్ సార్' అనే పోస్టర్‌ను పెమ్మసాని చంద్రశేఖర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. అవకాశం దొరికిన ఈ వేడుకలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎన్.వి. జగదీష్ కుమార్, జిల్లా అధ్యక్షులు పసల బాలస్వామి, ప్రధాన కార్యదర్శి పాలేటి జగదీష్ బాబు, ఖజానాదారి శ్రీనివాస్ రెడ్డి, సహాధ్యక్షులు జి.వి. శ్రీధర్, డీఈఓ పూల్ భాషా పండితులు జి.ఎన్. జయలక్ష్మి, ఆర్. శ్రీవాణి, గౌరవ సలహాదారులు కె. ఫణి దత్తు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి చెందాక పుట్టిన సామాజిక వర్గాన్ని విస్మరించవద్దు



**పాపవినాశనం(ఘంటసాల) (జర్నలిస్ట్ ఫైల్)** వివిధ రంగాలలో అభివృద్ధి చెంది,లక్ష్యాలను సాధించిన తరువాత పుట్టిన సామాజిక వర్గాలను విస్మరించకూడదని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు తెలిపారు. ఘంటసాల మండలం పాపవినాశనం దళితవాడకు చెందిన చిట్టూరి వీరాంజనేయులు మెగా డీఎస్సీలో ఉద్యోగం సాధించగా ఆదివారం సురేష్ బాబు ఆయన ఇంటికి వెళ్లి సురేష్ బాబు అభినందించారు. ఈసందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూఎస్సీ,ఎస్టీ లకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్పించిన హక్కులు,రిజర్వేషన్ ఫలాలను వినియోగించుకొని ఉన్నత లక్ష్యాలను సాధించిన వ్యక్తులు అదే సామాజిక వర్గంలో అట్టడుగు స్థానాల్లో ఉన్న వారిఅభివృద్ధికి చేయూతనిచ్చేలా చొరవ చూపాలని అన్నారు. తద్వారా బి.ఆర్ అంబేద్కర్ జీవిత ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ జీవన విధానం అలవర్చుకోవాలన్నారు. సమాజం లో బలహీన వర్గాల ప్రజలలో చైతన్యం,అభివృద్ధి అంబేద్కర్ పుణ్యమే నని స్పష్టం చేశారు. ఎస్సీ,ఎస్టీ లకు రాజ్యాంగంలో కల్పించిన అవకాశాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేదరికం లాంటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా ఆత్మవిశ్వాసం,మనోధైర్యంతో చదువును కొనసాగించి ఉద్యోగం సాధించిన వీరాంజనేయులు యువతకు స్ఫూర్తిగా నిలిచాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత విశేషాలతో కూడిన పుస్తకాన్ని ఆంజనేయులు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు మునిపల్లి బుజ్జి, జూనపూడి కిరణ్,మహిళా పోలీస్ నజరయ కుమారి,జి. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండ ...అదే మా అజెండా



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్) :** కార్యకర్తలకు అన్ని విధాలా అండగా నిలవడంతో పాటు వారి ప్రతి కష్టంలో తోడుగా నిలుస్తున్నట్లు శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి వెల్లడించారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి తమ అధినేత వైయస్ జగన్ ఎలాగైతే కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారో... తాము కూడా ఆయన అడుగుజాడల్లో నడుస్తూ... దాన్నే తమ ప్రధాన అజెండాగా మార్చుకున్నట్లు చెప్పారు.
కంటి నరం దెబ్బతిని శంకర కంటి ఆసుపత్రిలో చికిత్స అనంతరం పొట్టి శ్రీరాములు నగర్ 7వ లైనులోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న శ్రీ మోహన రంగనాయక స్వామి ఆలయ ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు రాచపూడి సుబ్బరాజును ఆదివారం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా తమకు కార్యకర్తల సంక్షేమం చాలా ముఖ్యమని తెలిపారు. చాలా పార్టీలకు కేవలం ఎన్నికల సమయంలోనే కార్యకర్తలు గుర్తొస్తారనీ... తమ పార్టీ అందుకు పూర్తి విరుద్ధమన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి నుంచి మాజీ ముఖ్యమంత్రి జగన్ వరకు పార్టీ కార్యకర్తల మంచి చెడులు చూసుకుంటూ ముందుకు సాగడమే తమకు తెలిసిన సిద్ధాంతమని చెప్పారు. ఈ క్రమంలోనే వైయస్ జగన్ ఆదేశాల మేరకు తాము ఎప్పటికప్పుడు స్వయంగా కార్యకర్తల ఇళ్ళకు వెళ్ళి వారి క్షేమ సమాచారాలు తెలుసుకోవడమే కాక వారికి అండగా నిలుస్తున్న విషయం అందరికి తెలిసిందేనని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), బోడపాటి కిషోర్, వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, పార్టీ నేతలు రెడ్డి కోటేశ్వరరావు, ప్రసన్న, శంకర్, పండ్ల నారాయణ, చందు తదితరులు పాల్గొన్నారు.

## చేబ్రోలు కుటుంబానికి ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి సంతాపం



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్) :** మాజీ మంత్రి చేబ్రోలు హనుమయ్య తనయుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త చేబ్రోలు రాజేంద్ర ప్రసాద్ భార్య సరస్వతీ దేవీ అకాల మరణం పట్ల శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆదివారం వారి నివాసంలో సరస్వతీదేవి చిత్రపటానికి పూలతో ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం చేబ్రోలు రాజేంద్ర ప్రసాద్, ఆయన కుమారుడు అశోక్, చేబ్రోలు నరేంద్ర ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467